ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక




భావనగర్ మహారాజా

మద్రాసు గవర్నర్ శ్రీకృష్ణ కుమార్ సింహ్‌జీ భావసింహ్‌జీ

15-9-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు

★ మదరాసు క్రొత్తగవర్నరు అధికార స్వీకారం ★



మదరాసు ప్రధాని ఓమండూరు రెడ్డిగారు గవర్నరు సతి భావనగరు మహారాణీగారితో నిలచియున్నారు.



క్రొత్తగవర్నరు (మహారాజా)గారు సైన్యాధికారితో కరస్పర్శ గావించుట.




ప్రధాన న్యాయమూర్తి పి. వి రాజమన్నారుగారు భావనగరు మహారాజాగారిచేత మద్రాసు గవర్నరుగా ప్రమాణస్వీకారము చేయించిరి మహారాజా ప్రక్కన నిలబడినది వారి సతి.



మద్రాసు గవర్నర్ భావనగర్ మహారాజా శ్రీకృష్ణ కుమార్ సింహ్జీ భావసింహ్జీ



భావనగరు మహాజా గారు ఊరేగింపు ముగిసినాక సైనికుల వందనము స్వీకరించుట.



గవర్నరుగారు సైనికులను దర్శించుట.

ఆంధ్రపత్రిక

సంవత్సర చందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము 41

సంచిక 2

Founder : K. NAGESWARA RAO

సర్వధారి సంవత్సర భాద్రపద శుద్ధ ద్వాదశి బుధవారము



మాజీ మద్రాసు గవర్నరు దంపతులు



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ సెప్టెంబరునెల 15-వ తేది బుధవారము

జిన్నా

జిన్నా ఆకస్మికమరణము దేశమునకు సంతాపము కలుగజేసినది. భారత నాయకులు పాకిస్థానుకు సానుభూతి సందేశముల నంపిరి.

మృతుల విషయమున గౌరవనీయమైన స్మరణతప్ప విద్వేష భావచ్ఛాయలనైనను మిగుల్చుకొనుట నాగరకలక్షణము కాదు. మహాత్ముని అహింసాసిద్ధాంతము, అజాతశత్రుత్వమూ, భారతజాతిలో ఈ మాత్రమైన జీర్ణించియుండకపోయిన, దేశవిభజనతోనూ, మతకలహఘోరములతోనూ ఏ వ్యక్తినామము సమస్ఫురణ వహించుచూ వచ్చినదో ఆతని మృతికి భారతదేశము, ఇంత సహజముగా సంతాపమును వెలిబుచ్చగలిగి యుండెడిది కాదు.

జిన్నా విజ్ఞానవంతుడు. కీర్తికాముడు. తన మతానుయాయులకందరికి ఒకజాతిగా భావన కల్పించి, సహజ నైసర్గిక దేశీయ, జాతీయ భావనలకు, జన్మసిద్ధమైన మాతృదేశభక్తికి బదులుగా మతవిషమైకజాతీయభావమును, జాతీయభక్తిని పురికొల్పి, అమాయక ప్రజాహృదయమునకు ఆకర్షణీయముగా కన్పడు కృతకోద్రేకమును కల్పించి, దేశప్రపంచ పరిస్థితులను తన వాదమునకు అనుకూలముగ త్రిప్పుకొనుటలో ప్రతిభను చూపించి, దేశమును విభజించి, పాలకుడై తన పట్టు నెగ్గించుకొనుటలో కృతకృత్యుడైనాడు. ఇంత సాధించగలుగుటకు తన భావములలో జిన్నాకు గల గాఢవిశ్వాసమే కారణము. తను తప్ప ఒరులెవ్వరూ, తాను భావించిన ప్రగతిని మహమ్మదీయులకు కూర్చిపెట్టలేరన్న అచంచల ఆత్మవిశ్వాసమే అతనిని పాకిస్థానుకు నియంతృసమానునిగా జేసినది. ఫలితమేమైనను, తత్సాధనలోని, తీవ్ర ఋజుత్వమును, వ్యక్తిగతముగా అతని సచ్చరిత్రమునూ, అతని ప్రతికక్షులుకూడా గౌరవించునట్లు చేసి అతనికి గౌరవనీయమైన స్థానమును చేకూర్చినది. అచంచల ఆత్మవిశ్వాసము, ఏకాగ్రనిష్ఠత, వ్యక్తిగతజీవితములో ఋజువర్తనము కేవలము ఈ లక్షణములే, ఒక వ్యక్తి నెట్టి ఉన్నతస్థితికి తీసికొనిపోగలవో గ్రహించుటకు జిన్నా జీవితమే ప్రబల తార్కాణము.

ప్రజాస్వామ్యభావములు ప్రబలిన యుగములో, మత విషమైక జాతీయ భావము కృతకమూ, అసహజమూ అని భావించు యుగములో, మధ్యయుగములనాటి మతోద్రేకముతో, స్వజాత్యుత్కృష్ట అహంకారముతో, విజాతి విద్వేషముతో, విస్తృత భారతదేశమున ఒక విశాల భూఖండమును పూర్వ రాచరికపు వాసనలతో నున్న మతైక రాజ్యముగా జిన్నా ఎట్లు స్థాపించగలిగెననునది భవిష్యచ్చరిత్ర పాఠకులకు విస్మయము కల్గింపకతప్పదు.

జిన్నా యౌవనమున భారత జాతీయతతోనే ప్రేరితుడైనాడు. హిందూ ముస్లిం సఖ్యత అత్యవసరమని భావించి తీవ్రకృషియే చేసినాడు. 1913 లో ముస్లింలీగు, కాంగ్రెసులమధ్య సమరస భావమును సాధించగలినాడు. స్వతంత్ర భారతదేశైక్యతా స్వరూపము నే భావించినాడు. బ్రిటిష్‌వారి చాణక్య నీతికి బంటు గాకుండ, మింటో-మార్లీ సంస్కరణలను ఎదిర్చి, ముస్లిం ప్రత్యేకనియోజకవర్గీకరణముల అపాయమును గుర్తించి, సర్వభారతదేశ క్షేమమునకే నిల్చినాడు.

కాని ఆనాటి భారతీయనాయకుల వ్యక్తిత్వములమధ్య జిన్నా వ్యక్తిత్వమున కంత ఉన్నత స్థానము కలుగుటకాస్కారము లేకపోయినది. తన రాజకీయ ప్రపంచము తను కేంద్రముగా పరిభ్రమించని హీననాయకస్థితితో జిన్నా అహంకరణము తృప్తి పడలేకపోయినది. రాజకీయములకు దూరస్థుడై కొంతకాలము నిలుచుటయే జిన్నాకు తప్పనిసరి అయినది.

ఈ నిలుచుటకు వేరు కారణము కూడ కలదు. జిన్నా తనలో రాచరికపు 'రాజసా'న్ని, (అరిష్టోక్రసీని), పెంపొందించుకొన్నాడు. సామాన్య మానవులమధ్య 'భాయీభాయీ'గా సంచరించు ప్రజాస్వామ్య నాయక స్వభావము ఆతని సహజప్రకృతికి విరుద్ధము. ప్రజాసమూహముల నుద్రేకపరచగల వక్తృత్వ మాతనికి మిన్నగానే గలదు. కాని ఆ యుద్రేకముల రెచ్చగొట్టుటకు, విజ్ఞానవంతులకు గల భయమంతయు ఆతనికి మొదటిలో నుండెడిది. కాని మహాత్ముని ప్రజామధ్యజీవనమును, తత్ఫలితమైన విస్తృతప్రభావమును చూచిన జిన్నా, తన నాయకత్వమునకు, వేరు మార్గమున ప్రజల హృదయమును ఆకర్షించగల నినాదము ముఖ్యమని గ్రహించినాడు. అలగాజనమందరితో సన్నిహితసంబంధముల కల్పించుకొనుట యతని చిరాకు. అందుకై వక్తృత్వప్రభావ మాత్రముచేతనే, అమాయక ప్రజాహృదయమునకు సులభగ్రాహ్యమగు బూజు పట్టిన మధ్య యుగముల మత నినాదమును, తన వ్యక్తిజీవితమునకు, తన పూర్వ విజ్ఞానమునకును విరుద్ధమైనదైనను అండగా తీసికొని ప్రచార మొనర్చి ముస్లింప్రజలలో ప్రభావ మేర్పరచుకొన్నాడు. ఒక పరిస్థితిలో నున్న ప్రజామానసికప్రవృత్తికి, నిత్యపరిచయమున గౌరవాభావమును, దూరస్థ గౌరవమును సహజములు. రాజ్యాధిపతి, మతాధిపతి మొదలైన ఉన్నత ప్రవృత్తులు సామాన్యుని కందుబాటులో లేకున్ననే సామాన్యులపై వారి ప్రభావ మని నమ్ము తరగతిలోవాడు జిన్నా. ఆ విధముగనే, ఒక వర్గములో తన ఆధిక్యప్రభావములు పెంపొందించుకొనగలుగుటకు తగిన వర్గమానసికస్థితిని, తదనుయాయియైన ప్రత్యక్షోపయోగభ్రమను కల్పించు మత నినాదమును, పూర్తిగా వినియోగించుకొనుటలో జిన్నా కృతకృత్యుడైనాడు.

బ్రిటిష్ వారి పరిపాలనా విధానమువలన ఎక్కువ ప్రయోజనము పొందగలుగు ఆస్కారమును వెంటనే గ్రహించి, తన నాయకత్వమును స్థిరపరుచుకొనుటకు, బ్రిటిష్ ఇండియా ప్రభుత్వపరిపాలనా విధానమును పూర్తిగా వినియోగించుకొన్నాడు. అంతేకాదు: బ్రిటిష్‌వారి రాజనీతి యొక్క విజయము, అవసరసమయములందు, మూఢునివలె వ్యవహరించగల విజ్ఞానమేనని బెర్నార్డుషా ఒకచో చమత్కరించినాడు. ఎదుటివాని వాదము సంపూర్ణముగ గ్రహించియు, ఏ మాత్రము అర్థముకానట్లు వ్యవహరించగల విజ్ఞానమును, జిన్నా బ్రిటిష్‌వారి వద్ద నేర్చుకొనెను. మహాత్ముడు ప్రపంచములో ఏ వ్యక్తినైనను సమాధానమునకు తేగలిగెనుగాని, ఎన్ని మార్గ ప్రయత్నించినను జిన్నాను సమాధానపరచలేకపోయెను. ఇంతటి ఆత్మసంకల్ప దార్ఢ్యముగల ఈ వ్యక్తి, విశ్వకల్యాణయుతమై ప్రగతిగతికమైన సంకల్పపూరితుడై కృషించిన ప్రపంచమున జిన్నాకు సాటివచ్చెడి వ్యక్తి యుండియుండెడివాడు కాదు.

ఇప్పటి పాకిస్థాన్ నాయకులు, జిన్నా కార్యదీక్షను, ఋజువర్తనమును ఆదర్శముగా గ్రహించి, ఆధునిక ప్రజాయుగమున కనువైన ప్రజాస్వామ్య భావప్రేరితులయి, విశ్వకల్యాణాదర్శములతో కృషిచేసిన, జిన్నా సృష్టించిన పాకిస్థాన్, తన మాతృ అభినివేశ దేశమగు భారతదేశమున కండయై నిలిచి ప్రపంచ శాంతిస్థాపనకు మూలస్తంభము కాగలదు.

ఏకకాలమందే పరిష్కారము కావలెను

భాషారాష్ట్ర విచారణసంఘమునకు ఆంధ్రనాయకులలో పిన్నలు పెద్దలు కూడ సాక్ష్యము నిచ్చిరి. అందరు ఏకకంఠముతో ప్రత్యేకాంధ్ర రాష్ట్రము తప్పనిసరిగ ఏర్పడుట అవసరమని వాదించిరి. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ ఎన్. జి. రంగాగారు, నూతన రాజ్యాంగము ఆమోదింపబడువరకు ఆంధ్రరాష్ట్ర నిర్మాణము ఆపియుంచరాదనియు, ఈ లోపలనే ఏర్పాటు కావలెననియు సూచించినట్లు తెలియుచున్నది. తక్షణము ఆంధ్రరాష్ట్ర నిర్మాణము జరుగవలెననీ దానికి సరిహద్దు తగవులు ఆటంకమైన, కనీసం ఇపుడున్న 11 జిల్లాల సరిహద్దులతో రాష్ట్ర నిర్మాణము కావలెననీ శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులుగారు సూచించిరట. సరిహద్దు తగవులను తరువాత పరిష్కరించుకొనవచ్చు నని వీరి అభిప్రాయము. శ్రీ వెంకటప్పయ్యగారి సూచన 1947 సెప్టెంబరున మద్రాసులో జరగిన ఆంధ్ర రాజకీయ మహాసభవారు చేసిన తీర్మానమును స్ఫురణకు తెచ్చుచున్నది. ఆ తీర్మానము కేంద్ర ప్రభుత్వ ఆర్డరు ద్వారా సత్వరము రాష్ట్రమును సృష్టించమని కోరినది. నూతన రాజ్యాంగము అమలు జరుపువరకు ఆపియుంచకూడదని శ్రీ రంగాగారు చెప్పుటవల్ల, పరిషత్తుద్వారా కాకనే ఆంధ్రరాష్ట్ర నిర్మాణము జరుగవలెనని వారి అభిప్రాయమని ఊహించవలసి వచ్చుచున్నది. 1947 సెప్టెంబరు ఆంధ్ర రాజకీయ సభకు శ్రీ రంగాగారు అధ్యక్షత వహించిరి. నూతన రాజ్యాంగము అమలు జరుగుటకు ముందుగనే ఆంధ్రరాష్ట్రము ఏర్పడిన అంతకన్న కావలసినది లేదు. కాకపోయిన ఆలస్యమగునని సరిహద్దుల పరిష్కారము ఎప్పటికో వాయిదా వేయుటకు అంగీకరించుట హర్షణీయమా అనునది సందేహము. వరుసక్రమములోనున్న ఆంధ్ర భాషా ప్రాంతమునంతనూ, ప్రత్యేకరాష్ట్రముగ ఏర్పాటుచేయుటయే ప్రత్యేకాంధ్రరాష్ట్ర నిర్మాణ ఆశయము. అట్టి సందర్భములో ఏ కారణమునుబట్టికూడ సరిహద్దుల మాట తేలనిదే రాష్ట్రము ఏర్పడవలె

నేటి ప్రపంచం :

వలసల భవిష్యత్తు
జెనీవా సభలో ఇండియా శ్రద్ధ

"హల్లో ఫ్రెంచి లియైజాన్ ఆఫీసరేనా మాట్లాడుతున్నది?"

"ఔనౌను."

"ఐతే, మీరు ఒక శవపేటికకోసం ఆర్డరిచ్చినట్టున్నారు. దాన్ని నిమిషాలమీద బర్లిన్ సిటిహాల్ వద్ద సిద్ధపరుస్తున్నాను"

"నేను అలాంటి ఆర్డరేదీ ఇవ్వలేదే!"

"అబ్బే—ఆర్డరిచ్చినా, ఇవ్వకపోయినా ఏం ఫరవాలేదు. ఒకటి తయారుచేసి పంపుతున్నాను. త్వరలోనే మీకు ఒక శవపేటికతో అవసరం ఏర్పడబోతున్నది."

ఇది బర్లిన్ నగరంలోని ఫ్రెంచి లియైజాన్ ఆఫీసరు మేజర్ జార్జెస్ మ్రజోవిచ్‌తో, టెలిఫోన్ ద్వారా, ఈమధ్య బర్లిన్ నగరంలోనే వుండే మరొక వ్యక్తి జరిపిన సంభాషణ.

ఈనాడు జర్మనీ రాజధాని బర్లిన్ నగరంలో ఎంత అశాంతి తాండవిస్తున్నదో గ్రహించడానికి పై సంభాషణ ఒక మంచి ఉదాహరణ.

పశ్చిమ రాజ్యప్రతినిధులు ముగ్గురూ మాస్కో నగరంలో సోవియెట్ నాయకులతో ఎంత కాలం సంప్రతింపులు జరిపినా, బర్లిన్‌లో నల్గురు అగ్రరాజ్య మిలిటరీ గవర్నర్లూ తమ తమ ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం ఎన్నిసార్లు సంభాషణలు జరిపినా బర్లిన్ ప్రతిష్టంభనగాని, జర్మనీ సమస్యగాని పరిష్కారధోరణిలో పడడం అసంభవంగానే కనిపిస్తున్నది. గతవారాంతాన బ్రిటిష్, ఫ్రెంచి, అమెరికన్, సోవియెట్ మిలిటరీ గవర్నర్లు నల్గురూ వరసగా ఐదురోజులపాటు సమావేశమై చర్చలు జరిపేసరికి బర్లిన్ నగరంపై సోవియెట్ అధికారులు ఇప్పటికి దాదాపు మూడు నెలలనుంచీ సాగిస్తున్న దిగ్బంధన సమాప్తం కాబోతున్నదని ప్రపంచం ఆశించింది; కాని, ఆ ఆశ నిరాశ అయింది. దిగ్బంధన యథాప్రకారం సాగుతూనే వున్నది: పశ్చిమ ప్రాంత ప్రతినిధులకు తూర్పున వున్న సోవియెట్ ఆక్రమితప్రాంతంవారికీ మధ్య నేటికీ తీవ్రఘర్షణ జరుగుతూనేవున్నది. లా మాక్రమించిన బర్లిన్‌ప్రాంతప్రజలకూ వివిధసామగ్రినీ పశ్చిమ రాజ్యాలు విమానాలద్వారానే సప్లయి చేసుకోవలసివస్తున్నది.

ఇది ఇలా వుండగా పశ్చిమ బర్లిన్‌కు చెందిన పురపాలకసంఘసమావేశాలుకూడా సవ్యంగా జరుపుకోడానికి వీల్లేకపోతున్నది. ఈ వారం ప్రారంభంలో సిటీహాలులో పురపాలకసంఘ సమావేశం జరుగుతూండగా దాదాపు నాల్గువేల మంది కమ్యూనిస్టులు ఎర్రజెండాలు ధరించి, సిటీహాల్‌ను ముట్టడించి, ప్రతికూలప్రదర్శనలు జరిపి, సమావేశం సాగకుండా చేశారు. సిటీహాల్ సోవియెట్ ఆక్రమిత బర్లిన్ ప్రాంతంలో వున్నది కాబట్టి, అక్కడికి పశ్చిమప్రాంతంవారెవరూ రాకూడదనీ, వస్తే అరెస్టు చేయడానికి, తమకు అధికారం వున్నదనీ రష్యా అధికారానికి లోబడి పనిచేసే జర్మన్ నగర పోలీసులు ప్రకటించారు. నగర పశ్చిమప్రాంతానికి చెందిన పోలీసులను సైతం రష్యన్ అధికారులు అరెస్టు చేసి, బేడీలు వేయడం జరిగింది,

ఇది జరిగిన మూడురోజులకే దాదాపు రెండున్నరలక్షలమంది బ్రిటిష్ ఆక్రమిత బర్లిన్ ప్రాంత ప్రజలు కమ్యూనిస్టులకు ప్రతికూలంగా బ్రహ్మాండమైన ప్రదర్శనలు సాగించారు. ఈ ప్రదర్శనం బ్రిటిష్ ప్రాంతంలోనే జరిగినప్పటికీ, సోవియెట్ సైనికులు ప్రదర్శనలపై కాల్పులు సాగించి దౌర్జన్యచర్యకు పూనుకున్నారు. ఈ అశాంతి కారణంగా పశ్చిమ బర్లిన్ పురపాలక సంస్థ తన సభాస్థలిని 'సిటీహాల్' నుంచి బ్రిటిష్‌ప్రాంతానికి మార్చుకోవలసి వచ్చింది.

పశ్చిమ ప్రజాస్వామ్యరాజ్యాలకు, రష్యాకు మధ్య సిద్ధాంతరీత్యా ఏర్పడిన తీవ్ర విభేదాలు బర్లిన్ ప్రజలకు సైతం వ్యాపిస్తున్నవన్నమాట.



ఈ విషయ సంఘటనల కారణంగా నల్గురు మిలిటరీ గవర్నర్లు జరిపిన సంప్రతింపులు విఫలమై, ప్రతిష్టంభన ఏర్పడింది. బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచి ప్రభుత్వాలు ఈ ప్రతిష్టంభనను జాగ్రత్తగా గమనించి, అపరమైన సంప్రతింపులు జరుపుకుంటున్నవి. జర్మనీ రాజధానిలో కమ్యూనిస్టులు సాగిస్తున్న దుష్ప్రయత్నాలను ప్రతిఘటించడానికి తాము కృతనిశ్చయులై వున్నట్లు ప్రెసిడెంట్ ట్రూమన్ ఈమధ్య హెచ్చరిక చేశాడు. ఆరు నూరైనా, నూరు ఆరైనా బర్లిన్‌లో తమ హక్కులు వదలుకోవడం కల్ల అని కూడా స్పష్టపరిచాడు. ఏదోవిధంగా ఇరకాటంలో పెట్టి బర్లిన్‌నుంచి పశ్చిమరాజ్యాల ప్రతినిధులను తరిమివేయాలని రష్యా చూస్తున్నది. జర్మనీరాజధానిలో పశ్చిమరాజ్యాల దుర్బలపరిస్థితిని సాకుగా తీసుకునే రష్యా ఈ పని చేస్తున్నది.

ఈ ప్రతిష్టంభనపై స్టాలిన్‌తో మరొకసారి సంప్రతించవలసిందని బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచి ప్రభుత్వాలు మాస్కోలోని తమ ముగ్గురు ప్రతినిధులకూ ఆదేశించినట్లు తెలుస్తున్నది. బర్లిన్‌నగర ప్రస్తుత పరిస్థితినిబట్టి చూస్తే, క్రెమ్లిన్‌భవనంలో ఈసారి జరిగే సమావేశమే ఆఖరుసమావేశం కావచ్చునని తోస్తున్నది.

బర్లిన్ సమస్యను సామరస్యముతో పరిష్కరించడంపైనే యూరప్‌ఖండ శాంతే గాక, ప్రపంచశాంతి కూడా విశేష భాగం ఆధారపడి వుంటుంది...అందుచేతనే మాస్కో సమాలోచనల పర్యవసానం కోసం ప్రపంచం ఆదుర్దాతో నిరీక్షిస్తున్న మాట నిజం.

ప్రస్తుతం జనీవాలో అస్వతంత్ర వలస భూభాగాలకు చెందిన ఒక ప్రత్యేక సంఘం సమావేశమవుతున్నది. ఇది ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన సంఘం. ప్రపంచం మొత్తంమీద వివిధ సామ్రాజ్య దేశాలకూ చెందినవి 74 వలస భూభాగాలు వున్నవి. బ్రిటన్, బెల్జియం, అమెరికా, ఫ్రాన్సు, ఆస్ట్రేలియా, డెన్మార్కు, హాలెండు, న్యూజీలెండు—ఇవి వలసరాజ్యాధిపత్యం వహిస్తున్న దేశాలు. ఈ ఎనిమిది సామ్రాజ్య దేశాల ప్రతినిధులతోపాటు, రష్యా, ఇండియా, చైనా, ఈజిప్టు, స్వీడన్, కొలంబియా, క్యూబా, నైకారగ్వా దేశాల తరఫున ఎనిమిదిమంది ప్రతినిధులుకూడా ఈ జెనీవా చర్చలలో పాల్గొంటున్నారు. భారతదేశప్రతినిధిగా సుప్రసిద్ధ పత్రికారచయిత బి. శివరావుగారు పనిచేస్తున్నారు.

ఐక్యరాజ్యసమితి స్థాపించిన ఈ ప్రత్యేక సంఘంలో 16 దేశాల ప్రతినిధులు చర్చలు ప్రారంభించిన మొదటిరోజునే, భారత ప్రతినిధి అస్వతంత్రరాజ్యాలపై పరిపాలనాధ్వర్యం వహించే విషయంలో సామ్రాజ్యదేశాలు పాటించవలసిన కొన్ని ప్రధాన అంశాలను సూచిస్తూ ఉపన్యసించారు. ఈ సూచనలు: (1) సామ్రాజ్యదేశాలు వలసభూభాగాలపై పరిపాలన ఏవిధంగా సాగిస్తున్నదీ పరిశీలించడానికి ఏర్పడిన ఈ 16 రాజ్యాల ప్రత్యేక సంఘం శాశ్వతంగా వుండాలి. సామ్రాజ్య దేశాలు పంపే పరిపాలనా నివేదికలను పరిశీలించి, ఈ సంఘం ఐక్యరాజ్య సమితికి తనకు తోచిన సిఫార్సులను అంపజేస్తుండాలి. (2) ప్రత్యేక సంఘం ఐక్యరాజ్యసమితితోనే ప్రత్యక్ష సంబంధాన్ని కలిగివుండాలిగాని, సమితి నియమించే మరొక ఉపసంఘంతో వుండకూడదు. ఈవిధంగా చేసినట్టయితే ఈసంఘగౌరవ మర్యాదలు, పలుకుబడీ ఎక్కువ కాగలవు. (3) ప్రస్తుతం ప్రత్యేక సంఘంలో వున్న 16 స్థానాలలో ఎనిమిదింటిని సామ్రాజ్య దేశాలే ఆక్రమించి వున్నవి. ఏ అంశంపైన వోటు తీసుకొన్నా, అటుఇటు సమానమైన వోట్లు వచ్చి ప్రతిపాదన వీగిపోయే అవకాశం వున్నది కాబట్టి, వలస రాజ్య ప్రాతినిధ్యాన్ని తగ్గించివేయాలి. (4) సామ్రాజ్యదేశాలు వలసల పరిపాలనపై అందజేసే నివేదికలతోపాటు కావలసిన అదనపు విషయాలను ఐక్యరాజ్యసమితి ప్రధానకార్యదర్శి ద్వారా ఈ సంఘం సేకరించుకోడానికి వీలు వుండాలి.

ఇప్పటికీ ప్రపంచంలో అస్వతంత్రమైన అనేక వలస రాజ్యాలు వున్నవి కాబట్టి, ఈ కమిటీ కార్యకలాపాలు అతి ప్రధానమైనవి ఈ వలసలలో ఎక్కువభాగం ఆసియా, ఆఫ్రికా ఖండాలలో వుండడం మరీ ప్రధానమైన విషయం. ఇటీవలవరకు అస్వతంత్రమైవున్న నవ భారతదేశం వలస రాజ్యాల భవిష్యత్తు విషయములో విశేషశ్రద్ధ చూపడం సహజం. భారత ప్రతినిధి జనీవాసభలో సరిగా ఇదే విషయాన్ని మిగత ప్రతినిధులందరికీ స్పష్టపరిచాడు. భారత ప్రతినిధి సూచనలు బ్రిటన్, హాలెండు మొదలయిన సామ్రాజ్య దేశాలకు ఆట్టే రుచించి వుండకపోవచ్చును. రష్యా, ఈజిప్టు ప్రతినిధులు భారత ప్రతినిధి ప్రతిపాదనల బలపరిచారు. ఇండియా సూచనపట్ల అమెరికా కొంతవరకు సుముఖభావాన్నే చూపింది. ఐక్యరాజ్యసమితి ప్రతినిధులకు అవసరమైతే ఆయా వలసభూభాగాలకు వెళ్లి అక్కడి సామ్రాజ్య పరిపాలనను ప్రత్యక్షంగా పరిశీలించే హక్కు సైతం వుండాలని రష్యాప్రతినిధి కులజెంకో మరొక ప్రతిపాదన చేశాడు.

ఈవలసరాజ్య పరిపాలనావిధానం "స్థిరోభవ, వరదోభవ" అని శాశ్వతంగా వుంటుందని బ్రిటిష్‌ప్రభుత్వం అనుకోవడం లేదనిచెప్పి బ్రిటిష్ ప్రతినిధి ఫైదర్‌కుక్ తప్పుకున్నాడు. ఇంతకూ వలసరాజ్య పరిపాలనవిషయంలో ఐక్యరాజ్య సమితికి విశేషాధికారాలుఇవ్వడం ఈ సామ్రాజ్య రాజ్యాలకు ఇష్టంలేదు.

ఇండోచైనా ఫ్రెంచివారి వలస భూభాగమైతే, ఇండోనీసియా డచ్చివారి వలస భూభాగం. దశాబ్దాలు, శతాబ్దాలు సామ్రాజ్యాధిపత్యంకింద వున్నా, ఆర్థికంగా పీల్చి పిప్పిచేయడమేగాని సామ్రాజ్యాధిపత్యదేశాలు ఈ వలస ప్రజలను ఏవిధంగానూ అభివృద్ధిలోకి తీసుకొనిరావు.

ఇండోచైనా, ఇండోనీసియాలు రెండూ ఆసియాఖండంలో ఫ్రెంచివారు, డచ్చివారు స్థాపించిన వలసరాజ్యాలు. ద్వితీయ సంగ్రామానంతరం ఇక్కడ జాతీయస్వాతంత్ర్యోద్యమం సాగుతున్నది. అన్యజాతుల ఆధిపత్యాన్ని ఆసియాఖండం సహించదనే విషయాన్నీ, ఆసియా సగం అస్వతంత్రంగా, సగం స్వతంత్రంగా వుండడం అసంభవమనీ సామ్రాజ్యాధిపత్య దేశాలు ఇప్పటికీ గమనించకపోవడం శోచనీయం. ఇండోచైనా జాతీయవాదులు డా॥ హోచిమిన్ నాయకత్వంకింద ఫ్రెంచివారిపై తిరిగివిజృంభించినట్లు, ఇండోనీసియాలో రిపబ్లికన్ వాదులపై డచ్చిసామ్రాజ్యాధికారులు పెద్దయెత్తున ముట్టడులు సాగిస్తున్నట్లు వార్తలు వస్తున్నవి. ఇండోచైనా, ఇండోనీసియాలు రెండిటిలోనూ ఫ్రెంచి, డచ్చివారు అనేక విపరీత నిర్బంధాజ్ఞలను అమలు పరుస్తున్నారు. స్థానికప్రజల చిరకాల స్వాతంత్ర్య వాంఛను కాలానుగుణంగా పరిగణించడానికి బదులు డచ్చి ఫ్రెంచి సామ్రాజ్యవాదులు ప్రతీపధోరణినే, పాత సామ్రాజ్యవిధానాన్నే అనుసరిస్తున్నారు. అస్వతంత్రత కారణంగా ఆర్థికాభ్యున్నతి సాధించడానికి ఆసియా ప్రజలకు అవకాశం లేకపోతున్నది. ఇందువల్లనే వివిధప్రాంతాలలో దౌర్జన్యశక్తుల విశృంఖల విహారం సంభవిస్తున్నది. సామ్రాజ్యాధిపత్యం సమాప్తమై స్వాతంత్ర్య స్థాపన జరిగినప్పుడే, బర్మాలోవలె వివిధ ప్రతీప శక్తులను జయప్రదంగా ప్రతిఘటించి, శాంతి సాధన సంభవమవుతుంది. అప్పటివరకూ ఆసియాలో అశాంతి రూపుమాయదు.

ననుట ఉచితము కాదు; వాంఛనీయము కాదు. ఏదో ఒక రూపములో రాష్ట్రమేర్పడిన చాలు ననుకొనుట మన ఆత్రమునకు నిదర్శనము గాని దూర దృష్టికి నిదర్శనము కాదు. రాష్ట్ర నిర్మాణముతోబాటు సరిహద్దులు పరిష్కారము కాకపోయిన అవి అలాగే నిలిచిపోగలవు. కాబట్టి ఈ రెండు అవిభాజ్యములు. అవసరమైన రాష్ట్ర నిర్మాణమునకు కొంత కాలము అగవచ్చునుగాని సరిహద్దు తగవును వాయిదా వేయుటకుమాత్రము అంగీకరింపకూడదు.

పశువుల దివాణం

మూలం
జార్జి ఆర్వెల్

హాస్యకల్పితమైన
పెద్దకథ
౨

అనువాదం:
శ్రీ జనమంచి రామకృష్ణ

సమావేశం జరిగిన మూడో నాటిరాత్రి ముసలి పంది చచ్చిపోయింది. మార్చిమాసం ప్రవేశించింది. అప్పటినుంచి పరాసరి, ఏకబిగిని మూడుమాసాలవరకూ రహస్యప్రచారం జరిగింది. ముసలిపంది ఉపన్యాసఫలితంగా ఎక్కువ తెలివి గల జంతువులు తమ జీవితాలను ఒక నూతనదృష్టితో చూడ్డం మొదలెట్టాయి. ముసలి పందిసూచించిన విప్లవం ఎప్పుడొస్తుందో వాటికి తెలియదు. వాటి జీవితకాలంలో అటువంటి శుభ సమయ మాసన్నమేతుందని ఆలోచించలేక పోయినా, విప్లవానికి దారితీయవలసినది, సిద్ధపరచవలసిన విధి తమదనిమాత్రం జంతువులు గ్రహించాయి. జంతువుల నన్నిటినీ కూడతీయడానికి, అనుచరాస్యలుగా చేయడానికి సహజంగా తెలివైన పందులు నియమింపబడ్డాయి. పందుల్లోకల్లా తెలివైనవి కన్నయ్య, గునపమూ. కన్నయ్య అట్టే మాటలకారి కాదు. తనపని తాను చేయించుకోగల సామర్థ్యం కలదనిమాత్రం ప్రతీతి. గునపము మాటలకారి. క్రొత్తక్రొత్త ఊహాలన్నీ తట్టే మనస్సు కలది. చిన్నతరహా పందుల్లో రాడీ అనేది ఒక టుంది. ఎక్కడా కాలు నిలవదు, అతిచలాకీ ఐనది. రాడీని మాటలలో ఎవరూ ఓడించలేరు. నందిని పందిగానూ, పందిని నందిగానూ మార్చగల తెలివితేటలు గలది అది.

కన్నయ్య, గునపం, రాడీ కలిసి ముసలిపంది సూక్తుల నన్నింటినీ క్రోడీకరించి ఒక సిద్ధాంతంగా తయారుచేసి, పశుతత్వమని పేరెట్టాయి. ఎన్నో రాత్రులు, ముసలిరత్తయ్య నిద్రపోగానే ఆ మూడుపందులూ, పశువుల సావిడిలో రహస్యంగా సమావేశాలు జరిపి, పశుతత్వాన్ని గురించి జంతువులకన్నిటికీ తెలియచెప్పాయి. మొదటిసారి సమావేశమైనప్పుడు కొన్ని జంతువులు, తెలివితక్కువగా, యజమానిపట్ల చూపవలసిన విశ్వాసం మొదలైనవాటిని గురించి మాట్లాడడం మొదలెట్టాయి.

"రత్తయ్య మనకి తిండి పెడుతున్నాడు. ఈ దివాణంనుంచి మన మతనిని తరిమివేస్తే, మన కింక తిండిపెట్టేవా రెవరు? అప్పుడు మన మంతా మలమల మాడి చచ్చిపోవలసిందేగా!" అంటూ కొన్ని జంతువులు విప్లవానికి విరుద్ధంగా మాట్లాడాయి. మరికొన్ని "మన తదనంతరం జరగబోయే విషయంగురించి మన మందరం, సుఖాన ఉన్న ప్రాణాలను దుఃఖమయం చేసుకోడంలో అర్థం లేదు. పైగా, ప్రస్తుతం అనుభవించనిదానికోసం ఎందుకు మన జీవితాలను త్యాగం చేయాలి?" అని ప్రశ్నించాయి వాటికి సమాధానాలు చెప్పడంతోనే మూడుపందులకీ సరిపోయింది. పశుతత్వానికి, ఏ ఒక్క జంతువూ, వ్యతిరేకంగా తిరిగి మాట్లాడకూడదనీ, పశుతత్వాన్ని సరిగ్గా అవగాహన చేసుకొన్నవాడు, ఎటువంటి సందేహాలూ మనస్సులో మొలకెత్తవనీ చెప్పి, పందులు, పశుతత్వాన్ని పునః విశదీకరించాయి. అన్ని జంతువులకంటే తెలివితక్కువగా ప్రవర్తించింది పంకజాక్షి.

"విప్లవానంతరం కూడా కలకండ ఉంటుందా?"

"ఉండదు. ఈ దివాణంలో కలకండ తయారీకి సావకాశంలేదు. పైగా, నీకు కలకండ అవసరం ఏమిటి? శుభ్రంగా కావలసినంత గోధుంపొట్టూ, పచ్చగడ్డీ తినవచ్చు"నని కన్నయ్య పంకజాక్షిని మందలించింది.

"పోనీ, ఈ ఎర్రరిబ్బనలు కట్టుకోవచ్చా?"

"నేస్తం! ఆ యెర్రరిబ్బనలు చూసుకుని ఎందుకలా మురిసిపోతున్నావో నా కర్థం కావడంలేదు. అ రంగుపీలికలు దాస్య చిహ్నాలు. ఈ రిబ్బనులకంటే స్వేచ్ఛ ఎక్కువ ప్రాణప్రదమైందని నమ్మవా?" అని కన్నయ్య పంకజాక్షిని అడిగింది.

జమీందారుగారి దివాణంలో ఒక్కకోడి ఒక టుంది. దానిపేరు తురాయి. తురాయంత అబద్ధాలకోరు మరో జంతువు లేదు. పైగా రత్తయ్య దానిని అపురూపంగా పెంచుతూండడంచేత, అక్కడా ఇక్కడా విన్న మాటలన్నీ మరినాలుగు కల్పించి, అతని చెవికి మోయడం బాగా అలవాటు. ఎన్ని దుర్గుణాలున్నా, తురాయి చమత్కారంగా మాట్లాడగలదు. మాట్లాడడంలో చూపే చమత్కారం పనిచేయడంలో చూపకపోడంచేత జంతువులన్నింటికీ తురాయంటే చాలా కోపము.

కన్నయ్య, గునపం, రాడీల అడుగుజాడల్లో నడుస్తూ, పశుతత్వాన్ని సరిగ్గా అర్థం చేసుకున్నవి పంచకల్యాణి, జాకీ. గుర్రాలు రెండూ కొంచెం మేధకు లవడంచేత, చెప్పింది సరిగ్గా అర్థం చేసుకోలేకపోయేవి. ఐనాసరే, నాయకులైన కన్నయ్య, గునపం, రాడీలపట్ల అమితమైన విశ్వాసం కలిగి వుండేవి. పశువుల సావిడిలో, ఏ సమయంలో సమావేశం జరిగినాసరే ఇష్టం దని అనుకోక గుర్రాలు హాజరై పశుతత్వప్రబోధగీతాన్ని పాడేందుకు తక్కిన జంతువులకి నాయకులుగా నిలబడేవి.

జంతువులలో అంత ఏకమత్యం వుందని ఎవ్వరూ అనుకోలేదు. తత్ఫలితంగా విప్లవం రు పంతాల్చ మొదలెట్టింది; తగిన సదవకాశాలు కూడా తటస్థపడ్డాయి. రత్తయ్యలో ముసలితనం ముసురుకోడంచేత, ముమ్మటంత హెచ్చరికతో దివాణం వ్యవహారాలు చూసుకోలేకుండా వుండిపోతున్నాడు. పైగా త్రాగుడు హెచ్చిపోయింది. ప్రతిరోజూ, ప్రొద్దున్నా రాత్రీ తప్పక పశువులశాల కొచ్చి, జంతువుల నన్నిటినీ చూసిపోతూండేవాడు వెనక. ఇప్పుడలా రావడం మానేశాడు. అతని వాగ్దానాన్ని అండగా చేసుకుని, తక్కిన దివాణంనౌకర్లందరూ నడుంవంచి పనులు చక్కబెట్టడం మానుకున్నారు. పొలాలన్నీ బీళ్ళయిపోయాయి. పశువులశాలకప్పు కూలిపోడం మొదలెట్టింది. పొలాల కట్టవాలన్నీ పడిపోడంచేత, బైటి గొడ్లన్నీ వచ్చి, పొలాలను ధ్వంసంచేసి పోతున్నాయి. దివాణం జంతువులన్నీ తిండిలేక మలమల మాడిపోవం సాగించాయి.

కుప్పలు నూర్చే కాలం మాసన్నమయింది. సంక్రాంతి పండుగముందే కుప్పలు నూర్చే రత్తయ్య, ఆనాటే మరచిపోయి పక్కనున్న కల్లుపాకలో కూర్చున్నాడు. పాలేరాళ్లు దూడలను వదిలి పాలు పితుక్కనిపోయారు. ఎవ్వరూ కూడా గొడ్లకి నాలుగుగడ్డిపరకలైనా వేయలేదు. జంతువులన్నీ ఆకలితో హాహాకారాలు చేయసాగాయి. వాటికి వెర్రికోపం వచ్చింది. ఆగలేక రాటలకు కట్టిన తాళ్లను తెంచుకుని బైట పడ్డాయి. ఆవులన్నీ, ఒక్కటొక్కటే, బైట కొచ్చి నిలబడ్డాయి. ఆ సమయంలోనే తాగిన మత్తులో రత్తయ్య నలుగురు పాలేరాళ్లని వెంటేసుకుని కొరడాలు ఝుళిపిస్తూ పశువుల సావిడివైపు వచ్చాడు. అనుకోకుండా, అప్రయత్నంగా అన్ని జంతువులూ, ఒక్కసారి రత్తయ్యబృందం మీదికి విరుచుకుపడ్డాయి. వాళ్ళంతా అన్ని పక్కలనుంచీ, జంతువులచేత కొమ్ములపోట్లూ, గిట్టలతన్నులూ తిన్నారు. ఏం చేయగలరు? జంతువు లావిధంగా ప్రవర్తించడం ఎప్పుడూ వాళ్లు చూడలేదు. ఎప్పుడూ, మానవులచేత చచ్చేలా జంతువులు దెబ్బలు తినడం ఉండిగాని, జంతువులచేత మానవులు దెబ్బలుతినడం ఆశ్చర్యంగా ఉంది. ఆ తాకుమారుకి తట్టుకోలేక రత్తయ్యావాళ్ళూ కాళ్ళకి బుద్ధిచెప్పారు. గోచీ లూడిపోతూ ప్రాణాలకోసం పరుగెడుతూన్న మనుష్యులూ, వారిని వెన్నంటి తరుముతూన్న జంతువులూ ఏ మాధ్యశ్యం

ఆ దృశ్యాన్ని కిటికీగుండా చూస్తున్న రత్తయ్యభార్య చేతికి దొరికిన వస్తువుల్ని మూటకట్టుకుని, బైటికి పారిపోయింది. విజయోత్సాహంతో జంతువులన్నీ దివాణంలోకి పురోగమించి, రత్తయ్య ప్రభృతులు తిరిగి రావడానికి సావకాశం లేకుండా సింహద్వారం బిడాయించాయి. అనుకోకండా, హఠాత్తుగా విప్లవం చెలరేగడం—విజయవంతమవడం—జంతువులకి అమితోత్సాహం, ఆనందం కలిగింది. మానవుణ్ణి తొలగించారు; దివాణం జంతువుల కైవసమైంది.

వెర్రిఆనందం కలగడంచేతా, హఠాత్తుగా దివాణమంతా వాటి వైపోడచేతా, అంత భాగ్యంతో ఏంచేయాలో జంతువులకి తెలిసింది కాదు. ప్రథమంగా కలిగిన విజయసూచనగా, జంతువులన్నీ—పెద్దవీ చిన్నవీ—కలిసి, దివాణంచట్టూ పరుగెత్తుతూ గెంతడం మొదలెట్టాయి మానవు డెక్కడైనా ఇంకా నక్కి ఉన్నాడేమో అనే అనుమానంతో, అవి మూలమూలలా వెతికాయి. తర్వాత, రత్తయ్య నిరంకుశత్వపరిపాలనాచిహ్నాల నన్నిటినీ నాశనం చేసేందుకని, భవనంలోకి పరుగెత్తాయి. ముక్కుతాళ్లూ, పలుపులూ, కుక్కల గొలుసులూ, కత్తులూ—అన్నిటినీ—నూతిపాలు చేశాయి. మండుతూన్న మంటలో కొరడాలూ, రంగురంగుల రిబ్బనుపీలికలూ, పరశురామప్రీతి అయాయి.

"నేస్తాడూ! రిబ్బనులు మానవచిహ్నమైన దుస్తులే. వాటిని మనం విసర్జించాము. జంతువులన్నీ నగ్నంగానే ఉండాలి" అని కన్నయ్య అంది.

కన్నయ్యమాటలు విన్న పంచకల్యాణి, వేసవిలో నెత్తికి పెట్టుకునే గడ్డిటోపీ తీసుకొచ్చి, మంటలో పడేసింది. రత్తయ్యని జ్ఞాపకం తెచ్చే ఏ చిన్నవస్తువునుకూడా ఉంచకుండా తగలపెట్టేశాయి.

గునపం, జంతువులన్నింటినీ ధాన్యంపాతర గదులవేపు తీసికెళ్లి, కడుపునిండా తిండి పెట్టింది. తర్వాత, అన్నీ కలిసి 'మూగజీవాలు' ప్రబోధగీతం ఒక ఏడుసార్లు పాడాయి. తర్వాత సుఖంగా ఎవరికి తోచిన చోట, అవి స్వేచ్ఛగా, హాయిగా నిద్రించాయి.

యథాప్రకారంగా జంతువులన్నీ, తెల్లవారఝామున లేచాయి. సంపాదించుకొన్న స్వాతంత్ర్యంమాట జ్ఞప్తికి రాగానే, అతన్నీ, స్వేచ్ఛావాయువులను పీల్చుకుంటూ ఛంగ్ ఛంగ్‌మని పొలాలమ్మట గెంత నారంభించాయి. పొలాల కోమూలగా ఒక చిన్న కొండ వుంది. ఆ కొండమీది కెక్కి జంతువులన్నీ స్వంతమైపోయిన దివాణాన్ని చూసుకుని మురిసిపోయాయి. చూపుకి ఆనినంత మట్టుకూ వాళ్ళదే! ఆనందం పట్టలేక, నేలమీద పడి, మంచులో పొర్లాయి. చాతీలు విరుచుకుని ఎంతో సేపు, దివాణంలో పచార్లుచేశాయి.

జంతువులన్నీ తిరిగి భవనంవైపు వెళ్లాయి. కాని, లోపల ప్రవేశించడానికి జంకాయి. కన్నయ్య, గునపంముందు కొచ్చి మూతులతో తలుపు తోయగానే తక్కినవన్నీ వరుసగా, ఒకదానివెనకాతల ఒకటి నడుచుకుంటూ లోపల ప్రవేశించాయి. జమీందారుగారు అనుభవిస్తూన్న వస్తువుల నన్నిటినీ ఆశ్చర్యంతో చూశాయిగాని, ముట్టుకోలేదు. మేడ దిగి వస్తూండగా, పంకజాక్షి మాయమైంది. వెంటనే జంతువులన్నీ తిరిగి వెనక్కి నడిచి పంకజాక్షిని వెతకడం ప్రారంభించాయి. హంసతూలికతల్పాలతో అమర్చబడిన జమీందారుగారి పడకగదిలో అద్దాని కెదురుగా, రిబ్బను పట్టుకుని పంకజాక్షి నిలబడి ఉంది రిబ్బనులకోసం వెర్రివ్యామోహం పడుతూన్న పంకజాక్షిని మందలించి జంతువులన్నీ బైటకొచ్చేశాయి. జమీందారుగారి భవనాన్ని వస్తుప్రదర్శనశాలగా వుంచేందుకు తీర్మానించాయి. ఏజంతువూ కూడా ఆ భవనంలో నివసించకూడ దని ఒప్పందం చేసుకున్నాయి.

భవనంఇవతల సమావేశమైన జంతువులతో కన్నయ్యాగునపా లిలా అన్నాయి

"నేస్తాలూ! తెల్లారి అట్టే పొద్దెక్కలేదు. ఈ వేళ మనం కుప్పలునూర్చడం ప్రారంభించాలి. అన్నట్లు అన్నిటికన్నా ముఖ్యమైన విషయం మరొకటుంది." అని పందులు చదవడం, వ్రాయడంగురించి చర్చ సాగించాయి. రత్తయ్య పిల్లలకాలూరు సివమాపుస్తకం ఒకటి పెంటకుప్పమీద పడిఉంటే, అది తీసుకుని, కన్నయ్య గునపం, మూడుమాసాలపట్టి చదవడం, వ్రాయడం సాధనచేశాయి. నలుపురంగు, తెలుపురంగు గల కుండలను ముక్కలను తెమ్మని, కన్నయ్య దివాణంసింహద్వారంవైపు నడిచింది. వ్రాయడం బాగా నేర్చుకొన్న గునపం, ముందరికాళ్ళ రెంటితోనూ వాటంగా కుంచె పట్టుకుని 'పశువుల దివాణం' అని పెద్దపెద్ద అక్షరాలలో ఒక బోర్డు వ్రాసి దివాణంసింహద్వారానికి తగిలించింది. కన్నయ్యా, గునపం తిరిగి ధాన్యంపాతరగదులవేపు నడిచాయి. మూడుమాసాల విద్యాకృషిఫలితంగా పశుతత్వసిద్ధాంతాన్ని సప్తవిధులక్రింద క్రోడీకరించగలిగాయి. పశువుల దివాణంలో నివసించే జంతువులన్నీ శాస్త్రబద్ధంగా పశుతత్వాన్ని అనుసరించి జీవితాలను గడిపేందుకూ, ఎల్లవేళలా సప్తవిధులనూ ఆచరణలో పెట్టవలసినట్లు హెచ్చరికగా ఉండేందుకూ, ఆ సప్తవిధులనూ గోడమీద వ్రాయడానికి పందులు నిశ్చయించాయి. కష్టంమీద గునపం, నిచ్చెనెక్కి నిలబడింది అందుబాటులో రాడీ రంగుకుండ పట్టుకు నిలబడింది. ఒక ముప్పైగజాల దూరాన్నుంచైనాసరే, తడుముకోకుండా చదివేటంత పెద్ద అక్షరాల్లో సప్తవిధులూ వ్రాయడమైంది.

సప్తవిధులు

1. ద్విపాదప్రాణి ఏదైనా సరే పరమశత్రువు.

2. చతుష్పాదప్రాణి, లేక పక్షములు గల దేదైనా సరే మిత్రుడు.

3. ఏ జంతువూ దుస్తులు ధరించకూడదు.

4. ఏ జంతువూ పక్కమీద పరుండకూడదు.

5. ఏ జంతువూ మద్యపానము చేయకూడదు.

6. ఏ జంతువూ ఏ జంతువునైనసూ చంపకూడదు.

7. అన్ని జంతువులూ సమానము.

తక్కిన జంతువుల కర్థమయేందుకు గునపం గట్టిగా చదివింది. అన్ని జంతువులూ నచ్చినట్లు తలలూపాయి. వాటిలో, అతి తెలివిగలవి మాత్రం సప్తవిధులనూ కంఠస్థంచేసుకోడం మొదలెట్టాయి. కుంచె కింద పారేస్తు గునపం—"నేస్తాలూ! పొలంలోకి నడవండి. రత్తయ్యా, పాలేరాళ్ళకంటే, అచిరకాలంలోనే, మన మంతా కలిసి, కుప్పలు నూర్చేయాలి." అని అంది. ఆ సమయంలో, పాలన్నీ పొదుగుల్లో పేరుకుపోయి బాధకలిగించడంచేత మూడావులు 'అంబా' అంటూ కొదామరెత్తినట్లు అరిచాయి. సాధనంకోసం ఆలోచించి చివరకు పందులు, బిందెలు తెచ్చి, ముందరికాళ్ళతో పాలు పితికేశాయి.

"అన్నిపాలూ యేంచేస్తారు!" అని రొట్టవేసుకుంటూ కొన్ని జంతువు లడిగాయి.

"పాలగురించి మీరేమీ ఆలోచించ నవసరం లేదు. ముఖ్యమైంది కుప్పలు నూర్చడం. గునపం దారిచూపుతుంది. మీరంతా పొలంలోకి నడు

(18 వ పేజీ చూడుడు)

బళ్లారిజిల్లా ఆంధ్రరాష్ట్రప్రాంతమే!

శ్రీ పి. నారాయణరెడ్డి

బళ్లారి జిల్లాయందు ఆంధ్రులు, కర్ణాటకులను రెండు తెగలవా రున్నారు. పశ్చిమ తాలూకాలగు కూడ్లిగి, హరపనహళ్ళి, హడగలి తాలూకాలలో కర్ణాటకులసంఖ్య అధికము. కనుక యవి కర్ణాటకమునకు జేరవలసియున్నవి. తూరుపు తాలూకాలగు ఆదవాని అలూరు బళ్లారి రాయదుర్గములలో తెలుగు వారి సంఖ్య యధికము. ఇవి నిరభ్యంతరముగా ఆంధ్రప్రాంతమున జేర్పదగియున్నవి. పోగా మిగిలిన హాసపేట సిరుగుప్పలలో ఆంధ్రకర్ణాటకులు సమపాళ్లుగా నున్నారు. గనుక వీటిని విమర్శించి యితర కారణముల బలీయత ననుసరించి యే ప్రాంతమునకు జేర్చుటకు యోగ్యముగా నుండునో ఆలోచించవలసియున్నది

బళ్లారిజిల్లా స్వతస్సిద్ధముగా కర్ణాటక ప్రాంతమని కర్ణాటకులును, ఆంధ్రప్రాంతమని ఆంధ్రులును తగవులాడుకొనుచున్నారు. యే ప్రాంతమునందైనను రెండు భాషలవా రున్నప్పుడు అందొకరు దేశీయులును, రెండవ వారు వలసవచ్చినవారును అయియుందురు. యీ మండలమున కాంధ్రులు వలసవచ్చిరో కర్ణాటకులు వలసవచ్చిరో మనము విమర్శించుకొందము. ఒక ప్రాంతమునుండి మరియొక ప్రాంతమునకు ప్రజలు వలసవచ్చుటకు గల యనేక కారణములలో మన ప్రస్తుతానుభవమును బట్టి, చూచినను రాజకీయములు బలీయకారణముగా గనబడుచున్నది. రాజకీయము విప్లవము, విస్తృతి యని రెండురకముల వర్తిల్లుచుండును. యీ కొండల ప్రస్తుత పరిస్థితికి రెండును దోహదమొసగియున్నవి. మొదటిది విప్లవము. ప్రస్తుతము హైదరాబాద్ సంస్థానమునుండి లక్షలకొలదిగా హిందువులు మన ప్రాంతమునకు వలస వచ్చుచున్నారు. విజాతీయపరిపాలనము ముఖ్యముగా అన్యమత పరిపాలన యిట్టి వలసకు ముఖ్య కారణము. హిందూమతమువలె యితర మతముల నాదరించు మతము లెన్నోయుండవు. పైగా పరమతనిరసనమునందు ఇస్లామున కగ్రతాంబూల మొసగవలసినదే. మనరాష్ట్రమునకు పశ్చిమోత్తరములయందు చాలకాలమునుండి మహమ్మదీయ రాజ్యము లున్నవి. అవి పలుసారులు మతోన్మాదమున ప్రవర్తించిన నిదర్శనములు గూడా గలవు. మతదృష్టితోనైననేమి, రాజ్యతృష్ణతోనైననేమి, యవి మన దక్షిణహిందూస్థానమంతటిని గూడ కల్లోలిత మొనర్చుచుండెను. ఆ కాలమున కేవల మహమ్మదీయ విజృంభణమునరికట్టుటకే శ్రీ విద్యారణ్య భగవానునిచే విద్యానగర సామ్రాజ్యము సృజింపబడెను. అదియే క్రమక్రమముగా పరమతబాధితులగు దాక్షిణాత్య హిందువుల కేకైకశరణ్యమయ్యెను. ఆ దినాలలో పెక్కుసందర్భములందు విజాపూరు, అహమ్మద్ నగర్, బీదరు మున్నగు ప్రాంతములనుండి ప్రస్తుతము హైదరాబాదునుండివలెనే తండోపతండములుగా హిందువులు వలసవచ్చి విజయనగర ప్రాంతమగు మన బళ్లారిమండలము నిండియుండుడు. విజాపూర్ మొదలగునవి కర్ణాటకప్రాంతములగుటచే అట్లు వలసవచ్చినవారే మన కర్ణాటకసోదరులై యుందురనుట సయుక్తికముగా తోచుచున్నది. హిందూ సామ్రాజ్యపు ప్రాపునందు వారిందే నిలిచియుందురు. వలసవచ్చిన ప్రజలకు మరియొక విశేషలక్షణమేమనగా వారు తమ మాతృభాషను, దేశభాషను రెంటినిగూడా నేర్చియుందురు. దేశీయుల కట్టి పరిస్థితి కవసరముండదు. యీ లక్షణమునుబట్టి చూచినను యీ జిల్లాయందు కర్ణాటకులనుకొను వారందరికి తెలుగు వచ్చును. కాని ఆంధ్రులకు కన్నడము రాదు. సామాన్యముగా వలసవచ్చిన ప్రజలు ధైర్యశాలురును, బుద్ధిమంతులును, శ్రీమంతులును గూడా అయియుందురనుటకు ప్రస్తుత హైదరాబాద్ కాందిశీకులే నిదర్శనము. కొందరు దీర్ఘదర్శులు ఉపద్రవములనుండి చాలా ముందుగానే సురక్షిత ప్రదేశముల జేరియుందురు, మరికొందరు ప్రత్యుత్పన్నమతులు కాలానుసరణముగ ప్రవర్తింతురు. తదితర దీర్ఘసూత్రులు ఎట్టి అవమానసంకటములనైనను విధిలేక సహించుచునందె పడియుందురు. వారు వలసలు గట్టలేరు. వలసగట్టుటకు గూడా కొంత సాహసము దీర్ఘదర్శిత్వ మవసరము. యీ లక్షణములయందు కొన్ని మా బళ్లారికన్నడులయందు గానబడుచున్నవి. యేమన, ఇంకను భాషాప్రాంతవాదము వికసించుటకుపూర్వమే జిల్లా నాలుగు చెరగుల నిండియున్న తెలుగు పాళెగాలలను వెల్లగా కన్నడ పాళెగాలలుగా మార్చుకొనజూచుటవారి దీర్ఘదర్శిత్వమునకు నిదర్శనముగా నున్నది. ఆంధ్రులు తమ జిల్లాభోగమును వారి కమ్ముకొనిరి. వారు దానిని కొని తమ ఆశయసిద్ధికి కృషిచేయుచుండిరి. బళ్లారి జిల్లా కర్ణాటకులలో కొందరిట్లు వచ్చినవారు-అందరుకారు. మిగిలిన కొందరు వారి ననుసరించువారు.

ప్రజలు వలసపోవుటకు రెండవ కారణము రాజకీయ విస్తృతి. కర్ణాటకుల దిరుమతికి కారణమైన విజయనగరసామ్రాజ్యమే ఆంధ్రుల యోరుమతికిగూడా కారణమయ్యెను. విజయనగర సామ్రాజ్యమునకు ముఖ్యమైన విద్యానగరము లేక విజయనగరము యీ మండలమునందే యున్నందున దానికి సమీపవర్తులైన బళ్లారి ఆంధ్రులే దానిలాభములను యెక్కువగా ననుభవించియుందురు. ప్రస్తుతము మన ముఖ్యపట్టణమైన మద్రాసు నగరవాసులును తత్పరిసరవర్తులును అగువారికే యెక్కువ ఉద్యోగములు లభించుటచే వారే ప్రాంతములయందెల్లయెడలను గానబడుట లేదా? అట్లే బళ్లారి ఆంధ్రులును తమ సామ్రాజ్యము విస్తరించినట్లంతయు ఉద్యోగులై దక్షిణభూముల నాశ్రయించిరి గలరు. అట్టివారి సంతతివారే నేటికిని తమిళదేశమున నాయుడు, మొదలియారు, రెడ్డియార్లను బిరుదములచే ప్రకాశించుచున్నారు. నాయుడు అనగా నాయకుడు అని అర్థము. మొదలియార్ అన్నను అదే అర్థము. మొదలి అనగా అగ్ర అని అర్థము. అగ్రాసించువాడు మొదలియార్ అని. చూడుడు మన శ్రీ రాయల ఆస్థానకవి దిగ్గజేంద్రమగు రామకృష్ణుడు తన పాండురంగమాహాత్మ్యమునందు "శ్రీ సేన మొదలయార్ను" అని విష్వక్సేనుని ప్రశంసించినాడు. మదలియారు అనగా సేనానాయకుడని అర్థము. రెడ్డియారు అనగా ఆంధ్రుడని చెప్ప నవసరమే లేదు. ఆంధ్రమున గాక మరెక్కడను రెడ్డియను శబ్దమే లేదు. ఇటు విప్లవకారణముగా కన్నడులు చేరి విస్తృతి హేతువుగా ఆంధ్రులుజారి ప్రస్తుత పరిస్థితి యేర్పడినది. శుద్ధాంధ్ర ప్రాంతమగు బళ్లారియందు కర్ణాటక మిట్లు ప్రవేశించినది. అట్లు వచ్చినవారు కొందరైనను వారు విద్యావంతులును ప్రబలులును అగుట దాని వ్యాప్తికొక కారణమైనది. మరియు పరిగనదే కాలమున యీ ప్రాంతమునందు ద్వైతమతము ఉద్దండముగ వ్యాప్తినందుచుండెను. ఇంచుమించుగా యీ ప్రాంతమునందలి బ్రాహ్మణులందరు ద్వైతు (మాధ్వ) లుగా మారిపోయిరి. వారి మతాచార్యులగు మధ్వాచార్యులవారు కన్నడులగుటచే వారి మతభాష కన్నడమాయెను. మరియు లింగాయతులకు వారి ఆచార్యుడగు బసవేశ్వరులవారు కర్ణాటకులగుటచే వారికిని మతభాష యిదియె యయ్యెను. ఇట్లు రెండు తెగలవారికిని కర్ణాటికమునం దాదరాభిమానములు కలిగెను. పై రెండింటిలో నొకటియగు బ్రాహ్మణ సంఘమునందు కొందరును లింగాయతుల యందందరును తాము కర్ణాటకులమని చెప్పుకొనుటయే గాక, యీ జిల్లాయంతయును కర్ణాటకముననే జేర్చవలయునని ప్రచారము చేయుచున్నారు. అయితే లింగాయతుల యందును మతమునకును భాషకును సంబంధము లేదనువారులేక పోలేదుగాని ప్రభావశాలురవలె వారతివిరళము. ఇటీవల లింగాయతి సోదరులు కర్ణాటక రాష్ట్రమును సంపాదించి దానిని "లింగస్థాన్" గ జేయవలయునని తలపెట్టిరని వింటిమి. దాని నిజమెంతో! మతముల పేరిట రాజ్యములు సాధింపవచ్చునని జిన్నా సాహెబ్ గారు నిరూపించిరి. నేడు మరి కొందరు కూడా వారి సంప్రదాయములనే యనుసరింప జూచుట శోచనీయము. ఇటీవలనే యొక వీరశైవమఠాధిపతి యొక సంతర్పణమునందు తమ శిష్యులందరు తన కోరిక తీర్తుమని ప్రమాణము చేయునందాక ఆపోశనము బట్టినని సత్యాగ్రహము జేసి యమ్మిగనూరులో కర్ణాటక యేకీకరణ మహాసభను జరిపించి 8 వేల రూపాయలను తగులబెట్టించిన సంగతి జగద్విదితమే. అది కారణముగా యీ ప్రాంతమునందలి ఆంధ్రులు మేలుకొని రెచ్చి కర్ణాటకమహాసభకు తగిన శాస్తి యొనర్చి తమ ఆంధ్రత్వ విశ్వరూపప్రదర్శన మొనర్చిరి. నేడు ఆంధ్రత్వము బళ్లారి మండలమున తన వేయిపడగలు విప్పుకొని విజృంభించుచున్నది. యింక దానిని మరుగుపరచుట దుస్సాధ్యమే, గాదు అసాధ్యముగూడను. ఇక ప్రకృతము ననుసరింతము.

ఇట్లు లింగాయతులలో చాలమందియు, బ్రాహ్మణులలో కొందరును ప్రారంభించిన సమితియే కర్ణాటక సమితి. వీరికి సూచన లిచ్చువారు బయటివారే. వీరి సభలకు సహాయకులు కేవలము (మా జిల్లాయందు దేశభక్తులకు త్యాగధనులకు కొదువ లేకున్నను) బయటివారినే తెచ్చుకొనుట వారి స్వభావనిరూపణ కొక తార్కాణము గావచ్చును. వీరుతప్ప మిగతావా రందరాంధ్రులు. వెనకటిరోజులలో యిప్పటివలె చదువుకొని అందరును విద్యావంతులగుచుండలేదు. ఆ హక్కు కొన్ని సంఘములకే పరిమిత మొనర్చబడినట్లుండెను. అప్పటి బ్రాహ్మణులే విద్యావంతులై సమస్తరాజకీయాధికారగౌరవము లందుచుండిరి. ప్రతిగ్రామమునకును రెడ్డి, కరణము లున్నను రెడ్లకన్న (బ్రాహ్మణ) కరణములే విద్యావంతులై యుందురనుట యిప్పటికిని సత్యమే గదా! "యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనాః" యన్నట్లు విద్యాధికారదర్ప గౌరవములచే శ్రేష్ఠమానవులుగా ప్రకాశించుచున్న పైవారి ననుసరించుటయే గౌరవముగా సామాన్యులు భావించిరి. కన్నడమున మాట్లాడగలుగుటగూడా యొక యోగ్యతావిశేషముగా పరిగణించిరి. ప్రయత్నించి కొంత సాధించిరి. తరువాత యీ ఉచ్చశ్రేణి మానవులు మీరాంధ్రులు కారు, కర్ణాటకులే యనగా కాబోలు ననుకొని తమ ఆంధ్రత్వమునే విస్మరించిన మన సోదరులు కొందరు తామును కర్ణాటకులే యనుకొనిరి. ఇది ఉచ్చతరగతులవారి మాయ యని గ్రహించుటకు చాలినంత విమర్శనాశక్తి జనసామాన్యమున కంతయు నుండగలదా!

ఇటీవలనే బళ్లారి యందలి కర్ణాటకులచే ఆహ్వానింపబడిన యొక ప్రముఖ కర్ణాటక కాంగ్రెసు వ్యక్తి యీ జిల్లాయందలి కర్ణాటకు లని చూపబడిన సామాన్యజనుల కన్నడోచ్చారణమును విని విస్మితుడై "రాష్ట్ర వైశాల్యము లేకున్నను మానె, వీరికి మాటలు నేర్పవలసిన బాధలేకున్న జాలు" ననెనట్లు. మసిపూసి మారేడుకాయ జేయుట కష్టకార్యము గదా! ఇంక యీమండలము కర్ణాటకప్రాంతమని వాదించువారి కొక దివ్యసాధన మున్నది. అది మన ఆంధ్రసోదరులను గూడా భ్రాంతి బెట్టజాలియున్నది. ఆ మాయాసాధనముయొక్క సారాసారము లెట్టివో మనము కొంచెము విమర్శించుకొందము. అదియేదన; యీ ప్రాంతమునందలి కొన్ని గ్రామముల పేర్లు కన్నడమువలె గనుపడుటయే. యిందలి కొన్ని గ్రామముల పేర్ల చివర కల్లు, హాళు లని యుండుటయే. ఉదా. కోసెకల్లు, బడినెహాళు-యిట్టి పేర్లుండుటవలన యివి కర్ణాటకప్రాంతకము లని ధృవపడుట లేదా యని వారు పత్రికాముఖమున సవాలు చేసియున్నారు. 'కల్లు'లనుగురించి యిదివరకే మా సెక్రటరిగారు కొంత వ్రాసినారు. యింక మిగిలిన హాళులనుగురించియే మనము విచారింతము. వాటి పూర్వరూపములు 'పాడు' లని యుండుట నెరుంగుదురు. అయితే యీ ప్రాంతమునందలి నాన్ గెజెటెడ్ ఉద్యోగులు, మరియు కరణములు మొదలగు విద్యావంతులందరును కర్ణాటకులగుటచే 'బడినెపాడు' అను పేరును "బడినెహాళు" అని వుచ్చరించి దానికి కన్నడత్వమును గలిగించిరి. కన్నడమున మాట్లాడుటయే యోగ్యతా విశేషముగా భావించు సామాన్యులు గూడా కొందరు గౌరవమునకు గాను వాటి నాపేరుననే పిలుచుచున్నారు. సామాన్యముగా తెలుగులో 'ప' వచ్చుచోట 'హ' నుంచినచో కొన్ని శబ్దములు కన్నడము లగుచుండును. ఉదా పల్లె = హళ్లి, పాడు = హాళు, సాలు = హాలు, పంపా = హంప, పాము = హావు-ఇట్లింక ననేకము వీటిని జూపుటకంటె "క్వచిత్ హకారోపః" అని కన్నడమునుండి తెలుగున కొక సూత్రమునే రచించుకొనవచ్చును. యిట్లు పాడులను హాళులుగా జేసి చూడు మన కర్ణాటకమనుచున్నారు. యీపాడు శబ్దముయొక్క ఔచిత్యమునే మనమాలోచింతము. పాడు అనగా నాశమని అర్థముగదా. యిట్టి దురర్థముగల శబ్దములను యేల తమ గ్రామములకుంచుకొనిరి అని నా శంక. పూర్వకాలమున మన గ్రామములు చాలవరకు కొండలపైన నుండెడివి. ఆరోగ్యదృష్ట్యానైననేమి, భద్రతాదృష్ట్యానైననేమి నివాసముల కున్నతప్రదేశములు మంచివి. అట్టిచోట తమ గ్రామముల కా కొండపేర్లుంచుకొనుట ఆచారముగా తోచుచున్నది. అట్లు కొన్ని పేరులు గూడా మనకు కనుపడుచున్నవి. పత్తికొండ. పెనుగొండ, వినుకొండ-మొదలైనవి. కొండ యను శబ్దమునకు హిందూస్థానీలో, లేక ఉర్దూలో పహాడ్ యని గలదుగదా. అట్లు కొండ యను అర్థముననే 'పహాడ్' అను శబ్దమును జేర్చుకొనిరి గాబోలు. 'యద్యదాచరతి శ్రేష్ఠ' యను న్యాయముననే యితరులు గూడా అనుసరించి కొండలు లేకున్నను తమ గ్రామములకు పహాడ్ అని చేర్చియుందురు. ఆ పహాడ్ శబ్దమే ఉచ్చారణమందు చెడి పాడై 'పాడు' అయియుండవచ్చును. అంతేగాని నాశము అను అర్థముగల పాడు అని యెవ్వరును పెట్టుకొనరు. కర్ణాటకులీ మర్మమును గ్రహించక పాడే యనుకొని దానికి సరియైన హాళు శబ్దమును జేర్చిరి. పర్యవసానమున వారి హాళు శబ్దమునకు పహాడ్ గాక తెలుగునందలి పాడే మూలభూతమగుచున్నది. కర్ణాటకులా పేరున పిలువకముందే తెలుగు పేరనే వ్యవహరింపబడుచుండెననుట కింతకంటె మంచి యాధారమును బడయగలమా! కొండంత అర్థమును పాడుచేసి మన సోదరులు చూడు మన కర్ణాటకమని చంకలు తట్టుకొనుచున్నారు. గనుక యీ గ్రామముల పేర్లుగూడా వారి వాదము ప్రకారము కర్ణాటకత్వమును పోషించుటలేదు. కావున యిది ఆంధ్రప్రాంత మనుట నిస్సంశయము.

ఇంక యే ప్రాంత మే భాషాభాగమో నిర్ణయించుకొనుటకు మనమెంక నిర్దిష్టమార్గము ననుసరింపవచ్చును. మనదేశమునందు కొన్ని సరిహద్దు నిర్ణయ సంఘము లున్నవి. అవి యెవరిచేతను నియమింపబడినవి గాక స్వయంభువులై యున్నవి. వాటి నిర్ణయము లెప్పుడును లాభలోభాది దోషదూషితములు గావు. యెవరి కోరికమీదను వారు పరిశీలన మొనర్పరు. ఎవరి సాక్ష్యములను వారు స్వీకరిం

(20 వ పేజీ చూడుడు)

భాషారాష్ట్ర విచారణసంఘ కలాపము

[శ్రీ జయంతి కిరీటిరావు]

ముప్పదైదేండ్లనుండి ఘోషించుచున్న ఆంధ్రుల ప్రత్యేకాంధ్రరాష్ట్రపు ఘోష చల్లార్చుటకే వచ్చిందో, లేక ఎక్కువచేయుటకే వచ్చిందో యీ భాషారాష్ట్రవిచారణసంఘం అనే సందేహం, వారి విచారణధోరణినిబట్టి కల్గుచున్నది. విచారణసంఘంవారిని రాజ్యాంగ పరిషత్తు అధ్యక్షులగు రాజేంద్రప్రసాదుగారు, దక్షిణప్రాంతాల ఆంధ్ర తమిళ కర్నాట కేరళ మహారాష్ట్రములను భాషలనుబట్టి ప్రత్యేకించుటకు ఎంతవరకు వీలున్నదను విషయం విచారించుటకు నియమించిరి. ఇందేదయిన వెంటనే నూతన రాజ్యాంగవిధానం అమలు జరిగేలోగా ఏర్పడవలసియున్నచో దాన్ని క్రొత్త రాజ్యాంగ చట్టంలో పేర్కొనుటకు వీలుగా నుండునట్లు, త్వరగా నివేదించమని కూడా కోరినారట. రాజ్యాంగవిధానచట్టం చర్చించుటకు పరిషత్తు నవంబరులో సమావేశమగును. ఆలోగా కమిషనువారి నివేదిక తయారుకావలెను. ఆంధ్ర రాష్ట్రంగూర్చి ఎట్టి సందేహం లేక, యిదివరకే కాంగ్రెసు ఉన్నతాధికారులు అంగీకరించియున్నందునను, భారతప్రధాని కేంద్రశాసనసభలో ఆ మాట స్పష్టంగా గత నవంబరులో ప్రకటించి, యితర రాష్ట్రాలకన్న ముందు ఆంధ్ర రాష్ట్రం ఏర్పడవచ్చని చెప్పియున్నందునను, యీ విచారణసంఘంవారు విచారించి, ఆ అభిప్రాయాలనే దృఢపరచుటకు ఎట్టి సందేహముండదనియూ, రాష్ట్రనిర్మాణము మరింత సులభసాధ్యం చేయుటకు తగు సాధన లరయుదురనియూ ఆంధ్రు లాశించుచుండిరి. విచారణ సంఘంవారు యిప్పటికి విశాఖపట్నంలో కొందరిని, మదరాసులో ఒక వారం రోజుల పాటు పలువుర సాక్ష్యమును విచారించిరి. వీరి ధోరణి పరికించి చూచినచో యించుక సందేహము కలుగుచున్నది.

సంఘాధ్యక్షులు ఎస్. కే. ధార్ గారు, పింఛను గైకొన్న అలహాబాదు హైకోర్టుజడ్జి, 60 సం. ల వృద్ధుడు. కాని సభ్యులందరిని మించిన ఓర్పు వీరికి గలదు. న్యాయమూర్తి కుండవలసిన లక్షణాలన్నీ వీరిలో మూర్తీభవించి యున్నవి. విషయమంతా ముందే తెలుసుకొని, విషయ మెరింగిన వారివలెనే, సాక్షులను క్రాసుపరీక్ష చేయుచున్నారు. తరువాత సభ్యులలో ఎస్. పన్నాలాలు గారు, సం. 'రాష్ట్రముల ప్రధానకార్యదర్శిగ పనిచేసిన ఐ. సి. ఎస్. ఉద్యోగి. కుశాగ్రబుద్ధి గలవారు. అప్రస్తుతమయిన ప్రశ్న లడుగుటలేదు. సాధ్యాసాధ్యములగూర్చియే ఎక్కువగ ప్రశ్నించుచున్నారు. కొంచెం అస్వస్థతగా నున్నందున మదరాసు విచారణలో కొద్దిరోజులు పాల్గొనజాలక పోయిరి ఇంకో సభ్యులు జగతు నారాయణలాలుగారు. వీరు బీహారు కాంగ్రెసు నాయకులు, ప్రజాపరిషత్తు సభ్యులు, అదివరకు పార్లమెంటరీ కార్యదర్శిగా తమ రాష్ట్రంలో పనిచేసిన, అధికారేతర నాయకులు. వీరు సభ్యులందరికిని ఒకేరకం ప్రశ్న లడుగుచున్నారు. కాశ్మీరుయుద్ధం, దక్షిస్తాను యేర్పాటుచేస్తే పరిహద్దురక్షణ శక్తి క్షీణించదా, ఆంధ్రులకు రాష్ట్రం యిస్తే యితరులేడవరా, మహారాష్ట్రం ప్రత్యేకిస్తే ఆర్. ఎస్. ఎస్. బలం ఎక్కువకాదా, అపుడు గాంధిహత్యవంటివి ఎక్కువ కావా, యిత్యాది ప్రశ్నలు ప్రతివారిని అడుగుచున్నారు. నాల్గో సభ్యుడు బి. సి. బెనర్జీగారు. వీరు మదరాసులో డిప్టీ అక్కౌంటెంటు జనరలుగ పనిచేసి వెళ్లిరి. కనుక వీరికి మన రాష్ట్రం ఆర్థికవిషయాలు కొంత తెలిసియుండాలి. రాష్ట్రవిభజన విషయంలో ఆర్థికపరిస్థితులు యేర్పాటులే వీరికి సంబంధించినట్లుంది. వీరు సంఘ కార్యదర్శులు అయినా వీరు అట్టే ప్రశ్న లడుగుటలేదు. మదరాసులో వీరును, వీరికి తోడ్పడుటకు నియమింపబడిన స్పెషలు రిసెర్చి ఆఫీసరుగాలి రత్నంగారును, సంఖ్యలతణిఖీలలోనే నిమగ్నులయి సాక్షుల విచారణయందు పాల్గొనలేదు.

కమిషనుయొక్క స్థిరమయిన సభ్యులకు ఆయా ప్రాంతాల విచారణయందు తోడ్పడ ప్రాంతీయప్రతినిధులు నియమింపబడిరి. తెలుగువారి తరపున గౌ॥ ఆర్. బి. రామకృష్ణరాజుగారు, (కౌన్సిలు అధ్యక్షులు) అరవవారి తరపున టి. ఎ. రామలింగంశెట్టిగారు, (బ్యాంకుల అధ్యక్షులు) మళయాళీల తరపున ఒక శాసన సభ్యుడు, కన్నడుల తరపున శేకూరు సుబ్రహ్మణ్యం (బళ్లారి)గార్లు నియమింపబడిరి. వీరు మదరాసు విచారణయందు పాల్గొనిరి. రాజుగారు, ఆంధ్రప్రతికూల సాక్షుల క్రాసుపరీక్షయందు శ్రద్ధ చూపుచున్నారు.

మొదట యీ సంఘంవారికి పరిహద్దులతో ప్రసక్తి లేదని రాజ్యాంగ పరిషత్తు కార్యాలయంవారు ప్రకటించిరి. అనగా, విభజన సాధ్యమా అసాధ్యమా అనే విషయం మాత్రం వీరు విచారించి, సాధ్యమంటే, పరిహద్దుల విచారణకు వేరొక విచారణ సంఘం నియమింపబడునని తలంచబడెను. కాని యీ కమిషనువారు ప్రకటించిన ప్రశ్నావళియందు, మొదటి ప్రశ్నలలోనే నూతన రాష్ట్రాలకు పరిహద్దు లెక్కడుండాలి, అట్లా పరిహద్దులు నిర్ణయిస్తే జనసంఖ్యలు పట్లా చెయ్యాలా, ప్రాత రాష్ట్రానికి ఎట్టి దెబ్బ తగులును - యిత్యాది ప్రశ్నలు చేర్చియున్నారు. కనుక కమీషను విచారణీయాంశాలు విస్తరింపబడినట్లుంది. పత్రికా విలేఖరుల ప్రశ్నలకు కమిటీ అధ్యక్షులు చెప్పిన సమాధానంలో తాము నూతన రాష్ట్రాల నిర్మాణానికి కావలసిన భోగట్టా అంతా సేకరించి, పరిహద్దులనుగూర్చి కూడ విచారించి, వివరాలలోకి పోకుండా రాష్ట్రం నిర్మించేటపుడు వేరొక సంఘం వచ్చి విచారించ నవసరము లేకుండా, కేంద్ర ప్రభుత్వంవారు ఎగ్జిక్యుటివు ఆర్డరు ద్వారా పరిహద్దులు స్థిరయించుటకు వీలగునట్లు తగిన భోగట్టా సేకరించి అమర్చి పెట్టదమని తెలియజేసిరి. అందుచే, యీ కమీషనే చాల ముఖ్యమయిందన్న మాట. వీరికి నమ్మకంకల్గి, ఆంధ్రరాష్ట్రం వెంటనే యిపుడే ఏర్పాటుచేయవచ్చునని శిఫార్సుచేస్తే, రాష్ట్రనిర్మాణానికి ఎట్టి ఆలస్యమూ ఉండ నేరదు. ఆ భావంతోనే సాక్షులంతా గూడ సాక్ష్య మిస్తున్నారు గూడాను.

ప్రభుత్వవైఖరి

అసెంబ్లీలో సభానాయకులగు మంత్రి గోపాలరెడ్డిగారు, సాక్షుల పేర్లను జాబితాను గూర్చిన ప్రశ్నకు సమాధానం చెపుతూ, ప్రభుత్వంవారు, సాక్ష్యం తెలుపరని ఖచితంగా చెప్పిరి. వెనుక యిట్టి విచారణలు జరిగినపుడు, అనగా ఒరిస్సారాష్ట్ర నిర్మాణం గూర్చి ఓడెనలు కమిటీవారును, పరిహద్దుల గూర్చి ఫిలిఫ్ డఫ్ కమిటీవారును విచారణ చేసినపుడు అప్పటి మదరాసు ప్రభుత్వంవారు సాక్ష్య మిచ్చి విచారణయందు పాల్గొనిరి. కాని నేటి మదరాసు ప్రభుత్వం అన్నిభాషలవారికి సమిష్టి ప్రభుత్వం అగుటచేత తటస్థంగా నుండవలసివచ్చినట్లుంది. అది బాగానేయుండికాని, చేయవలసిన అల్లరేదో ప్రశ్నావళికి తాము పంపిన జబాబులోనే చేసిరి. తటస్థంగా నుండదలచినవారు, పూర్తిగ తటస్థంగా నుండవలసింది. కాని మదరాసు నగరం ప్రత్యేక రాష్ట్రంగా నుండరాదని చెప్పి, ఆ నగరంలో ఆంధ్రులకున్న హక్కులకు భంగం కలిగించుట ప్రభుత్వంవారి నిష్పాక్షికవైఖరికి నిదర్శనం కానేరదు. ఇటువంటి శిఫార్సుకి అంగీకరించిన ఆంధ్రమంత్రుల చర్యను పలువు రాంధ్రులు గర్హించుచున్నారు.

మదరాసు ప్రభుత్వంవారిని కమిషనువారు కోరగా సాక్షుల జాబితా తయారుచేసి పంపిరి. ఆ జాబితాలో 60 మందిలో ముగ్గురు నల్గురుని మించి తెలుగువారు లేరు. వెంటనే రాష్ట్రవిభజన కోరేవారికన్న వలదన్న వారి సంఖ్యయే ఎక్కువ. అరవ కాంగ్రెసు అధ్యక్షుని చేర్చిరి. ఆంధ్ర కర్ణాటక అధ్యక్షులను విడచిరి. అరవ పత్రికా సంపాదకులను, ఒక ఉత్కళున్ని కూడా చేర్చేరు. కాని ఆంధ్రపత్రికలవారిని కాని, ఆంధ్రమహాసభవారినిగాని చేర్చలేదు. అదృష్టవశాత్తు కమిషనువారు ప్రభుత్వంవారి జాబితా మాత్రమే పాటించక, దానిలో కొందరిని విడచి, అవసరమయినవారిని మరి పెక్కుమందిని పిలిచి విచారించేరు కాని, లేకంటే మన రాష్ట్ర ప్రభుత్వంవారిని నమ్ముకుంటే యీ విచారణ న్యాయానికెంతో దూరాన వుండేది.

ప్రశ్నల ధోరణి—సాక్షుల వైఖరి

విచారింపబడిన సాక్షులలో మూడు రకాలు గలరు. మొదట విశాఖపట్నంలో సాక్ష్యమిచ్చినవారంతా, పండ్రెండేండ్ల క్రిందట ఒరిస్సారాష్ట్రం ఏర్పడినపుడు తమను ఒరిస్సాలో అన్యాయంగా చేర్చి, ఒరిస్సా సంకుచిత నిరంకుశపాలనకు లోను చేసిన అన్యాయం తొలగించి, తమను నూతనంగా ఏర్పడనున్న ఆంధ్రరాష్ట్రంలో చేర్చుమని కోరినారు. గంజాం, కోరాపుట్టి, జయపురం, పర్లాకిమిడి ప్రాంతాల ఆంధ్రులంతా వేరువేరు సంఘాల తరపున నివేదికలు దాఖలుచేసిరి. ఒరిస్సా శాసనసభలో ఆంధ్రప్రతినిధులగు శ్రీ గాది నారాయణమూర్తిగారు, తెన్నేటి విశ్వనాథంగారు, దూర్వాసుల శ్రీరామశాస్త్రిగారు, డా. గిడుగు సీతాపతిగారు వీరిలో అగ్రగణ్యులు. వీరందరి సాక్ష్యం విన్నాక, కమిషను అధ్యక్షులే, పర్లాకిమిడి రాజుగారు కోరినందున ఒరిస్సాలో చేర్చబడిందికాని, జనసంఖ్య తదితర హేతువాదమేమీ లేదని ప్రసంగవశాత్తు అన్నారు. పన్నాలాలుగారు డా. సీతాపతిగారి పాండిత్యాన్ని మెచ్చుకున్నారు. అధ్యక్షులు ధారుగారు విశ్వనాథంగారి విషయపరిజ్ఞానాన్ని, వాగ్ధోరణిని ప్రశంసించి, ఆంధ్రరాష్ట్రం విషయం అట్టే సందేహం లేదు, అదటావుంచి, యావద్భారత దృష్టిలో యితరయిష్టాల విభజనగూర్చి మీ అభిప్రాయం ఏమని పదే పదే అడిగారు. విశ్వనాథంగారు మాత్రం, యితర రాష్ట్రాల గూర్చి తాము చెప్పుట అధికప్రసంగం అవుతుందని చెప్పి వూరుకున్నారు. "ఆంధ్రులకు రాష్ట్రం యిచ్చి యితరుల కివ్వకుంటే వారి అల్లరి ఎక్కువకాదా, అందునుండి అందరికిని ఆలస్యం చేయుట భావ్యం కాదా" యని బీహారు సభ్యు డడిగే సరికి, "అది బురాక్రటిక బ్రిటిషు అధికారుల వైఖరికాని, కాంగ్రెసు ప్రభుత్వం చేయదగ్గ పనిగాదు" అని విశ్వనాథంగారు చెప్పేసరికి మరి అట్టి ప్రశ్నలు రాలేదు.

ఆంధ్రుల ప్రాంతాలు ఒరిస్సాలో చేర్చబడినవి తిరిగీ ఆంధ్రుల కెక్కడ ఇచ్చేస్తారో అనే భయంచేత, కటకంనుండి ఓఢ్రప్రతినిధులు విశాఖపట్నం వచ్చి కమిషనువారి ఎదుట సాక్ష్యం యివ్వదలచిరి. మదరాసులోనున్న ఒరియాల యిబ్బందినిగూర్చి తెల్పుకొనుటకును, మదరాసులోనున్న ఒరియా ప్రాధాన్యంగల ప్రాంతాలను తిరిగి ఒరిస్సాలో చేర్చుకొనటకును కోర వచ్చితిమని ఒరియా ప్రతినిధియగు రాధానాదురతో, శరతుచంద్ర మహాపాత్రోగారును చెప్పేసరికి, ఐ. సి. ఎస్. పన్నాలాలుగారు అది తాము విచారింపవలసిన విషయం కాదని "నూతనంగా ఏర్పడవలసిన రాష్ట్రాలకు చేర్చవలసిన భాగాలనుగూర్చియే విచారింతుముగాని, అదివర కేర్పడిన రాష్ట్రాలకు క్రొత్తభాగాలు చేర్చే అధికారం మాకు లే"దనిచెప్పి, వారిని పంపివేసిరి. ఒరిస్సా ప్రతినిధు లిద్దరిలో రెండవ వారగు మహాపాత్రోగారు, బరంపురంలో డా. పట్టాభి గారి పై దండప్రయోగం చేసిన దండాసీ మురానాయకుడని, కమిషనువారికి తెలియదు. ఈ ఉత్కళ ప్రతినిధులు యింతమాత్రం విరమించువారు కారు. వెంటనే ప్లేటు మార్చి, "ఆంధ్రరాష్ట్రంలో చేర్చవలెనని కోరుచున్న జయపురం, పర్లాకిమిడి ప్రాంతాలందున్న ఓఢ్రుల తరపున ఆక్షేపణలు చెప్పకుంటాం" అని అధ్యక్షుని బ్రతిమాలుకున్నారు. అధ్యక్షుడు ధారుగారు తమ నిష్పాక్షికతకు ఏం భంగం కలుగునో యని కాబోలు మదరాసు వచ్చి చెప్పుకోండి అని అనుమతించేరు. అందుచే, అదివరకు మదరాసు ప్రాంతములోనున్న ఉత్కళుల ప్రతినిధి నని బొంకిన మహాపాత్రోగారు మదరాసు వచ్చి ఒరిస్సా ప్రతినిధిగా మారిపోయినారు. తమకు తోడుగా, మాజీ మంత్రి గోదావరీశ మిశ్రగారిని కూడా తెప్పించిరి. ఈ ఉత్కళులు ఆంధ్రరాష్ట్రంలో తమ యిప్పటి ఒరిస్సా భాగాలేమీ కలపరాదని వాదించేరు. దాన్ని బలపరచుటకై గంజాం, విశాఖపట్నం మన్య ప్రాంతాలు ఒరిస్సాలో చేరవచ్చని, ముప్పదేండ్ల క్రిందట డా॥ పట్టాభిగారు 1916 లో వ్రాసిన కరపత్ర మేదో ఉదాహరించేరు. ఆ తరువాత 1936 లో ఒరిస్సా రాష్ట్ర మేర్పడింది. మన్యప్రాంతాలు ఒరిస్సాలో చేర్చబడి, యిదివరకుకన్న వెనుకబడియున్నాయి. వేసిన రోడ్లు మరమ్మత్తు లేక రద్దయినాయి. యెట్టి సౌకర్యాలూ లేక మాడిపోతున్నాం, అని అచటి ప్రజలు గోలపెడుతూవుంటే, దానికేం చెబుతారో తెలియదు. కమిటీ సభ్యు లామాత్రం గ్రహించలేకపోరు.

కమిషనువారి ప్రశ్నలలో ముఖ్యమైనవి:

1. భాషారాష్ట్ర విభజనకు ప్రస్తుత సమయం—అంటే పాకిస్తానుతో యుద్ధం వచ్చే సందర్భంలో, హైదరాబాదు సమస్యా పరిష్కారం కాకముందు—అనుకూలమయిందేనా?
2. ఆంధ్రరాష్ట్రం విషయంలో రాయలసీమవారి వైఖరి ఏమి? అచటి ప్రజలు విముఖులుగా నున్నారన్నది నిజమేనా?
3. మదరాసునగరం ఎటుండాలి?

ఈ మూడు ప్రశ్నలే ప్రతి సాక్షిని వారు మాటలు మార్చి అడుగుచున్నారు. అంతేకాని ఆంధ్రరాష్ట్రం ప్రత్యేకించినచో ఆర్థిక స్వావలంబన కలదా లేదా అన్న విషయంలోగాని, యితర రాష్ట్రాలకందువల్ల యిబ్బంది కలదా యనిగాని వారు సందేహించినట్లు లేదు. పై ప్రశ్నలకు సాక్షులు ఎవరి మనోవైఖరిని బట్టి వారు, ఎవరి స్వార్థాన్ని అనుసరించి వారు బదులు చెప్పిరి.

ప్రస్తుత సమయం విభజనకు అనుకూలించునా లేదా అన్న విషయంలో ఆంధ్ర ప్రతినిధులంతానూ, కర్నాటకులూ గూడ అనుకూలించుననే సమాధానాలు చెప్పిరి. విభజనవల్ల నష్టపోయే అరవలు, మళయాళీలు సాక్షులుమాత్రం యిపుడు అదను కాదందురు. వారిలోగూడ, సి. ఆర్. శ్రీనివాసను, నాడారు వంటి ప్రముఖులు గూడ, ఎపుడో ఒకప్పుడు యీ విభజన జరుగక తప్పదు కనుక శీఘ్రమయినంత త్వరలో జరిపించుట మంచిదనే చెప్పిరి.

రాయల సీమ

ఆంధ్రులలోనే మొదటినుండి అరవ ప్రాబల్యం క్రింద, దొరస్వామయ్యంగారు, కేశవపిళ్లె మున్నగువారి నాయకత్వం క్రింద పెరిగి అరవ సాంప్రదాయం వీడలేని, దత్తమండలాల నాయకులు కొందరు మాత్రం, సర్కారాంధ్రుల పొత్తు ఎలాగుండునో అనే భయంచేత, అరవసంపర్కం వీడనొల్లక, విభజన యిపుడు వలదంటున్నారు. భావమరదులగు ఆర్. సూర్యనారాయణ మృత్యుంజయ శాస్త్రిగార్లను మంత్రిగారి బంధువులగు యింకో రెడ్డిగారును యీ వర్గానికి చెందినవారు. స్వభాషవారగు సర్కారు ఆంధ్రులతో పొత్తుగ నుండలేని వీరు, ఇండియా అంతటిలో వివిధ రాష్ట్రాల పొత్తు చెడకుండుటకై విభజన వలదని వాదించుట వింతగ నున్నది. స్వభాషవారితో పొత్తుకలవని వారు పరభాషవారితో పొత్తు ఆశించుట ఉట్టి కెగరలేక స్వర్గానికి ఎగిరినట్లుండును.

ఆ రాయలసీమలోనే ఆంధ్రోద్యమానికి ప్రతిగా నేర్పడిన రాయలసీమ మహాసభ తరపున సాక్ష్యమిచ్చిన సదరు సభాధ్యక్షులు సంజీవరెడ్డిగారు యింకో త్రోవ తొక్కిరి. వీరు శ్రీబాగ్ ఒడంబడిక చట్టంలో చేర్చి "స్టాచుటరీ సేఫ్

మహమ్మద్ ఆలీ జిన్నా



11-9-'48, శనివారం సాయంత్రం క్వెట్టానుండివచ్చిన విమానం, మహమ్మదాలీ జిన్నాను, జిన్నాసోదరి మిస్ ఫాతిమా జిన్నానూ, క్వెట్టానుంచి కరాచీకి తీసుకొనివచ్చింది. ఆరాత్రి 10-25 గంటలకు పాకిస్థాన్ గవర్నరు జనరల్ కాయదే అజాం, మహమ్మదాలీ జిన్నా గుండె ఆగి హఠాన్మరణమొందాడని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది.

మహమ్మదాలీ జిన్నా 1876 సంవత్సరమున కరాచీలో ఒక ముస్లిం భోజాకుటుంబంలో జన్మించాడు. తండ్రి ధనికుడైన వర్తకుడు. కరాచీలో విద్యాభ్యాస మొనర్చి 16 వ ఏట బారెట్లా చదువుకు ఇంగ్లాండు వెళ్ళాడు. అక్కడ దాదాభాయి నౌరోజీ పరిచయం కల్గింది. ఆయన వద్ద నుండి ఆయనకు కార్యదర్శిగా పనిచేశాడు. ఆనాడు ఆయనవద్ద జిన్నాకు అలవడిన జాతీయ దృష్టి, 1929 దాకా జిన్నాను నడపగల్గింది.

జిన్నా పార్శీయువతి మిస్ రతన్‌భాయ్ పెటిట్‌ను పెండ్లాడాడు. ఆమె ఆనాటి పార్శీ జమీందారు దిన్షా పెటిటుకుమార్తె.

1896 లో బారెట్లాగా పట్టంపొందాడు. 1897 లో బొంబాయిలో న్యాయవాదవృత్తి ప్రారంభించాడు. మూడేళ్ళలో, తన వృత్తిలో ప్రముఖస్థానం ఆక్రమించుకొన్నాడు.

బొంబాయి రాష్ట్రసంఘ సభ్యుడుగా చేరాడు. ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలు అనే మింటో మార్లే సంస్కరణసూచనలు ఎదిరిస్తూ సంఘసభ్యుల నివేదికలో తానూ సంతకం పెట్టాడు. కలకత్తాలో దాదాభాయి నౌరోజీ అధ్యక్షతను జరిగిన కాంగ్రెసు మహాసభకు, 1911 లో హిందూముస్లిం సఖ్యతకై ప్రయత్నించిన కరాచీకాంగ్రెసుసభకూ హాజరయ్యాడు.

ఆ కాంగ్రెసులో ముస్లిం సభ్యులతో కలిసిపోయి కాకుండా ఉభయమతసామరస్య సభ్యులతో కలిసి నిలిచాడు. ఇండియా కౌన్సిల్ సంస్కరణ విషయంలో, కాంగ్రెసు ప్రతినిధిగా ఇంగ్లండుకు రాయబారం వెళ్లాడు. 1913 దాకా ముస్లింలీగ్ సభ్యత్వము లేదు. అందులో చేరిన నాటినుండి హిందూముస్లింసఖ్యతకై ఎడతెగకుండా కృషిచేసి, రెండేళ్ళలో కాంగ్రెసుకు ముస్లింలీగుకు సఖ్యత ఏర్పరచ కలిగాడు.

1916 లో జిన్నా ముస్లింలీగ్ అధ్యక్షుడయ్యాడు. 1920 లో లీగ్ ప్రత్యేక సమావేశంలో మళ్ళీ అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు

1934 సంవత్సరం తర్వాత ప్రతీ సంవత్సరమూ జిన్నాయే లీగు అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. సెంట్రల్ అసెంబ్లీలో ముస్లింలీగ్ పక్షనాయకుడుగా చాలాకాలం వ్యవహరించాడు.

1917 లో "హోంరూల్" ఉద్యమంలో తీవ్రంగా పనిచేశాడు. హోంరూల్ లీగ్ బొంబాయిశాఖకు అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. 1920-29 దాకా, దేశంలో ఉద్యమాలైన సహాయనిరాకరణోద్యమ ఖిలాఫత్ ఉద్యమం వీట్లతో ప్రమేయం కల్పించుకోకుండా దూరంగా నిలిచాడు.

1928 దాకా ఉద్యమాల్లోఉన్న జిన్నా వేరు. ఆ తర్వాతి రౌండుటేబిలు సమావేశాలలో లండనులో ప్రత్యక్షమైన జిన్నా వేరు. వ్యక్తి దృక్పథమే పూర్తిగా మారిపోయింది. ఒక్కసారిగా తన "చతుర్దశాంశ ప్రణాళికతో" తయారయి ఇస్లాం ఒకటి సమిష్టి భారత దృక్పథాన్ని ఆశయాన్ని ఒక్కసారిగా మార్చేసుకొని, ముస్లింలకు ప్రత్యేక హక్కులను ప్రతిపాదించసాగాడు. 1935 ఇండియాచట్టం, తయారుచేసిన మూడవ రౌండు టేబిలు సమావేశంలో జిన్నా కనబడలేదు. ఆ చట్టమూ, ఆనాటి జిన్నా దృక్పథమూ, ఆ తర్వాత పుష్కరకాలందాకా భారత దేశాన్ని విషమపరిస్థితులలో ముంచెత్తి స్వాతంత్ర్యాన్ని దూరంచేసి, ఈనాటి విభక్తరూపాన్ని దేశానికి సమకూర్చాయి.

1935 చట్టంక్రింద జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్, ముస్లింలీగులే ప్రాతినిధ్యాలను నిలుపుకొన్నాయి. లీగుతో కలిసి మిశ్రమమంత్రి వర్గాలను స్థాపించటం కాంగ్రెసుకు కుదురలేదు. కాంగ్రెస్ సవర్ణహిందువులసంస్థ అనీ, తక్కిన భారతదేశస్థులందరినీ హిందూసంస్కృతిలో ముంచెత్తచూస్తోందనీ, ఇస్లాముకు ప్రబలహానికరమనీ నినాదాలు లేవదీశాడు. ముస్లిం ప్రజానీకంపై, లీగుప్రభావం అభివృద్ధిచేయటానికి, వీలయిన మార్గాలన్నీ త్రొక్కాడు: కాంగ్రెస్ కోరికలకు ప్రతిదానికీ ప్రతికూలంగా లీగును తయారుచేసి, ప్రభుత్వాధికారులకు యుద్ధకాలంలో సంపూర్ణసహాయంగా చేయూతనొసగాడు. కాన్సర్వేటివ్ పక్షనాయకులు అమెరీ, చర్చిల్‌లతో సంపూర్ణబాంధవ్యం ఏర్పరుచుకొని 1940-45 దాకా ఇంగ్లండు ప్రభుత్వంలో ఉన్న కాన్సర్వేటివ్‌లను తన ప్రయోజనాలకై పూర్తిగా వినియోగించుకొన్నాడు. బ్రిటిష్‌వారు ఇండియా విషయం ఏం చెయ్యాలన్నా ముస్లిమ మైనారిటీల సమ్మతి లేనిదే చేయలేమన్న పాటపాడేటంత జయప్రదముగా తన పనులను కొనసాగించుకొన్నాడు. కాంగ్రెస్, ముస్లింలీగ్ విభేదాలను సవర్ణహైందవ - ముస్లిం విభేదంగా భ్రమ కల్పించటంలో సఫలీకృతుడయ్యాడు. 1942 లో క్రిప్సురాయబారంనాటికి ఈ స్థితిని బ్రిటిషువారికి ప్రదర్శింపగలిగాడు. ఆ తర్వాత 1945 దాకా కాంగ్రెస్ లీగుతో సమాధానపడడానికై చేసిన ప్రయత్నాలన్నిటిలోనూ మెట్టుమెట్టుగా

(21 వ పేజీ చూడుడు)

గార్డులు" ఉంటేతప్ప తాము ఆంధ్రరాష్ట్రంలో చేరజాలమనిరి. అనగా శ్రీబాగు ఒడంబడికలో యిచ్చిన హామీలు సర్కారాంధ్రులు అమలు జరపరేమోననే అనుమానం వీరు సూచించుచున్నారు. తమ అభిప్రాయాన్ని శాసన సభ్యులంతా బలపరుస్తారని చెప్పడానికి, రాయలసీమ శాసనసభ్యులు 24 గురిలో 19 గురి సభ్యుల సంతకాలు చేయించి ప్రణాళికను దాఖలుచేసిరి. మిగిలిన ఐదుగురు కూడ తమతో ఏకీభవిస్తున్నారని చెప్పేరు. కాని ఆ ఐదుగురే గాక, వీరి కాయితంలో సంతకం చేసిన డి. కదిరప్ప, ఎస్. నాగయ్య ఎం. ఎల్. ఎ లు కోటిరెడ్డి గారితో కలసి వెళ్ళి, కమీషనువారికి సర్కారాంధ్రులు శ్రీబాగ్ ఒడంబడికను అమలుజరుపుతారను నమ్మకం తమకు కలదని, దాన్ని చట్టంలో యిముడ్చుటకు వీలులేకపోయినా, రాయలసీమను ఆంధ్రరాష్ట్రంలో చేర్చాలని కోరేరు. 1934 నుండి 45 వరకు కేంద్రశాసన సభలో రాయలసీమకు ఏకైక ప్రతినిధియైన ఇండియా పార్లమెంటు డిప్టీ స్పీకరయిన శ్రీ అనంతశయనం అయ్యంగారు గూడ ఆమాటే చెప్పి, శ్రీ బాగు పాక్టు అమలు జరిపేటట్లు సర్కారు ఆంధ్ర నాయకులచే రాయలసీమ ప్రతినిధులు, నెల్లూరు ప్రతినిధులు కలసి శ్రద్ధ వహించగలరు. ఏమీ భయం లేదన్నారు. చట్టంలో యీ ఒడంబడికను హరిజనులకు పూనా ఒడంబడికవలె యిమిడ్చుటకు న్యాయశాస్త్రపు ఆక్షేపణలు యేమీ ఉండవనియూ, ఉన్నప్పటికీ రాయలసీమవారు ఆంధ్రరాష్ట్రంలో చేరుటకు సంకోచింపనక్కరలేదని వీరి వాదము. బళ్లారి ఆంధ్ర కాంగ్రెసువారగు శాసనసభ్యులు డి. గోవిందదాసు, తదితరులు గూడ యీ రీతిగానే వేరొక ప్రణాళిక దాఖలుచేసి ఋజువు సాక్ష్యమిచ్చిరి. కనుక రాయలసీమవారిలోనే ఆంధ్రరాష్ట్రంలో చేరాలా, వద్దా అనే విషయంలో మూడు రకాల అభిప్రాయాలు కమిషనువారికి దాఖలు చేయబడినవి రాష్ట్రం ఏర్పాటుచేయాలన్న విషయంలో సర్కారాంధ్రులంతా మాత్రం ఒకే మాదిరిగ సాక్ష్యం చెప్పిరి. రాయలసీమ శాసన సభ్యుల ఆక్షేపణకు మీ రేమంటారను ప్రశ్నకు ఆంధ్రమహాసభాధ్యక్షులగు గా. హరిసర్వోత్తమరావుగారు చెప్పిన జవాబు అమోఘంగా నుండి. "ఈ శాసనసభ్యులే శాసనసభ 1947 ఏప్రిలులోను, కౌన్సిలు అక్టోబరులోను తీర్మానించినపుడు ఆంధ్రరాష్ట్రానికి ఏకగ్రీవంగా అంగీకరించిరనియూ, యిపుడు కాదనడం అధికారవ్యామోహంతో కూడిన రాజకీయ విభ్రమానికి లోనగుట తప్ప వేరు కారణమగుపడదు. రాయలసీమప్రజలంతా ఆంధ్రరాష్ట్రానికి అనుకూలురే" అని చెప్పేరు. ఈ అభిప్రాయాన్నే రాయలసీమ ప్రతినిధులగు కోటిరెడ్డి, గోవిందదాసు, కదిరప్ప, అనంతశయనం అయ్యంగార్లు మరునాడు సాక్ష్యంలో బలపరుచుటవల్ల, కమిషనువారికి నిజం తెలిసియుండును.

ఇక హైదరాబాదు సమస్య ప్రతిబంధకం గూర్చిన కమిషనువారి ప్రశ్నగూర్చి: అది త్వరగా పరిష్కారమయితే కొద్దికాలం వేచియుండవచ్చుగాని, ఎంతో ఆలస్యమయితే రాష్ట్రస్థాపన ఆలస్యం చేయరాదని పలువురు సాక్షులు తెలిపిరి. అసలు హైదరాబాదు సమస్యతో సంబంధంలేకుండానే, రాష్ట్రస్థాపన హైదరాబాదుకొరకే జరిపించాలని తెన్నేటివారు, గాడిచర్లవారు, అనంతశయనంగారివంటివారు నొక్కిచెప్పిరి. కాని అసలు యీ ప్రశ్నకు అవకాశమే లేదని తోస్తున్నది. ఈ కమిటీవారు శిఫార్సుచేసినా నూతన రాజ్యాంగవిధానం అమలుజరిగినపుడు కాని, ఆంధ్రరాష్ట్రస్థాపన జరుగదు. అది ఏ 1950 లోనోగాని కానేరదు. "అంతవరకు హైదరాబాదు సమస్య పరిష్కారం కాకుండా యుండునా" అని తిరిగి కమిషనువారి నడిగినవారెవరులేరు. హైదరాబాదులో జరిపేది యుద్ధంకాదు సైనికచర్యలు, ప్రారంభించే మాటే కొద్దిరోజులలో తుడిచిపారేస్తాం అని నెహ్రూగారు యీ మదరాసు సభలోనే చెప్పేరుకదా, హైదరాబాదు సమస్య ఆంధ్రరాష్ట్రస్థాపనకు ప్రతిబంధకంగా జగత్తు నారాయణగారికి తోచడం వింతగనుండి. ఆంధ్రరాష్ట్రం స్థాపించేవరకు హైదరాబాదు సమస్య పరిష్కారంకాకుండా కూడదని, ఆంధ్రరాష్ట్రం వెంటనే స్థాపిస్తేనే, హైదరాబాదు సమస్య బాగా సులభంగా త్వరగా పరిష్కారం కాగలదు గాని, ప్రస్తుత మదరాసుప్రభుత్వంవల్ల ఆ పని కాదని, ఆంధ్రమహాసభవారు, సర్ కొండి రామమూర్తిగారు, అనంతశయనం అయ్యంగారు ఘట్టిగా చెప్పిరి.

మిగిలిన మూడో ప్రశ్న: మదరాసునగరంగూర్చి నగరాన్ని పూర్తిగ అరవరాష్ట్రంలో, ఉంచాలని అరవప్రతినిధులంతా ఏకగ్రీవంగా చెప్పేరు. ఆంధ్రులు కూడా చరిత్రాత్మకంగా నగరంపై తమకు పూర్తిహక్కులున్నా, అరవలకు కొంత అన్యాక్రాంతపు హక్కు యిటీవల కొన్ని ఏండ్ల నుండి ఏర్పడినందున, ప్రత్యామ్నాయ సూచనలు కొన్ని చేసేరు. నగరం చెరిసగం చేయాలని, ఏభాగం యివ్వకపోతే నష్టపరిహారం యివ్వాలని పరిపరివిధముల పలువురు సూచించేరు. ఈ విషయంలోకూడ నగర వాసులగు నాయకుల సాక్ష్యానికి, ఇతర ఆంధ్ర జిల్లాల ఆంధ్రనాయకులకు భేదాభిప్రాయం ఉన్నది. ఆంధ్రులలో యీ భేదాభిప్రాయమే అన్నింట అభివృద్ధికి నిరోధకంగానుంది. కనుక ప్రజాప్రాతినిధ్యంగల సంస్థలగు కాంగ్రెసు, ఆంధ్ర మహాసభల తరఫున చెప్పిన సాక్ష్యాలకే కమిషనువారు ఎక్కువ విలువ యిస్తారని భావించవచ్చును.

తమిళరాష్ట్రంవచ్చినా రాకపోయినా చింతలేని తమిళనాయకులు, యీ సందర్భంలో ముందుగ ఆంధ్రరాష్ట్రం సిద్ధించే అవకాశాలున్నాయిగనుక మదరాసు నగరంలో కించిత్తయినా పోకుండా యిపుడే జాగ్రత్తపడాలన్న దృష్టితో తమ వారి సాక్ష్యాన్నంతా తరిఫీదుచేసేరు. వారి సాక్షులు కవాతునేర్చిన సైనికులవలె నిలచి ఒకే ధోరణిలో సుశిక్షితులుగా ప్రవర్తించేరు. అరవ కాంగ్రెసు ప్రాబల్యం క్రింద నడుస్తున్న మదరాసు ప్రభుత్వం కూడ మదరాసు ముక్కలు కాగూడదని, ప్రత్యేక రాష్ట్రంగా నుండరాదని శిఫార్సు చేసింది. కాంగ్రెసేతరులకు అరవలను మాత్రం గెల్పించి, నగరం అరవలదే ననిపించడానికి కార్పొరేషను ఎన్నికలలో అరవకాంగ్రెసు పాల్గొనకుండుటకు గూడ యిదే కారణం. కాంగ్రెస్ ఎన్నికలలో పాల్గొంటే పూర్వ సాంప్రదాయం ప్రకారం, ఆంధ్ర కాంగ్రెస్ సంఘంతో చేరి పనిచేయాలి. కొన్ని స్థానాలు ఆంధ్రుల కిచ్చి నగరంలో వారికి హక్కుగలదని అంగీకరించాలి. అది వారి కిష్టంలేక, కాంగ్రెసు సిద్ధాంతాలకే విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. ఆ విషయం కమీషను సభ్యులు గుర్తించకుండా వుంటారా!

సంస్థల తరఫున గాక వ్యక్తిగతంగా కొందరు మదరాసు నాయకు లిచ్చిన సాక్ష్యం మరీ ఆశ్చర్యం కలిగిస్తుంది. "ఆంధ్రులు తమ వాడు ప్రధానిగా ఉన్నంతవరకూ రాష్ట్రం మాట ఎత్తలేదు. తమిళుడు ప్రధాని అయిన వెంటనే రాష్ట్రము రాష్ట్రమనుచున్నారు." అని టి. ఆర్. వెంకటరామశాస్త్రిగారు కమిషను ఎదుట నుడివిరి.

ఆంధ్రులు విడిపోక తప్పదని అంగీకరిస్తూ, రాష్ట్రానికి బలవంత బ్రాహ్మణార్థంగ అంగీకరించుచున్న అరవమిత్రుల వైఖరికి యిది నిదర్శనము. వీలయితే ఆంధ్రరాష్ట్రం వద్దని, లేకుంటే వీలయినంత ఆలశ్యం చేయాలని చూస్తారు యీ అరవలు. కాని టి. ఆర్. వెంకట్రామశాస్త్రి వంటి మేధావులు, యింత అర్థరహితమయిన మాట అంటారనుకోలేదు. ఏడాదిక్రిందట దక్షిణ మదరాసు ఆంధ్రుల సభలో సాంబమూర్తిగారి అధ్యక్షతను ఉపన్యసిస్తూ, యీ మితవాదనాయకుడే ఆంధ్రరాష్ట్రంవిడబడకతప్పదని అంగీకరిస్తూ, అదివరకు తనకు యీ విషయంలో సందేహాలుండినా అవి పూర్తిగ తొలగిపోయినవని స్పష్టంగా చెప్పియుండిరి. ఆమాట యిపుడు మరచిపోయిరి కాబోలు. 1913 నుండి ఆంధ్రోద్యమంగూర్చి వింటూ, సర్ బయ్యా నరసింహేశ్వర శర్మగారితో దానిగూర్చి వాగ్వాదాలు చేసిన టి. ఆర్. వెం. శాస్త్రిగారు, అరవ ప్రధాని యున్నపుడే ఆంధ్రులు రాష్ట్రం కోరుతున్నారనుట వింతగనుంది. కొందరు నాయకులు ఉద్యోగానికై రాష్ట్రం అడుగుతున్నారుగాని ప్రజలు వాంఛించలేదన్న ఓమండూరు రెడ్డిగారికిన్ని, యీ ఎక్సు అడ్వకేటు జనరలుకునూ, అట్టేవ్యత్యాసం కనబడదు.

కర్నాటకులు ఆంధ్రరాష్ట్రం విషయంలో విముఖులు కారు గాని, ఆంధ్రులకు ముందు యిచ్చేస్తే తమకు ఆలస్య-మవుతుందేమో అన్న భయంతో, నీట మునిగిపోతున్నవాడు తేలియాడుకపోతున్నవాటి పీక ఆదుర్దగా పట్టుకొని వాడినికూడా ముంచేసేటట్లు ఆంధ్రులను ముంచేస్తున్నారు. ఈ కర్నాటకుల తొందర, ఓడ్రుల భయము, అరవల నిరోధం వీటన్నింటితోకూడిన వివిధ రకముల సాక్ష్యాల మనో వైఖరి గమనించి, వారి వారి ప్రత్యేక పరిస్థితులనుబట్టి వారలాతప్ప యింకోలాగు చెప్పలేరని గ్రహించి, కమిషనువారు వందలకొలది వచ్చిన వివిధరకాల ప్రణాళికలలో నిగ్గుతేల్చి, ఆంధ్రులకు న్యాయం చేకూర్చాలి. ఈ పని వారికి చాల కష్టమయినదే ఇప్పటికి వచ్చిన సాక్ష్యాలలో ఆంధ్రరాష్ట్రానికి అనుకూలురకన్న ప్రతికూలుర ధోరణే యెక్కువ బలంగా నుంది. యావద్భారత రాజకీయార్థిక పరిస్థితులుగూడ అటే యున్నాయి. కనుక, యీ సంఘంవారు సంచారం ముగించి, ఢిల్లీ చేరినాక ప్రశాంతంగా ఆలోచించి నివేదిక తయారుచేసినపుడు "ఆంధ్రరాష్ట్రం వెంటనే స్థాపించవచ్చు" అని శిఫార్సుచేసే ఆశ్చర్యంగా నుండవచ్చు కాని, కూడ దంటే ఆశ్చర్యం ఉండదు.

గొప్పవారితో గుసగుసలు-2. చక్రవర్తులు:

వేనమహారాజు

కీ॥ శే॥ వారణాసి శ్రీనివాసరావు

నేను: (విపరీతమైన ఆశ్చర్యంతో) అరరే! యిదేమిటి ప్రదేశం! నా వెనకంతా బంగారం వంటి నవధాన్యాలు పండిస్తూ సమస్తజీవాధారమైన బయలా, యెదుట నీ యేరా, చూస్కేర దూరాన నొక పర్వతపంక్తా! ఈ యేట్లో నీళ్ళెమిటి నీరాలా గున్నాయే! దూరాన నా కొండ గుహల్లో నెవరబ్బా తిరిగే వికటాట్టహాసులు! (కొంచెం నిదానించి చూచి) ఆ స్వరూపాల్ని గురించి చదవడం, వినడమేగాని యెన్నడూ చూచెరగను. వాండ్లే గాబోలు భూతాలు, భేతాళాలు, పిశాచాలు అంటారు! అరే, యిదేమాశ్చర్యం! ఏటికవతలి ఒడ్డునున్న బయల్లో గాని, పర్వతాలమీదగాని గడ్డిపరకైనా లేదే! నేలగూడా ఆ రంగేమిటి— స్మశానంలో బూడిద రంగునుంది! చివరకా ప్రదేశంలో నొక్క పిట్టయినా లేదే! నాకేమో యిదంతా చూస్తే భయమేస్తూంది! దేవి యిక్కడికొచ్చి ఆహ్వానిస్తేగాని వేనమహారాజుగారు రారంటే వచ్చి ప్రార్థించా. (కొంచెం ఆగి) ఆయ బాబో ఆ వస్తున్న ఆయనే గాబోలు!! అరె కళాకాంతులే మాత్రం లేవే ఆ మొగాన! ఆ భూతబేతాళాదులాయ నెట్లా ఆదరిస్తున్నా ఎట్లా ఆనందిస్తున్నాడాయన—యెన్నాళ్ళనాటి మిత్రుల్నో కలుసుకున్నట్లు! (కొంచెం చూచి) అమ్మయ్యా, ఆయనపుణ్యమాని ఆ త్యాష్టుశ్రీళ్ళందర్నీ ఆపేస్తున్నాడు బాబూ, బ్రతికిపోయినాం.

వేనమహారాజు (ఏటొక్క అడుగులో దాటి) ఎమిట్రా కోర్యాంతరనిమగ్నులమై వున్నవాండ్లను మమ్మ ల్నెదో మునిగిపోయినట్లాహ్వానించావ్?

నే చిత్తం. తమరంత పన్లో నున్నారని యెరక్క ఆహ్వానించా, క్షమించండి.

వే: క్షమించడమేమిటి? ఇన్నాళ్ళనుండి సాగక మొన్న మొన్ననే ఆరంభించాం—అహంకారవేదాధ్యయనం. ఇంకొక్క క్షణంలో శిష్యులంతా పోగౌతారు. ఈ మధ్య నీ వెంతో ఆతురతో పిలుస్తున్నావని వచ్చాం. ఏమిటో అడుగు?

నే చిత్తం. ఏం వేదాధ్యయనమండీ?

వే: అహంకారవేదాధ్యయనం.

నే మేం భారతంతో కలిపి అయిదు వేదాల్నే యెరుగున్నా మిది ఆరోదాండీ?

వే ఆరోదేమిటీ! అసలు వేదమే అది.

నే: ఎవరి ప్రోక్తమండీ?

వే ఓరిమూఢుడా! ప్రోక్తాలేమిటి? అపౌరుషేయాలు గావట్రా; స్వాయంభువాలు, అంటే వాటంతటవి ఉద్భవించాయ్. అందులో మొదట బుట్టిం దిది.

నే అట్లాగాండి? కారణం లేకుండానే సంభవిస్తాయాండి?

వే వేరే కారణమేమిటి—జగన్నాథం.

నే: దాన్ని తమ రెవరికధ్యాపిస్తారండీ?

వే ఎవరికేమిటి? ఎవరొస్తే వారికి. స్వర్గంలో నందర్నీ ఆహ్వానిస్తే చాలామంది రాలా. రాక్షసచక్రవర్తులూ, తురుష్కచక్రవర్తులూ, మొన్న మొన్నక్కడ్నుంచివచ్చిన హిట్లరూ, ముస్సోలినీ వాండ్లు వస్తున్నారు.

నే: బాగుంది. ఏమిటండీ అహం.

వే: ఆ అహంకారవేదం. దానికి బ్రాహ్మణముంది. ఉపనిషత్తు లున్నాయ్. దాన్ననుసరించి అన్ని రకాల సూత్రాలేర్పడ్డాయ్. దాన్నధ్యాపనచేసే వాండ్ల సంఖ్య జోరైదుంది.

నే: అంటే చక్కగా అన్నివిధాలా పరిపూర్ణిమ చెందియుం దన్నమాట.

వే: ఆ.

నే. చిత్రంగా వుంది! ఏదైనా ఒక్క మంత్రంమీద దాన్ని కొంచెం ప్రవర్తించి కటాక్షించండి!

వే: అమందో బ్రహ్మ అనే మంత్రముందనుకో—ఆ మంత్రభాగాన్నే యేవిధంగా తంతు నడపాలిఅనడానికి దార్లు చూపించే వర్ణన ఒక మహా సముద్రం; అది దానికి సంబంధించిన బ్రాహ్మణం. ఆనంద మేమిటి, ఎక్కడ్నుంచి వచ్చింది. అ దెక్కడికి కెళ్తుంది. అది వుంటే యే ముపయోగం, లేకపోతే యేం నష్టం. ఇత్యాదివిషయా లన్నిటినీ చర్చించడానికి బ్రహ్మపదార్థానికి వుండే సంబంధబాంధవ్యాల విషయాల్నిగురించి ఉపన్యసించే భాగం దాని ఉపనిషత్తు. ఈరీతిగా నితరమంత్రాల గ్గూడాను.

నే ఆహా. ఋగ్వేదంలో నొక్కొక్క మండలం ఒక్కొక్క ఋషి పేను మందిగదా, దీని భాగా లెవరెవరి పేర నున్నాయ్.

వే అదే దాని అందం. దానికి ఋషులూగిషులూ ఎవరూ లేరు. కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాలే దాని భాగాలు. ఏయే విధంగా నేయే రకపు కోరిక నెరవేర్చుకోవాలో తెల్పడానికి సూత్రంగా దాన్లోనించి సూత్రాలు బయలుదేరాయ్. అవన్నీ సంపుటమై యున్నాయ్.

నే బాగుంది, దాన్నిగూర్చిం దే వ్యాసుడండీ?

వే: ఏమిటీ వ్యాసుడా, కూర్చేవాడా? ఒకడు కూర్చడ మేమిటి? దానికా అగత్యమేమీ లేదు. స్వాయంభువం, అపౌరుషేయం. ఎట్లా పుట్టిందో అట్లా గుంది. దాని నాగసు నీ కెరింగించే దెట్లా!

నే చిత్తం, సాకర్యమాతూంది. తమ క్షమిద్దు. కానీండి, ఈ వేదం బ్రహ్మ చెప్పలా?

వే: అదా నీ సందేహం! నీప్రోక్తాలంటే అదా? మిగిలిన వేదాల్లోబాటిదికూడా బ్రహ్మనోట్లోనుంచి రాలేదనా? రాలా సృష్టికిముందే యిది పుట్టింది. అంతే గాని బ్రహ్మెవడు దీన్ని చెప్పడానికి?

నే అ దెట్లాగండీ?

వే మూఢుడవే కావునీ వవివేకివిలాగా నుండా వున్నావే! బ్రహ్మనే తీసుకో. నే నిది చెయ్యగల్ను అనుకోలేకుంటే ఆయన సృష్టించ గలడా? నేను, గలను; (రొమ్ము రాచుకుంటూ) అహం—అదే ఆ నమ్మకమే అహంకారం. అది లేందే సృష్టి సరేగదా, లోకంలో నే పనీ సాగదు.

నే కాబట్టి అహంకారంలేకుంటే ఎవరూ ఏమీ చేయలేరన్నమాట.

వే దానికి సందేహంగూడానా! అహంకార ముండబట్టే నీ వన్న బ్రహ్మాట, విష్ణుఆట, శివుడాట, నాఆట అన్నీ సాగుతున్నాయ్. దాన్ని మించింది లేదు దాన్ని గురించిన వేద మెక్కువంటావా, మిగతా వెక్కువంటావా?

నే చిత్తం. కావచ్చు. బ్రహ్మ, విష్ణు, శివుడు దేవుళ్ళు గారటండీ అట్లా గంటారు.

వే దేవుళ్ళే. చిల్లరదేవుళ్ళు. అస లెవడో, యెవరో వున్నారు; వాణ్ణెరిగినవాం డ్లెవరూ లేరు. వార్ని కనుక్కోవాలని యెందరెందరో యెంతెంతకాలమో దేవుళ్ళాడి చివరకేమీ తేల్చారు కారు. కాబట్టి ఎవరూ లేరనుకో వడమే సుఖమని మా మతం.

నే అంటే నాస్తికమా?

వే దాని కేంపేరు పెట్టి పిల్చినా పిలు. మా నమ్మకం ప్రకారం ప్రత్యక్షమే ప్రమాణం. మిగతా వాటికోసం కృషిచేయం.

నే అంటే అనుమానప్రమాణ మంగీకరించరన్నమాట.

వే. తర్కంలోకి దూకావ్! అన్నమాటే. ఉన్న దర్థంగాక కొట్టుకునేప్పుడు ఏదేదో అనుమానపడి దాన్నర్థంచేసుకుకోండు కదనెందుకు?

నే అల్లాగాండీ! ఒక్క సందేహం. ఇక్కణ్ణుంచి తమ రెక్కడికెళ్తారు?

వే (కొంచె మూహించి) ఊహ స్వర్గాని కనిపించి, అదుందో లేదో, ఉం—దనే అనుమానముందిగాబట్టిని స్వర్గాని కన్నారు కదా, అనుమానం పనికిరాదనడ మేమని మమ్మల్ని పూర్వపక్షం చేద్దామని?

నే: అబ్బ—

వే అబ్బ యేమిటి, నీ ఊహ ఆదే. ఇట్లాటి పిచ్చిమొర్రి ఊహలు విసరడానికేనా మా పని పాడుచేసి రప్పించింది?

నే లేదు స్వామీ, కోపగించకండి. బ్రహ్మ విష్ణుమహేశ్వరు లున్నారాండి తమ మతంలో?

వే లోకం కేవలప్రత్యక్షంగా కాకపోయినా ప్రత్యక్షమూ అనుకోదగ్గ అనుమానంగా వున్నారు.

నే వారి లక్షణా లేమిటండీ?

వే మామతంలో బ్రహ్మ వట్టి చాందసుడైన పండితుడు. అడిగిన వాండ్లకు లేదనకుండా యేది పడ్తే అదిస్తాడు. అదొక్కొక్కసారి సంకటమౌతుంది. అప్పుడు విష్ణు వున్నాడే, బలే గడేకాడు—గుండాగోయ్య, వచ్చి యేదో మాయచేసి ఆ సంకటాన్ని పాలిస్తాడు. ఇక శివుడొట్టి పిచ్చివాడు, పిచ్చికోసం, పిచ్చిదయ, పిచ్చినవ్వు, పిచ్చిఆట ఆయనకు లక్షణాలు. ముగ్గుర్లో మాకు విష్ణువు నచ్చాడు బలే చమత్కారి, బలవంతుడు, ఏదైనా తన యిష్టం వచ్చినట్లు చేస్తాడు. సిసలైన ప్రభువు కుండాల్సిన లక్షణాలూ అవ్వే. అందుకనే 'నావిష్ణుః పృథివీపతిః' అన్నారు, బ్రహ్మయాజ్ఞ్యవల్కుల స్వరూపాన్నెత్తుకోకుండా.

నే అందుకనే కొంద రాజులు తమరన్న విష్ణులక్షణాల్ని ప్రదర్శిస్తూంటారు?

వే ఇప్పటిగ్గూడానా? అవును, విన్నాం గాని, యీ యం బ్రహ్మ ద్దేమందో మా కాలంలో జాడాల్ళిండ?

నే. ఏం జరిగిం దేమిటండీ?

వే: జరగడం గిరగడ మెరగమే. రాజ్యాని కెళ్ళింతర్వాత మరో అధికారాన్నంగీకరించామా? మా కిష్టంలేనివన్నీ వద్దన్నాం.

నే దానికి సూత్ర మేమీ లేదండీ?

వే లోకం వుండిగా అహంకారవేద సూత్రం, నిరంకుశ అని. దాన్ననుసరించాం సర్వత్రా.

నే ఎవరూ కాదన్లేదండీ?

వే అనకేం, అన్నారు. మున లంటూవుండే వాండ్లు పైజెప్పిన బ్రహ్మలక్షణాలు కలవాండ్లు. ఒకసారొచ్చి మెత్తగా కాదన్నారు. వాండ్లకు తగిన సమాధానం చెప్పి త్వరలో వాగ్బంధ మయ్యేట్లు చేశాం!

నే ఎట్లా గేమిటండీ!

వే ఎట్లాగేమిటి! మీరు, పురాణాలమునకు చెల్లవలసినవి చెల్లనీకుండా అకట్టి పాపం కట్టుకున్నారన్నారుకదా, సకలదేవతాంశసంభూతుడైన ప్రభువు న్నేను. నాకంటే పురుషుడెవ్వడు? నే నుండగా మరొక ణ్ణంగీకరించడం పునరుక్తం, చర్వితచర్వణం, అనవసర మన్నాం. నన్ను ప్రభువును కావనగల్రా, సర్వదేవతలఅంశల్తో పుట్టలే దనగలరా? నోళ్లు మూసు కవతలికెళ్ళారు.

నే అబ్బా, యెంత పని చేశారూ! అయితే చిన్నతనంలో తమ తోడిబాలుల్ని తాకి, కొట్టి చంపేవాండ్లెందుకండీ? అడుగోడాని కొచ్చినవాండ్లను జంపడ మన్యాయం గదండీ?

వే నీకు బుద్ధిమాంద్య ముంది. అన్యాయమేమిటి? అహంకారమతావలంబకులకు మీ న్యాయాన్యాయవిచక్షణ హాస్యాస్పదంగా వుంటుంది. ఎందుకట్లా చేశామంటే తోడివాండ్లు, వాండ్లే పెద్దవాళ్లౌతారు. వాండ్లలో నెవరైనా ముందుముం దహంకరించి విరోధించవచ్చు. వాండ్ల నిప్పుడే చంపితే పోతుందిగా? మరొకటి. ఈడుజోడుబాలికామణు లుంటారు. వాండ్లు పెద్దవాండ్లయితే వాండ్లు మాకు దక్కకుండా వీం డ్లెత్తుకగలొచ్చు. వీండ్ల నిప్పుడే సంహరిస్తే అవ్వాడా బాలికలంతా పెద్దవాండ్లై మాకు దక్కుతారు. అనే మారపాలోచన్లతో చేసిన పని.

నే బాగుందండోయ్! ఇట్లాటి సిద్ధాంతాల్ననుసరించే మీ రన్న హిట్లరిక్కడ తన మతాని కాటంకంపెట్టేవాండ్లను, పెట్టగలవాండ్లను హతమార్చాడు రష్యాలో ఈ బాధెందుకని పిల్లలకు అయిదేండ్లు రాగానే ప్రభుత్వంవారే పట్టుకెళ్ళి వేరే స్థలాల్లో వాండ్లను తమ సిద్ధాంతానుసారంగా పెంచుతున్నారు. అయితే స్త్రీలవిషయంలో వారి సౌందర్యం...

వే. తమ అనభవానికే దక్కాలనుకోవడమేమిటండీ అనిగాదూ నీ వడగొచ్చింది? చెప్తాం విను. సౌందర్యం అనుభవాని కంటావా, కాదంటావా?

నే చిత్తం

వే అనుభవానికే ఐతే, ప్రభువుకన్నా దాన్ననుభవించదగ్గవాడుకానీ, అనభవించవలసినవాడుకానీ రాజ్యంలో నెవడూ? ప్రభువుకేం దింకొకరి కుంటే ప్రభువు భరించగలడా? భరించలేడు. కాబట్టి స్త్రీ విషయం గూడా అంతే.

నే చిత్తం. కొందరు తురుష్కప్రభువులిట్లా వాదించేవాండ్లటండీ, విన్నాం. అంతవరకెందుకు, కొంచెం మనవిచేస్తా వినండి ఇప్పుడు కొందరు చిల్లరమొల్లర రాజులుకూడా నట్లా చేయడంలా? కొందరు పెద్దమనుష్యుల మనుకునేవాండ్లింట్లో పనిపాటలకు దిరిగేవాండ్లనంతకంటే మన్నిస్తున్నారా? కాబట్టి మంచిదేదైనా వుంటే అది ముందు మన మనుభవించాల్నని సామాన్యులే అనుకునేప్పుడు చతురంబోధిపరీతరాజ్యశాసను డనుకోవడంలో నే మబ్బురముందీ?

వే బాగా చెప్పావురా! నీమాత్రం మా మతమర్మమైనవా డెక్కడా కనబట్లా మాకు!

నే చిత్తం. తమకు మృగయావ్యసన మధికమనీ, చిన్నప్పుడు వేటకు బయల్దేరితే అదే పనిగా వాట్ని చంపేవారనీ చదువుతా మేమిటండీ?

వే బాలసంహారానికి చెప్పిన కారణమే దానికీ సరిపోతుంది. వాట్ని ముందే సంహారం చేస్తే రాజ్యానికి రాగానే పదేపదే 'అయ్యా, మృగాల్తో పడ్తాడున్నా'మని వచ్చే పిలుపులు తప్పుతాయ్. లేకపోతే అంతకన్నా ముఖ్యమైన పనిపాటల్ని వదులుకుని వాటికోసం కాలం వ్యయం చేయాల్సొస్తుందని అట్లా చేశాం.

నే మొత్తానికి కారణం లేంది తమ రేమీ చేయలేదన్నమాట! గట్టివారు.

వే కారణం లేందే వ్యవహరించే పిచ్చివాండ్లనుకోయ్ అయితే చేసినవన్నీ మా అభిమానమతాని కనుకూలంగా నున్నయ్యా, లేవాని పరిమాచుకుంటూండేవాండ్లం.

నే దానికంతా తమకు సలహాదార్లుండేవారా? ప్రజాభిప్రాయాన్నాగడాని కేం సదుపాయా లాలోచించారు?

వే మా కొకడి సలహా యేమిటి, సర్వస్వతంత్రప్రవర్తకులకు? ప్రజాభిప్రాయ మెట్లాటిది? అనుకుంటారుగాని సామాన్యప్రజకెప్పుడూ కుడువనూ, కట్టనూ గావలసిన సేకరణతోనే సరిపోతూంటుంది. వారి నిరోధమెప్పుడు వచ్చినా వెనకవరో వుండి ఆడిస్తుంటారనుకోండి. దాన్ని గుర్తించి అట్లాటివాండ్ల నెప్పటికప్పు డణిచేస్తుండేవాండ్లం.

(22 వ పేజీ చూడుడు)

కథానిక

కోటీశ్వరుడు

రచన,

అలెంగ్జాండరు కుప్రిన్

అనువాదం,

"ఫల్గున్"

కుగ్రామమైన క్రాసినోలో క్రిస్‌మస్ పండుగల మూడోరోజు సాయంకాలం. రాకిటిన్ ఇంటివద్ద అనేకమంది అతిథులు పోగయారు. రాకిటిన్ ఒకానొక పోస్టాఫీసు ఉద్యోగి—బ్రహ్మచారి.

ఆ ఇంటిలో ఉండే పెద్దగదులు రెండూ ప్రత్యేకమైన పేర్లతో పిలవబడుతున్నాయి. ఒకటి 'రిసెప్షన్ రూమ్' రెండవది 'బెడ్ రూమ్'!

గౌరవ అతిథిస్థానంలో పోస్టాఫీస్ మేనేజరు షిమిడ్ ఆసీనుడయ్యాడు. బాగా లావెక్కిన అతని శరీరం నీటితో నిండి ఉన్నట్టుగా ఉంది పాలిపోయిన అతని ముఖంలో ఉదాసీనభావం కనబడ్తూంది. అతనికి ఇరువైపులా ఫాదర్ డికాన్ వేసలీ, విందు ఏర్పరచిన ఆసామీ ఒకరి కొకరు ఎదురుగా కూర్చున్నారు

రాకిటిన్ ఉత్సాహపూరితంగా కనబడుతున్నాడు. అతని కళ్లలో మిలమిలా కాంతి మెరుస్తూంది.

ఇతరస్థానాల్లో అసిస్టెంటు పోలీసు ఇన్స్పెక్టరు పావలోన్, అతనికి ఎదురుగా ఒకాయన పొడుగ్గా వేలాడే జుత్తుతో ఒకానొక యోగి ఆకృతిని దాల్చి కూర్చున్నాడు. అతన్ని అందరూ మాస్టరుగారు అని పిలుస్తారు. టేబిల్ చిట్టచివరను అగీపావిచ్ మాలిగన్ ఆశ్రయించాడు. పిరికితనంచేతను, ప్రజలకు దూరంగా ఉండే స్వభావం కలవాడవడం చేతనూ మాలిగన్ ఎప్పుడూ వెనక స్థానాల్లోనే ఉంటాడు అతడు కూడా ఒక పోస్టాఫీసు ఉద్యోగే.

మాలిగన్ సాధ్యమయినంతవరకు ఇతరుల ఇళ్లకు విందుకు వెళ్లడం తప్పించుకుంటాడు. అందువల్ల వారిని తిరిగి తన ఇంటికి విందుకు పిలవాలనే భయం అతనికి ఉండదు. ఆఫీసులో అందరికన్న ఎక్కువ వేతనం తెచ్చుకుంటున్న ఉద్యోగి మాలిగన్. అదీగాక, ఆయన తన భార్యను, ముసలి అత్తగారిని, మరి ఐదుగురు పిల్లల్ని పోషించవలసిన బాధ్యతకూడా వహిస్తున్నాడు వారందరికీ తిండీ గుడ్డా ఇచ్చి పోషించవలెనంటే నెలకు తనకు వచ్చే పాతిక రుబెల్సు ఏవిధంగానూ సరిపోయేవి కావు.

టేబిల్ దగ్గర కూర్చున్నాడే గానీ, మాలిగన్ చాలా కంగారు పడుతూ పూర్వంకన్న ఉదాసీనంగా కనబడుతున్నాడు. వణుకుతూన్న తన చేతులు నలుపుకుంటూ తన అవసరం తీర్చుకొని పోదామని సమయం కోసం చూస్తున్నాడు. అనవసరమైన ఆందోళన, అగంకాని బాధతో ఆయన తనకిచ్చే వస్తువుల్ని నిరాకరిస్తున్నాడు. తనవల్ల ఇతరులకు ఖర్చు అధికం కాకూడదనే దరిద్రుని తెలివి, అసందర్భమైన భయం ఆయన్ని ఆవరించాయి.

అతిథులు బాగాతిని త్రాగి విందారగించారు. కొంతసేపటివరకు వారికబుర్లు నిర్జీవంగా ఉండినాయి. ఒకానొక భూస్వామిని గురించి, జిల్లా పోస్టల్ ప్రధానోద్యోగిని గురించి, ఊళ్లోని బిషప్పును గురించి, వచ్చే సంవత్సరం పంటను గురించి వారి సంభాషణ సాగుతూంది.

సంభాషణ మధ్యలో మూడు నాలుగు సార్లు అనుకూలంగా తోచి మాలిగన్ పోలీసు ఇన్స్పెక్టరు వైపుకు ఓమారు, మాస్టరుగారు ప్రక్కకు ఓమారువంగి మామూలు మాటల ధోరణిలోనే తనకు చేబదులు ఇవ్వగలరేమో అడుగుదామనుకున్నాడు.

క్రమక్రమంగా సంభాషణ ఈ రోజుల్లో బ్రతకడం ఎంత కష్టమయిపోతున్నదీ విచారించడానికి దిగిపోయింది. ఈ సంభాషణలో అందరూ పాల్గొనడానికి అవకాశం ఏర్పడింది. ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాన్ని వెల్లడి చేస్తున్నారు.

"మీరెన్ని చెప్పండి, ఈ రోజుల్లో అన్నిటికన్న ప్రధానమయినది డబ్బు. డబ్బొక్కటే."

"ఒకప్పుడు నేను భాగ్యవంతుణ్ణి కావాలసిన అవకాశం వచ్చింది కాని ఇంతలో చెయ్యి జారిపోయింది" అని షిమిడ్ తన అనుభవాన్ని వర్ణిస్తున్నాడు.

"కొందరికి లాటరీలలో డబ్బుకలిసి వస్తుంది!" అన్నాడు ఫాదర్ డికాన్. ఒక నిట్టూర్పు విడుస్తూ 'ఇంటర్‌నేషనల్ లోను' టికెట్టు ఒకటి అతడు కొన్నట్టు అందరూ ఎరుగుదురు.

"ఒకానొక భాగ్యవంతుడు లాటరీలో 200 మిలియన్లు గెలుపొందినట్టు పేపర్లో చదివాను. చూశారా, ధనం మళ్ళీ ధనంలో పొర్లాడుతుండే భాగ్యవంతుని దగ్గరికే చేరింది. అదే ఒక పేదవానికి వచ్చియుంటే ఎంత పెన్నిధి! భగవదిచ్ఛ ఎంత అసమంజసంగా ఉన్నదో!"

"అవునవును. ఓ సారి లాటరీలో గెలుపొందిన వారు రెండవసారి కూడా గెలవడానికి కష్టమేమీ లేదని అంటారు. ఆ మాట నిజమే అనుకుంటాను" అన్నాడు మాస్టరుగారు. బొంగురు గొంతుకతో తడబడుతూ "అలాగంటారు కాని అది సంభవమేనని నేను నమ్మలేను" అన్నాడు పోలీసు ఇనస్పెక్టరు.

నెమ్మదిగా సంభాషణ అకస్మాత్తుగా ధనం కలిసివచ్చిన వారి కథల్లోకి దిగింది. ఆకథలన్నీ బాగా ప్రచారంలో ఉన్నవి ఒక్క కథను పోలినవే అన్నీను పారిస్‌లో అగ్గిపెట్టెలు అమ్ముకునేవాడు కోటీశ్వరుడు ఎలాగయినదీ, 'ఒకాయనకు భూమిలో పాతినధనం ఎలాగు లభించినదీ, కొందరు కొందరు జూదాలలో గెలుపొందడం, మరికొందరు అదృష్టం కలసొచ్చి లక్షాధికారులకు అల్లుళ్ళు కావడం— ఈ కథలన్నీ ఒకదాని వెంక ఇంకొకటి వెలువడ్డాయి.

ఈ సంభాషణ అంతటినీ ఎంతో శ్రద్ధగా ఆలకిస్తూన్నాడే గానీ మాలిగన్ ఒక్క మాట కూడా అనలేదు. గంభీరమైన అతని ఆకారంలో అనేక భావనలు పుట్టిన కారణంగా విన్నవన్నీ తన స్వంత అనుభవాలు కింద మారుతున్నాయి. అప్పలిచ్చిన కథలు, అనుకోని భాగ్యాలు, లక్షాధికారులనే విచిత్రవ్యక్తులు, ఏ చిన్న సరదానయినా మరి పోలేనివారి స్వభావాలు మాలిగన్‌ను చాల ఉద్రేకపరచాయి. అంతకన్న, ఆ సమయంలో తాను అల్పమైన నాలుగు రూకలకోసం కక్కుర్తి పడుతున్నాననే భావం అతన్ని చాలా క్రుంగతీసింది

"కొందరికి దారిలో ధనం లభిస్తుంది!" అన్నాడు—మాలిగన్ అకస్మాత్తుగా తన మాటలకు తానే ఆశ్చర్యపోతూ

అందరూ అతని వైపే చూశారు. అంతవరకు మాలిగన్ ఒక్కమాటకూడా అనియుండలేదు. మాలిగన్ కంగారుపడి వికారమైన తన చూపుల్ని "టేబిల్ క్లాతు" మీదకు దించేసుకున్నాడు

"అందుకు సందేహం లేదు. దారిలో డబ్బు దొరుకుతుంది! కాని అది ఇంకొకళ్ళ జేబుల్లో మాత్రం ఉంటుంది!" అని అసిస్టెంటు పోలీసు ఇన్‌స్పెక్టరు చమత్కరించాడు.

అందరూ ఒక్కమారుగా విరగబడి నవ్వడం ప్రారంభించారు. ఇన్‌స్పెక్టరు ఛలోక్తికి కన్న మాలిగన్ ఆకృతి వారిని ఎక్కువ వినోదపరిచింది. అయితే సంభాషణ సాగిపోతూంది ఈమారు పెద్ద లూటీలు, ఈనాటి వరకూ పట్టుబడకుండా ఉన్న దొంగతనాలు గురించిన కబుర్లకు మారింది. మళ్లీ మాలిగన్ కళ్లముందు వందలకొద్దీ వేలకొద్దీ లక్షలకొద్దీ రూపాయలు నాట్యంచేస్తున్నాయి. పెద్దపెద్ద నోట్ల కట్టలు ప్రత్యక్షమవుతున్నాయి.

తమకు ఎంత ఆస్తి ఉన్నదో కూడా లెక్క మరిచిపోయిన భాగ్యవంతుల అద్భుతమైన పేర్లు వినబడుతున్నాయి. ఈ కథలన్నీ వింటున్న మాలిగన్ స్థితి వంటగది దగ్గర నిలబడ్డ ఆకలిగొన్న వాని చందంలో ఉంది.

'రంగ్' మన్న గడియారపు ఒక్కగని ఒక్కమోత వారికి రాత్రి ఒంటిగంటయిందన్న సంగతిని తెలియజేసింది. ఫాదర్ డికాన్ లేచి తన పొడుగాటి చొక్కాచేతుల్ని మీదికి ఎత్తుకుంటూ అందరి దగ్గరా శెలవు తీసుకున్నాడు. వెంటనే మిగతావారుకూడా లేచారు. మాలిగన్ మాత్రం తన చోటునుంచి కదల్లేదు. రాకిటిన్ అతిథుల్ని ఒక్కరొక్కర్నే కొవ్వొత్తి వెలుగుతో దారి చూపుతూ వారి దగ్గర శెలవు పుచ్చుకుంటున్నాడు. అంతసేపూ మాలిగన్ యథాస్థానంలో అలాగే కూర్చున్నాడు టేబిల్ మీదనున్న రొట్టెముక్కల్ని వణుకుతున్న తన చేతివేళ్లతో ఇటూ అటూ తిప్పుతున్నాడు ఆలోచన పూర్వకంగా.

"రాకిటిన్ ఇంక ఒక్కనిమిషంలో వస్తాడు. అతన్ని తప్పక అడుగుతాను ఈమాత్రం సాహసం చెయ్యకపోతే ఎలాగు? ఇంతమాత్రానికే అతడు నన్ను కొరుక్కుని తినడు కదా?"

రాకిటిన్ తిరిగి వచ్చాడు. తన మిత్రుని పక్కనే కూర్చున్నాడు. అందరితోపాటు ఇతడుకూడా ఎందుకు వెళ్లలేదా అని ఆశ్చర్యపడుతున్నాడు. మాలిగన్ కూడ తన పనేదో వెంటనే చెప్పక ఏదో అర్థంలేని పెద్ద సంభాషణ ప్రారంభించాడు. ఆఫీసు పని, జీతాలు మొదలైన విషయాలు మాటాడుతున్నాడు. రాకిటిన్ అతనివైపే నిద్రకళ్లతో చూసాడు. అతని మాటలు శ్రద్ధగా వింటూన్నట్టే నటిస్తూ నోటికి చెయ్యి అడ్డంగా పెట్టుకొని నెమ్మదిగా ఆవులించాడు. అరగంట గడిచింది. చివరకు రాకిటిన్‌కి విసుగెత్తి పెద్దగా ఆవులిస్తూ లేచాడు.

"క్షమించాలి, రేపు మళ్లీ నేను పనిలోకి వెళ్లాలి" అన్నాడు

మాలిగన్ గడబిడగా లేస్తూ క్షమాపణ చెప్పుకుంటున్నాడు.

వీధిగుమ్మందాక వచ్చేసి తలుపుగడియమీద చెయ్యివేసి జారిపోతున్న తన సంకల్పాన్ని నిలుపుకుంటూ రాకిటిన్‌వైపు తిరిగి నేలవైపు చూస్తూ బిగుసుకొని పోతున్న గొంతుకతో—

"నాది ఒక చిన్నకోరిక ఉంది" అన్నాడు.

"ఏమిటది?" అన్నాడు రాకిటిన్ కొంచెం బరువుగా.

"మీకు తెలియకపోవచ్చు. నిజంగానే చెప్తున్నాను. మిమ్మల్ని మోమాట పెట్టడం కాదుగానీ - ఇంటిదగ్గర పురిటిరోజులు. తప్పనిసరి. మీకు మళ్ళీ చెల్లించుకుంటాను గానీ, నాకు ఏమయినా సహాయం చేస్తారేమో అని " పదిరుబెల్సు అడుగుదామనుకుని అంత డబ్బు అడిగేందుకు భయపడి—

"ఒక్క ఐదు రుబెల్సు ఇప్పిస్తే.."

"నాదగ్గర దమ్మిడీఅయినా లేదు" అన్నాడు రాకిటిన్. నమ్మకం పూర్తిగా కలిగించడానికి మాలిగన్ తట్టాడు.

"ఇల్లంతా గాలించినా ఒక్క దమ్మిడీ అయినా లేదు." రాకిటిన్ అంత నొక్కినొక్కి చెప్తున్న మాటలకు అర్థం మాలిగన్‌కు బోధపడక పోలేదు. తనదగ్గర డబ్బు ఉండి కానీ ఇవ్వడానికి జంకుతున్నాడు. రాకిటిన్ ఏదో సాకు చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. మాలిగన్ వీధిముఖం పట్టాడు.

వెన్నెలరాత్రి నిశ్శబ్దంగా బిగులుగా ఉంది. మంచు పాదాల మీద గోకులు కడ్తూంది. మాలిగన్ చాలాదూరం వెళ్ళాలి. డబ్బును గురించిన ఆలోచనమాత్రం మాలిగన్‌ను విడువలేదు. కొద్దిసేపట్లో తాను చలితో నిండియున్న తన బొక్కికొంపకు చేరుకోబోతున్నాడనే తలంపు ఆయన్ని భయపెట్టింది. తన ఇంట కిటికీలు అద్దాలు విరిగి. ఊచలూడిపోయి చలిగాలిని ఇంట్లోకి స్వేచ్ఛగా ప్రవేశించడానికి పిలుస్తున్నాయి ఆ ఇంట్లో దారిద్ర్యం మళ్లి దుర్గంధం వ్యాపించింది. పిల్లల గుడ్డలు తోళ్లవలె ఉన్నాయి. ఒక ప్రక్క ఆత్రుతతోనూ మరి ఒక ప్రక్క నిస్పృహతోనూ డబ్బుకోసం అడిగే భార్యకు ఏమని జవాబు చెప్పడం? తానేమో విందారగించాడు. కొద్దిగా మద్యముకూడా సేవించాడు. వారో? ఇంటిదగ్గర పస్తులు పడుకున్నారు. తను డబ్బు తీసుకొస్తాడన్న ఒక్కటే ఆశ వారికి.

"ఓయి భగవంతుడా, ఇది నీ కేమి ధర్మంగా ఉంది? ఇతరులకి సౌఖ్యాన్ని ఇచ్చావు. వారి కావలసినదల్లా ఇచ్చావు. కాని నన్ను మాత్రం మరచిపోయావు కొందరికి కొన్ని సమయాల్లో అవసరం లేకపోయినా డబ్బు దొరుకుతుంది. మరి నాకు ఒక్కమారు, ఒక్కమారయినా ఓ పదో పాతికో దొరకదేమి?

"మంత్రసానికి ఇచ్చుకుందును. మా పెద్దపిల్లకి బూట్లు, చిన్నదానికి గౌనులు కొందును. ఈ నిమిషాన్ని ఈ రోడ్డుమీద నాకు ఒక పర్సు దొరకకూడదా? ఒకొక్కప్పుడు అలా దొరకడంకూడా కద్దు. ప్రజలు అటువంటి విషయాలను గురించే ఎక్కువగా వ్రాస్తుంటారు. చెప్తుంటారు."

ఒక్కక్షణంలో మాలిగన్ తన ఊహాశక్తి ప్రభావంవల్ల కొత్త లోకంలో విహరింపసాగాడు. ఆ భావనాలోకంలో అతని కొక పెద్ద పర్సు దొరికింది. దాన్ని అతను తెరిచినప్పుడు అందులో వందలూ, వేలూ విలువచేసే నోట్లు ఉన్నాయి. లాటరీ టికెట్లు ఉన్నాయి. తానొక పెద్దయింటికి మార్చేసాడు ఆ ఇంట్లో ఎంతో వెచ్చగా ఉంది. ఎంతో హాయిగా ఉంది. ఇంటినిండా ఇంపైన సామాను. పిల్లలందరికీ వెచ్చని ఉన్నిగుడ్డలు. ఇంకా అనేక వస్తువులు. డబ్బు సంపాదించగల ఎన్నో ఉపయోగకరమైన వస్తువులు కొన్నాడు.


విందులో సేవించిన వోడ్కా (మద్యము) ప్రభావంవల్లనో, తాను కల్పించుకున్న ఊహాల ప్రభావంవల్లనో మాలిగన్‌కు ఆ రాత్రి, ఆ నిమిషాన్ని, అక్కడే ఒక పర్సు దొరుకుతుందన్న నమ్మకం దృఢమైపోయింది. ఆ ఊహ ఎంత తెలివిమాలినదని ఎవరు వాదించినా మాలిగన్‌కు ఆ నిమిషాన్ని కలిగిన నమ్మకాన్ని తప్పించడానికి ఎవరితరమూ కాదు. ఎందుచేత అతనలా ఊహించుకున్నాడో మనకు తెలీదు. అతనికే తెలీదు. తనకు తప్పక రోడ్డుమీద పర్సు దొరుకుతుందని విశ్వసించాడు. తలవంచి నేలను పరీక్షగా చూస్తూ నడుస్తున్నాడు

"ఇక్కడ, ఇప్పుడు, ఈ క్షణము"అని తనలో తాను గొణుగుతున్నాడు-మతిపోయినట్టు, నిజంగా తనకు లభించినట్టు-మరికొన్ని అడుగులు-అప్పుడే-అక్కడే-వెంటనే రోడ్డుమీద ఒక పర్సు అగుపడింది. ఇదేమీ అతను కల్పించుకున్న ఇంద్రజాలంకాదు. స్పష్టంగా రోడ్డుమీద మంచులో మిలమిలా మెరుస్తూ అరచేతి దళసరిని పర్సే!


ఆత్రుతతో ఆందోళిత హృదయంతో ఆయాసపడినట్టు అయాడు మాలిగన్. అతని వెంట్రుకలు లేచి నిలుచున్నాయి. నాలుగు వైపులా భీతితో కలియచూశాడు దొంగవలె. ఒక్కపరుగున వెళ్ళి ఆ నేలమీద నున్న వస్తువును చేత చిక్కించుకొని మీద కెత్తాడు.

అతని చేతుల్లో అదొక దళసరి పెద్ద పర్సుగా సాక్షాత్కరించింది. తన కలలకు వాస్తవానికి ఆకస్మికంగా కలిగిన ఈ అద్భుతమైన మేళవింపు మాలిగనును కొంతసేపటివరకు ఆచేతనుణ్ణి చేసింది. కాని చేతిలోఉన్నది పర్సే అన్న సంతృప్తితో మాలిగన్ దాన్ని గుండెలకు గట్టిగా అదుముకొని ఇంటివైపు పరుగుతీసాడు.


(16 వ పేజీ చూడుడు)



కాంబాకం కొండలకు పోవు దారి. దూరాన్నుంచి కొండకోన దృశ్యము.




ఆరంబాకంలో ఆరోగ్యమందిర శంఖుస
అందరితో




ఇక్కడ మలేరియానివారణకై పెంచ
స్వచ్ఛతను ప్రతిబిం

కాంబాకం




ఈ కొండకోనలో రాళ్లగుట్టల అంచులలో ఉన్న నీటి సోనలు, వాగులు.



గోరక్షణశాలను శ్రీ చంద్రమౌళిప్రభృతులు దర్శించినప్పటి చిత్రము.

కాంబాంకం కొండల వృక్షసౌరభము.



కాంబాకంకొండలు మద్రాసుకు 54 మైళ్
సోనలు ప్రాకృతికమైన స్థలములు, పరిశ
భక్తవత్సలంగారలు ఈ నెల ౯ వ తారీఖున
ఆరోగ్యమందిర శం

ఈ కొండకోన, పట్టణవాసులకు విశ్రాంతి
ఇచటి ప్రకృతి రమణీయతనూ, తటాక,
(మద్రాసుప్రభుత్వ ప్ర
కొండకా





…మయమున అధికారులు, సభ్యులు,
…చిత్రము.




గుబురుగా చిట్టడివివలెనున్న ఈ చెట్లనీడలు ప్రకృతిసిద్ధ విశ్రాంతిమార్గాలుగా పనికివస్తాయి.




… మత్స్యగుండములు. ఇచటి నీటి
… తెలుపుచున్నవి.

కొండకోనలు




గోశాలలో పెరిగిన తరిపిదూడలు.




గోరక్షణశాలలో ఉసులుబొట్లను నేలబారు నూతులను మంత్రులు పరిశీలిస్తున్న దృశ్యం.

…ములో నున్నవి. ఇచట గోరక్షణశాల,
…కు మద్రాసు మంత్రులు గా. చంద్రమౌళి,
కొండకోనను సందర్శించి ఆరంబాకంవద్ద
…నోత్సవము జరిపిరి.
…గా మార్చుటకు చక్కని అవకాశమున్నది.
…క్షణ కృషులను చిత్రములు తెలుపగలవు.
…శాఖవారి సౌజన్యంతో)
…యుగము.



కొండకోనలో నున్న చక్కని జలవిహారము.





యముణ్ణి ఖైదుచేసిన వడ్రంగి

శ్రీ నేమాని వీరభద్రరావు

రామయ్య వడ్రంగిపనిలో తెలివైన వాడు. ఎంతచక్కటి వస్తువులనైనా కర్రతో చేయగలవాడు. ఒకరోజున గంధపుచెక్క కోసం దగ్గరగా వున్న అడవికి వెళ్లేడు. అడవిలో వెతికివెతికి విసుగెత్తిపోయాడు ఎన్నో పులులు, సింహాలు మొదలగు క్రూరజంతువుల నోట్లో పడకుండా తప్పించుకురావటం బహుకష్టమైపోయింది. బయలుదేరిన వేళ బాగులేదేమో అని యింటికి తిరిగి వచ్చేస్తున్నాడు తన దురదృష్టాన్ని నిందించుకుంటూ అలిసి ఒక చెట్టు నీడని కొంచెంసేపు నిల్చున్నాడు. ఆ చెట్టు అంతా లతలచే కప్పబడివుంది. చెవులు రిక్కించి విన్నాడు. "ఓ వడ్రంగీ, నేను ఈ వనానికి చెందిన దేవతను యీ చెట్టుమీదే నా నివాసము. నా నివాసాన్ని కాపాడేవంటే నిన్ను భాగ్యవంతునిగా చేస్తాను" అంది. రామయ్య పరకాయించి చూస్తే అది చందనపుచెట్టు. వనదేవత వడ్రంగిచేతిలో గొడ్డలి చూచి ఆ చందనపుచెట్టును ఎక్కడ కొట్టేస్తాడో అని భయపడి ఆ విధమైన వాగ్దానం ఇచ్చింది. వనదేవత మాట్లాడటం మానెయ్యగానే చెట్టు ఒక్కసారి వూగి ఒకకొమ్మ నేలమీద పడింది.

"ఓ వడ్రంగీ, యీ కొమ్మ తీసుకుపోయి, దీనితో ఒక రాట్నం చెయ్యి. ప్రపంచంలో వింతవస్తువులన్నిటికన్నా వింతైనది. ఒక్కరాత్రిలో ఎంత ప్రత్తినైనా సన్నని దారంక్రింద తీయగలదు. దానిని నీ యిష్టం వచ్చినంత హెచ్చు ధరకు అమ్మి, సీతాకోకచిలుకలాగ, పక్షుల్లాగ స్వేచ్ఛగా బ్రతుకవచ్చు" అని అంది.

రామయ్య భక్తిశ్రద్ధలతో చెట్టుకు నమస్కరించి తన అదృష్టానికి సంతోషిస్తూ యింటికి వచ్చేడు. మధ్యాహ్నభోజనంచేసి తను పనిచేసే గదిలోకి వెళ్లి రాట్నాన్ని తయారుచెయ్యడానికి ప్రారంభించేడు.

మరుసటిదినానికి రాట్నం తయారు చేశాడు. భార్యని పిల్చి "ఏమేవ్, రాత్రంతా మేలుకొని యీ రాట్నం పూర్తిచేశాను. నిద్రతో కళ్లు మూసుకుపోతున్నాయి. నువ్వు యీ రాట్నాన్ని బజారుకు తీసుకుపోయి పదివేల వరహాలకు తక్కువ కాకుండా అమ్ముకు రావాలి. యిది విలువైన వింత రాట్నం" అన్నాడు.

భార్య భర్తచెప్పినట్లు బజారుకువెళ్లి 'పదివేల వరహాలకు ఒక్కటే రాట్నముందోయ్' అని కేక వెయ్యటం ఆరంభించింది. ఎంతోమంది జనం ఆమె చుట్టూ చేరారు. ఇంత విలువగల రాట్నం వుంటుందా అని కొందరూ, యింతధరేమిటని కొందరూ, పిచ్చిదేమో యీమనిషి అని కొందరూ అనుకుంటున్నారు. ఆ గుంపులో వున్న ఒక ధనవంతునికి తనకున్న ధనం యీ చిన్న రాట్నానికై వెచ్చించడం యిష్టంలేదు. అసలు ధనమే లేనివాళ్లు వేళాకోళము చెయ్యటమే తమ పనిగా పెట్టుకొని ఆమెకూడా వెళ్తున్నారు. యింతలో త్రోవంట ఒక ధనికుడైన వర్తకుడు పోతూ "ఏమమ్మా, నువ్వు ఎందుకు బజారుకు వచ్చేవు? నీ కూడా నవ్వుతూ, వేళాకోళాలు చేస్తూ యీ జనమేమిటి? వారిని నువ్వేమైనా అన్నావా?" అన్నాడు "అయ్యా, నేనేం చెయ్యను? నా భర్త యీ రాట్నాన్ని పదివేల వరహాలకు అమ్ముకు రమ్మన్నాడు. అందుచేత ఆ ధరకు ఎవరైనా కొంటారని నేను యీ బజారు వెంట అరుస్తూవుంటే యీ జనానికి ఏ వింత కనబడిందోగాని, నన్ను హేళన చేసి, నావెంట పడుతున్నారు యింకొంతదూరం వెళ్లేక కొడతారేమో అన్న భయంకూడా వేస్తూంది" అంది ఆ వర్తకుడు జాలిపడి 'నావెంట మా యింటికి రా అమ్మా" అని ఆమెను వెంటబెట్టుకు పోయాడు. యింటికి వెళ్లేక ఆమెను కూర్చుండమని "అమ్మా, యీ రాట్నంధర యింత హెచ్చుగా ఎందుకుందో, నీభర్త చెప్పి పంపేడా?" అన్నాడు.

"అయ్యా, హెచ్చు వివరాలు నాకు తెలియవుగాని, యీ రాట్నం ఒక్కరాత్రిలో ఎంత ప్రత్తినైనా సన్నని దారంగా తీయగలదట. ప్రత్తిని, దీనిని ఒక గదిలో పెట్టి తాళం వెయ్యాలి." అంది

"ఈ రాట్నం అంత పని చెయ్యగలిగితే నువ్వడిగిన ధనం హెచ్చుగా లేదు. యీ రాత్రి దీని సంగతి చూస్తాను. నాకు తృప్తికరంగా వుంటే వుదయం నీకు కబురు పంపించి నీకు రావలసిన సొమ్ము యిస్తాను" అన్నాడు. ఆమె వొప్పుకొని యింటికి పోయింది.

వుదయం వర్తకుని దగ్గరనుంచి కబురు రాగానే ఆమె తొందరగా వెళ్లింది. మారు మాటాడకుండా వర్తకుడు ఆమెచేతిలో పదివేల వరహాలు ఆమెకిచ్చాడు. ఆమె కళ్లు వాటిని చూడగానే మెరిసేయి. తొందరగా మూటకట్టి యింటికి పట్టుకుపోయింది. రామయ్య ఆనందానికి మేరే లేదు. భార్య నేర్పరితనాన్ని ఎంతో పొగిడాడు. యీ వరహాలను తన గదిలో గొయ్యి తీసి అందులో పాతుదాం అనుకున్నాడు. కాని యింతలో ఒక క్రొత్త ఆలోచన తట్టింది. దొంగలు తన యింటికి వచ్చి యీ ధనం అంతా ఎత్తుకు పోతారేమో అన్న భయం వేసింది. ఒక మంచి ఆలోచన తట్టింది. ఒక పెద్ద చెట్టులో ఒక గదివలె తయారుచేసి, దానికి ఒక వింత తాళం అమర్చి, అందులో యీ ధనాన్ని వుంచుదాం అనుకున్నాడు.

మరుసటి రోజున్నే దగ్గరున్న అడివిలో ఒక పెద్ద చెట్టులో ఒక గది తయారు చేశాడు. పని పూర్తి అయిన వెంటనే యిద్దరు వ్యక్తులు అతని ఎదుట నిలబడ్డారు. వారు భయంకరంగా వున్నారు. వారిద్దరూ యముని బంట్రోతులు. "ఏయ్, వడ్రంగీ, నువ్వేనా వింత రాట్నాన్ని పదివేల వరహాలకు అమ్మినవాడవు?" అన్నాడొకడు. "నీకు స్వర్గంలో స్థానం లేదు. నీమీద మా ప్రభువైన యమధర్మరాజువారికి కోపం వచ్చింది. నువ్వు చేసిన పాపానికి పశ్చాత్తాపం పొందుతేగాని నువ్వు సంపాదించిన సొమ్ము నిన్ను అనుభవించనియ్యరు." అని చెప్పాడు. "నేనా, పాపపు పని చెయ్యటంకి ఎవరో



ఈమాదిరి జీప్ కారులు యుద్ధకాలంలో వాటికన్నా శ్రేష్ఠమైనవి శాంతికాలఅవసరాలకు కూడా, బ్రిటిష్ ఫ్యాక్టరీలు తయారుచేస్తున్నవి.

దురదృష్టం

పిల్లల కథ

చి॥ ఘండికోట సీతారామ

జ్యేష్ఠాదేవి, లక్ష్మీదేవి అక్కచెల్లెళ్లు. జ్యేష్ఠాదేవి ఎవరిమీదనయినా దయ తలచిందంటే, వారికి దారిద్ర్యము, కష్టాలూ తప్పవు. లక్ష్మీదేవి చల్లనిచూపు ప్రసరించినవారు ధనవంతులు, సుఖవంతులూ అవుతారు.

ఒకనాడు జేష్ఠాదేవికీ, లక్ష్మీదేవికీ "ఎవరు గొప్ప?" అన్న ప్రశ్న వచ్చింది 'నేను గొప్ప అంటే, నేను గొప్ప. అని వాదించుకుంటున్నారు.

ఇంతలో దూరంనుండి పేద బ్రాహ్మడొకడు ఆదారంటే వస్తున్నాడు. ఆ బ్రాహ్మణ్ణి లక్ష్మీదేవి చూచి జ్యేష్ఠాదేవితో—

"మనం ఎందు కిలా దెబ్బలాడుకోడం? ఆ బ్రాహ్మడిమీద మన ప్రతాపాలు వెల్లడిచేద్దాం! దాంట్లో ఎవరు గెలిస్తే వారే గొప్పవారు." అని అంది. జ్యేష్ఠాదేవి ఒప్పుకుంది.

"లక్ష్మీదేవి ఆ బ్రాహ్మణుడు వచ్చే త్రోవలో పెద్ద ధనంమూట పెట్టింది—ఆ ధనంమూట బ్రాహ్మణుడు తీసికొని పెద్ద ధనవంతుడౌతాడన్న ఉద్దేశంతో. జ్యేష్ఠాదేవి ఇది చూసింది.

"ఆ బ్రాహ్మణుడికి నీ డబ్బు మూట దక్కకుండా చేస్తాను, చూడు" అని లక్ష్మితో చెప్పి, ఆ వస్తున్న బ్రాహ్మణ్ణి ఆవేశించింది. అంతవరకూ బాగా నడుస్తూ వచ్చిన బ్రాహ్మడికి జ్యేష్ఠాదేవి ఆవేశించగానే చిన్న దురూహతోచి ఇలా అనుకొన్నాడు మనస్సులో:

"ఇంతవరకూ చూస్తూ నడుస్తున్నాను కదా! కళ్ళు మూసుకొని, రాళ్ళని తన్నేసి పడిపోకుండా, ఏమైగజాల దూరం నడవగలనో, లేదో చూద్దాం!"

ఈ ఆలోచన కలగగానే కళ్ళు మూసుకొని నడవడం మొదలు పెట్టేడు. అలానడుస్తూ రోడ్డుమీద లక్ష్మీదేవి ఉంచిన ధనం సంచిని దాటి వెళ్లిపోయేడు. అలా బ్రాహ్మడు తను ఉంచిన ధనంసంచిని దాటి వెళ్లిపోవడం లక్ష్మి చూసింది. జ్యేష్ఠాదేవి దగ్గరికి వచ్చి అంది,

"అక్కా! నీదయ కలిగిన ఏమనిషినీ ఎవరూ బాగుచెయ్యలేరు! నువ్వే నాకంటే గొప్పదానివి" అని నమస్కరించింది.

"దురదృష్టవంతుణ్ణి బాగుపరచేవాడు లేదు."

అబద్ధాలు చెప్పేరు" అన్నాడు రామయ్య. "నువ్వు యీ జన్మలో చెయ్యకపోయినా క్రిందటి జన్మలో చేసివుంటావు. ఎలాగైనా నువ్వు శిక్షార్హుడవు" అన్నారు. "అయ్యా, నేను తయారు చేసుకున్న గదిలో ఒక్క నిమిషం కూర్చోనియ్యండి" అని ప్రతిమాలి, వారింకా సమాధానం యివ్వకుండానే గదిలోకి వెళ్లి కూర్చున్నాడు. యముని బంట్రోతులకు కోపం వచ్చి అతన్ని లాక్కొద్దామని ఆ గదిలోకి వెళ్లేరు. రామయ్య ఏం మాయ చేశాడో గాని, యముని బంట్రోతులు అందులో వుండిపోయారు. రామయ్య బయట పడ్డాడు. యముని బంట్రోతులు ఖైదుగా చేయబడ్డారు.

యముడు, తన బంట్రోతులు యింకా రాలేదని అనుమానపడి, వడ్రంగి పిల్లని ఏదో మాయలో పడ ద్రోసేడని ఊహించి యింకొక బంట్రోతుని పంపించాడు. అతణ్ణి పంపేటప్పుడు, వడ్రంగికి యిష్టమైన ఒక కానుక పట్టుకొని వెళ్లమన్నాడు. యముని బంట్రోతు తెలివైనవాడు. చిన్నారు మామిడిపళ్లు ఒక తట్టెడు కొని వడ్రంగి యింట్లో సాయంకాలం భోజనాలు అవుతూంటే వచ్చేడు. "ఓ వడ్రంగీ, చాలా అలిసిపోయి వస్తున్నానోయ్. నువ్వు యీ మామిడి పళ్లు తీసుకొని, నాకింత అన్నం పెడితివా, ఎంతైనా సంతోషిస్తాను" అన్నాడు. రామయ్యకు మామిడిపళ్లు అంటే ఎంతో యిష్టం. వెంటనే అన్నం ప్రత్యేకంగా వండించి కడుపునిండా అతనికి పెట్టించేడు. యింకొంచెం అన్నం మిగిలిపోయింది. అతనికి చెట్టులో చేసిన గదిలోని ఖైదీలు జ్ఞాపకం వచ్చేరు. రామయ్య యింటికొచ్చిన బంట్రోతుని సహాయంగా తీసుకొని చెట్టు దగ్గర కెళ్లి, గది తలుపులు తీసే తియ్యటంలో అతిచురుగ్గా అందులో వుంచబడ్డ యిద్దరు బంట్రోతులూ పారిపోయారు. "ఓహో, మీ యింటికి వొచ్చినవారిని యిందులో వుంచుతారా?" అన్నాడు సహాయంగా వచ్చినవాడు. "అవును మా యింటికి వచ్చినవారందరికీ యిది విడిది" అన్నాడు రామయ్య. "యీ గది అందం చూదాం, లోపలికి పద" అని రామయ్య ఆహ్వానించేడు. కాని ఆ బంట్రోతు "అక్కర్లేదు. బయట నుంచే అంతా కనబడుతూంది. నీకు యింతకన్నా అందమైన భవనాలు నిర్మించగలను. కాని నువ్వు మాత్రం నాతో రావటానికి వొప్పుకోవాలి" అన్నాడు.

రామయ్యకి, ఆ విచిత్రం చూద్దామన్న కోరిక కలిగింది. కాని తీరా భవనందగ్గర నిలబడేసరికి యముడు యెదురుగుండా నిలబడివున్నాడు. "ఓరీ మూర్ఖా! నా ఆజ్ఞానువర్తులైనవారందర్నీ అవమానించేవు. కాబట్టి నిన్ను నిప్పులో తోసెయ్యాలి. నీ కున్న గది వంటిది నాకూ వుంది. కాని అది కాల్చిన యినుముతో చేయబడింది. అందులో నీవంటివాణ్ణి ప్రవేశపెడ్తే పాపాలన్నీ పోతాయి. కాని, నేనా పని చేసేముందు నీవు నిర్మించిన గది చూస్తాను. పద" అన్నాడు.

రామయ్య యమధర్మరాజుని, అతని అనుచరులను చెట్టుదగ్గరకు తీసుకువచ్చేడు. యముడు గదిలో ప్రవేశించగానే తలుపు తానంతట అది మూసుకుపోయింది. యమధర్మరాజు ఖైదీగా చేయబడ్డాడు. రామయ్య మాత్రం నవ్వుతూ యివతలే వున్నాడు. యముడు ఎంత ప్రయత్నించినా అందులోనుంచి రాలేకపోయాడు.

రామయ్య విరగబడి నవ్వుతూ "ఓ యమధర్మరాజా, నాకు నూరేళ్ళు ఆయుర్దాయం యిచ్చి నేను సంపాదించిన పదివేలనరహాలు నాభార్యతో సుఖంగా అనుభవించేలాగ వరమిస్తే వదుల్తాను నిన్ను" అన్నాడు.

యమధర్మరాజు ఎలాగో బయట పడదామని రామయ్య షరతులన్నిటికీ ఒప్పుకున్నాడు. తాను తన పనితనం వుపయోగించి చేసిన తాళంతో గది తాళం తీసి యముణ్ణి విడిచాడు.

రామయ్యా, భార్యా సుఖంగా బ్రతకనారంభించారు. యిప్పటికీ రామయ్య యింటిదగ్గరవున్న అడవిలో ఆ చెట్టు వుందట! పల్లెటూరివాళ్లు ప్రతిసంవత్సరం యముని పేర వుత్సవం చేస్తూ వుంటారట. వారికీ రామయ్యకి వచ్చినట్లే మంచి ఐశ్వర్యం, ఆరోగ్యం, ఆయుర్దాయం లభిస్తాయట.

———


బాలగేయాలు



పొడుంబుర్రలు


శ్రీమతి బండా కృష్ణవేణమ్మ

అనగనగా మావూరిలో
కలడొక మేష్టారు; వారి
కొండిన ఉండుర్
పొడు ముండు రెండు బుర్రలు
పిల్లల కెరుకే!
నలుచదర మొండు వెలయును
అరయంగా గుండ్రముండు
అయ్యల్లారా!
నునుపైన పండువంటిది
రెండవమారేడు బుర్ర
నస్యపుగనియే!
ఘనమైన దినములందును
పండుగ, పబ్బములయందు
మెండుగ దెచ్చుర్
చదరపు నస్యంపుబుర్ర
చదువరులారా!
నిత్యము తెచ్చును తథ్యము
తనబుర్రవంటి గోళము
నస్యము నిండర్
ఘనశాప మిచ్చునప్పుడు
నాసాంతము నింపనిచ్చి
జుర్రున చీదుర్!
ఒకనాడు క్లాసునిండను
పిల్లలు పదివేలు చేర
నాతడు పలికెర్:
"ఓరోరి బాలులారా!
జాగింక సేయవలదు
జాగ్రత వినుడీ!
రేపే వచ్చునో యేమొ
మన క్లాసు చూచుటకు
మన యినస్పెక్టర్!
ఆయన వచ్చిన తడవున
ఒక ప్రశ్న వేయనోపు
నెవ్వని నేనిర్
"తగ జెప్పు మెట్టి యాకృతి
వెలయంగా భూమి కుండు
వెంకయకుర్రా!"
అని ప్రశ్న వేయగానే
తెలతెల్లబోయి చూడక
దద్దమలారా!
నావంక తిరిగి చూడుడు
మీకై చూపింతు నాదు
గుండ్రని బుర్రర్
వెనువెంట తెలివి తెచ్చుక
తెగ జెప్పుడు తెలివి మీర
తడ వొకయింతర్
చూపింపక భూమియొక్క
గోళ మటంచుర్.
అని పల్కు నంతలోపల
వినిపించెను కిర్రుచెప్పు
కిరకిర శబ్దం
గప్‌చిప్ ఎక్కడివక్కడ
వచ్చెనురా! క్లాసులోకి
మన యినస్పెక్టర్.
వచ్చినవెంటనె యాతడు
అడిగె నొక కుర్రవాని
దూరపువానిర్
"తగ జెప్పు మెట్టి యాకృతి
వెలయంగా భూమి కుండు
వెంకయకుర్రా!"
వెంకయ ఒంకలు పోయెను
బుర్రంతయు గోకికొనుచు
వెర్రిగచూచెర్
కుర్చీవెనుకను నిలబడి
కంస్త్రైరజేయుతనదు
మాష్టరుగారిర్
ఆహా! ఎంతటిమోసము
చూపింపదు చెప్పినట్లు
గుండ్రని బుర్రర్
చూపించెను దానిబదులు
చదరపుదానిర్.
గురువులు మరచిరి నిన్నను
కోట్లు మార్చినయపుడె
బుర్రలు మార్చుర్
కానంత జ్ఞప్తికొచ్చిన
కలుగదుగా! మోసమింత
కోవిదులారా!
వెంకయ యేమని పల్కెను?
కానంతయు తడవుకొనక
ఖంగున పలికెర్.
"గుండ్రముగానే యుండును
వారాంతముదాక భూమి
వెంగయమాత్యా!
వారాంత మొక్కసారిగ
మారునుపో చదరంబుగ
మారు పల్కగనేలా!"



లండనులో జరిగిన ఒలింపిక్ పందెములు. 800 మీటర్ల పరుగుపందెం నెగ్గినవాడు మాల్విన్ విట్‌ఫీల్డు (అమెరికా 136 నెం.) 800 మీటర్లు 1 ని 49. 2 సెకన్లలో పరుగెత్తేడు. మునుపటి రికార్డు పరుగు 1 ని 49.8 సెకన్లు పట్టింది.

సాహిత్యమీమాంస:



మహాకవి త్రివిక్రమభట్టు

శ్రీ సాలగ్రామ కాశీవిశ్వనాధశర్మ

కావ్యము వస్తురుచిరత్వంచే, నిరతిశయాహ్లాద ప్రభుత్వంచే నితాంతరమణీయభవంబైన దగుచున్నది. దీనికి రుచిరత్వంబు రెుందుకు గల్గదు? స్వప్రకాశానంద స్వరూపంబైన, బ్రహ్మానందాస్వాదసమానమైన రసమే ఆత్మ గదా? కనుకనే రసికులు సహృదయులు అమంద కావ్యానందమును పొందుచున్నారు. తదితరుల మాట వేరు రచింపబనిలేదు. ఎట్లన—

"కవితారసపరిపాకం
వ్యనుభవరసికో విజానాతి"

ఈవిధంగా లోకోత్తర వర్ణనా నిపుణుడైన, కవికర్మకర్తయైన కవియందు మహా భారము కలదనిన సందేహము లవలేశము లేదు. ఈక్రింది ఉదాహరణము చెప్పక చెప్పుచున్నది. చూడుడు—

న స శబ్దో న తచ్ఛాస్త్రం
న స న్యాయో న సా కలా,
జాయతే యన్న కావ్యాంగ
మహో! భారో మహాన్ కవే:!

మన సంస్కృతవాఙ్మయంలో మిక్కిలి మహాకవులు విచిత్ర రచనా చాతురీ దురీణ చమత్కృతచేతస్కులు పుట్టిరి. వారియందు మహాకవి త్రివిక్రమభట్టునుగురించి, గురుముఖతః వినినదానిని మిక్కిలి కౌతుకముతో ఆంధ్ర పత్రికాపాఠకులకు నివేదించుచున్నాను.

సంస్కృత భాషలో యీ కవి స్వప్రౌఢి ప్రకర్షచేత చేతశ్చమత్కారి కవితా నైపుణ్యం చేతను, అగ్రస్థానాన్ని అలంకరించిన ప్రౌఢతర మహాకవుల స్థానాన్ని పొందుచున్నాడనుట కిసుమంతయు సందియంబు లేదు.

ఈ కవి దేవాదిత్యపుత్రుడు. హైదరాబాదు ప్రాంతస్థ ఖేటాధీశ్వరునియొక్క సభలో ప్రధాన కవి; ప్రముఖపండితుడును. ఆ ఖేటాధీశ్వరుడు యింద్రరాజనృపతి. 915 క్రీస్తుశకమున ఉండెనని బరోడారాజ్యాంతర్గత 'నవసారి' గ్రామమున పొందబడు తామ్రశాసనములనుబట్టి తెలియుచున్నది.

ఇంద్రరాజుయొక్క స్వీయరాజ్యాభిషేక సమయమందు యే బ్రాహ్మణులకు విరివిగా యివ్వబడియుండెనో, వారియొక్క దానపట్టాలలో దేవాదిత్యకుమార్డు త్రివిక్రముడని వ్రాయబడి యుండెను. అదియుగాక త్రివిక్రముడున్ను స్వీయగ్రంథమందు స్వవంశచరిత్రను యిచ్చుచు వ్రాయుచున్నాడు:

"తేషాం వంశే ప్రథితయశసాం
శ్రీధర స్యాత్మజోఽభూ
ద్దేవాదిత్యః స్వమతివికస
ద్వేదవిద్యావివేకః,
ఉత్కల్లోలాం దిశి దిశి జనా
కీర్తిపీయూషసింధుం
య స్యాద్యాపి శ్రవణపుటకైః
కూణితాక్షాః పిబంతి.
తై స్తై రాత్మగుణై ర్యేన
త్రైలోక్యతిలకాయితం
తస్మా దస్మి సుతో జాతో
జాడ్యపాత్రం త్రివిక్రమః"

ఈ మహాకవి 'దమయంతీ' కథను నలచంపు అనుపేరుతో గద్యపద్యమయంబైన సభంగ శ్లేషభంగి తరంగితంబైన ప్రౌఢతమంబగు కావ్యమును నిర్మించెను. అందు 337 పరిమితంబైన పద్యములు గద్యములు గలవు.

మన దేశంలో విశిష్ట మహాకవులయొక్క, పండితులయొక్క విషయంలో విశేషమాహాత్మ్యసూచకంబైన కథలు తరచుగా లభించుచున్నవి. కాళిదాసు, భారవి, శ్రీహర్షుడు మొదలైన కవుల విషయంలో కూడా ప్రచురప్రకారంబులైన ప్రవాదంబులు వినంబడుచున్నవి.

ఆ విధంబుగానే త్రివిక్రమభట్టు విషయంలో ప్రసిద్ధమైన కింవదంతి ఒకటి గలదు.

ఈ త్రివిక్రమభట్టు శాస్త్రానభిజ్ఞుడు, అవినీతుడు, మహామూర్ఖుడు. ఒకనాడు దేవాదిత్యుడు కార్యవశమున దేశాంతర మేగిన, ఒకానొక మహావిద్వాంసుడు ఖేటాధీశ్వరాస్థానంలోనికి వచ్చి, "రాజా! నీ సభయందు యెవనిచేనైనను నాతో శాస్త్రవాదమును చేయింపుము. లేదా, జయపత్రమును యిమ్ము" అని అడిగెను. రాజును దేవాదిత్యపుత్రుడైన త్రివిక్రమభట్టును పండితుడనే నిశ్చయించి పిలిపించెను. మన త్రివిక్రమభట్టు, రాజాజ్ఞ విని విషణ్ణహృదయుండై మానరక్షణకొఱకు వాగ్దేవిని ప్రార్థించెను. సరస్వతియు అతనికి ప్రత్యక్షంబై యెంతవరకు నీతండ్రి రాడో, అంతవరకు నీ ముఖమందు అందునని వరమిచ్చెను. ఆ వరప్రభావముచేత ప్రతివాదిని జయించి స్వగృహంబునకు నివృత్తుడయ్యెను. పితురాగమనముకంటె పూర్వమే గద్యపద్యమయంబైన చంపూకావ్యమును రచించెను. సప్తమోచ్ఛ్వాసము సమాప్తముగుటతోడనే పితురాగమనకారణం చేత సరస్వతి వెడలిపోయెను. ఆ కారణంచే సముదర్భము సంపూర్ణమై యుండెను.

ఈ కింవదంతి పూర్ణంగా కల్పితమని పాఠకులకు తోచకమానదు. వస్తుతః, యీ మహాకవి బాల్యమునుండి యథావిధిగా సకలసాహిత్యశాస్త్ర తదంగశాస్త్రాధ్యయనము చేసినవాడును, సమస్తదక్షిణభూభాగముల తిరిగినవాడును. రాజోచిత చార విచారవ్యవహార కుశలుడున్ను. లెస్సగా అనుభవించిన సంసారసారము గలవాడును, బహుశ్రుతుడు, బహుదర్శి, పరమమార్మికుడు, విద్వద్ధురీణుడని దృఢముగా చెప్ప శక్యమగుచున్నది.

త్రివిక్రమభట్టు తరుచుగా బాణభట్టు ననుకరించుచున్నాడు. బాణభట్టుచే శుకనాసోపదేశము ఏ రీతిగా రచింపబడినదో ఆ విధముగానే యీ కవిచే సాలంకాయనోపదేశము చక్కగా వర్ణింపబడినది. దైవయోగముచే కాదంబరి అసంపూర్ణమై యుండినటులనే ఈ చంపుకూడా అసంపూర్ణముగానే యుండెను.

ప్రకృతి వర్ణనమందు సిద్ధహస్తుడైన మహాకవి త్రివిక్రమభట్టు వన-పర్వత-నదీ-వృక్ష-చంద్ర-సూర్య-ఆకాశ-నక్షత్రాదులయొక్క వర్ణనమందు కుండినపుర-విదర్భదేశాది వర్ణనమందును, అంతట ప్రఖరతరంబైన మర్మసంబంధమైన ప్రతిభ ప్రతిఫలిస్తుంది.

లౌకికమందును యీ మహాకవికి గల మహత్ ప్రావీణ్యము ప్రతిపదంబున ఉట్టిపడుచున్నది. పరస్పరసంభాషణ, లోకోక్తులు కవిచే సరసముగా యథాయోగ్యముగా ప్రయోగింపబడెను.

"ఇతో వ్యాఘ్రః; ఇత స్తటీ, హృదయతృణకుటీరే దీప్యమానే స్మరాగ్నా వుచిత మనుచితం వా వేత్తి కః పండితోఽపి."

మొదలైన లోకోక్తులు మిక్కిలి లభ్యమగుచున్నవి.

'కర్ణాటీ మివ ముఖరతాం న ప్రశంసంతి సుధియః.'

మొదలైన గూఢదేశాచారములు కవిచే వర్ణింపబడినవి. సంగీతశాస్త్రమందు, చిత్రకళయందు కవికి గల మహత్పాండిత్యము ప్రతిస్థానమందు ద్యోతితమగుచున్నది.

'హరచరణసరోజ' శబ్దము ప్రత్యుచ్ఛ్వాసాంతమందు ప్రయోగించడంచేత యీ చంపు హరచరణసరోజాంకితమని తోచకమానదు కవియు శైవుడను సంకల్పము దృఢమగుచున్నది.

ఏకవచన బహువచనముల, స్త్రీలింగ పుంలింగముల యేకాధికరణ్యం మొదలగు ప్రయోగకుశలతచే వ్యాకరణ శాస్త్రమందు గల పాటవము త్రివిక్రమునిచే ప్రకటింపబడింది.

అలంకారమందు కవి భ్రాంతిమదలంకార ప్రియుడు. సాహిత్యదర్పణాది లక్షణ గ్రంథములందు భ్రాంతిమదలంకారమునకు త్రివిక్రముని ఉదాహరణములే లభ్యమగుచున్నవి.

ఈ కవికులచూడామణి సంస్కృత సాహిత్యమున సభంగశ్లేషవిషయమున అద్వితీయుడు. కవి ప్రప్రథమమున స్వగ్రంథమందు వ్రాయుచున్నాడు.

వాచః కాఠిన్య మాయాంతి
భంగశ్లేషవిశేషతః
నోద్వేగ స్తత్ర కర్తవ్యో
యస్మా న్నైకో రసః కవేః.

భంగశ్లేషవశమున వినిః మీదటను సద్యో రసాస్వాదమునకు ప్రతిబంధక మగుచున్నది. అయినప్పటికిని యీ కవియొక్క శ్లేషప్రయోగము సరల - సరసమగుటచే సద్యః కాలముననే సహృదయుల మానసముల నానందింపజేయుచున్నది. సంస్కృత సాహిత్య ప్రపంచమున యిట్టి ప్రౌఢతరసరస శ్లేషకవి మరియొకడు కానరాడు.

సంస్కృతమున కొంతమంది మహాకవులకు ఒక్కొక్క అనుపమోపమయంబులైన ఉపనామంబులు, దీపశిఖా కాళిదాసు - ఆతపత్ర భారవి - ఘంటామాఘుడు - తాలరత్నాకరుడు - మొదలయినవి ప్రసిద్ధంబులు. ఈ రీతిగా యీ కవికిని 'యమునాత్రివిక్రమ' అని ప్రసిద్ధి పాఠకులకు విశదమే.

కవులచే భూమిపై యెక్కడో అక్కడ గంగాయమునాసంగమవర్ణనము చేయుట కన్పట్టుచున్నది. కాని ఆకాశమందు గంగాయమునా సంగమము కవిచే వర్ణింపబడుచు కల్పనాశక్తియొక్క మహత్పరిచయము యివ్వబడుచున్నది —చూడుడు:

ఉదయగిరిగతాయాం
ప్రాక్ప్రభాపాండుతాయాం
గతవతి చ నిశీథే
శృంగ మస్తాచలస్య,
జయతి కిమపి తేజః
సాంప్రతం వ్యోమమధ్యే
సలిల మివ విభిన్నం
జాహ్నవం యామునం చ

ఈ కావ్యమందు తద్ధిత ప్రయోగబాహుళ్యముచే "ప్రియతద్ధితా దాక్షిణాత్యాః" అను లోకోక్తి సర్వదా స్మరణకు రాకమానదు.

నైషధకారుడైన మహాకవి శ్రీ హర్షుడు నలచంపువందుగల త్రివిక్రమునియొక్క కావ్యరచనా వైచిత్రిని ఆలోకించియే రభసవశముచేత మహాద్భుత మహాకావ్యమును నిర్మించెను.

ఈ దమయంతీ కథనే ఆయా స్థానములందు వృద్ధిపొందించుచు, తగ్గించుచు స్వీయవాగ్వైదగ్ధ్యమును ప్రదర్శించుచు నలచంపును పూర్తి చేసెనని తోచకమానదు. ఎక్కడో అక్కడ రచనాపరిపాటి పాటవంచేత ఉత్కృష్టతరముగా చేసెను. హంసనలసమాగమమందు, వాని దౌత్యమందు, దమయంతీ హంససమాగమమందును త్రివిక్రమునియొక్క క్షతిపూరణమే చేసెనని తోచకమానదు. నలుని ద్యూతమును సవిశేషచమత్కారముగా రచించెనని తెలియదగినది.

ఈ త్రివిక్రమభట్టు నిజమహత్వ కవిత్వపటుత్వముచే భారతీయ కవి సమాజంలో అగ్రస్థానమును పొందుచున్నాడనుటకు వేరు వచింప బనిలేదు.

కోటీశ్వరుడు

(11 వ పేజీ తరువాయి)

అరమైలు దూరాన్ని ఇల్లు ఉంది. ఇంత దూరం పరుగెత్తాలి. ఎప్పుడూ పరుగెత్తే అలవాటు లేదు తనకి. గొంతుక ఎండిపోతూంది. ప్రక్కలలో నొప్పి బయలుదేరింది. రక్తం వడిగా ప్రవహిస్తూంది. గుండెలు కొట్టుకుంటున్నాయి. తలకాయ తిరుగుతూంది. కాని మాలిగన్ ఆగలేదు. ఆలస్యంచేస్తే ఎవరయినా ఎదురొచ్చి తన నిధి కొల్లగొట్టారేమో!

ఆ పరుగులో అతని టోపి జేరపడిపోయింది. వంగి తీసుకోవాలన్న ఆలోచన తనకు తట్టింది. కాని దాన్ని తనవారిని వదిలేసి పరుగెత్తుకున్నాడు "ఇలాటివి వెయ్యిటోపీలు కొనుక్కోవచ్చు!" అన్నమాటలు మాలిగన్ నోటినుండి వెలువడి గాలిలో కలిసిపోయాయి. ఇంటితలుపు దబదబ బాదగానే భార్య వచ్చి తలుపు తీసింది. చేతిలో కొవ్వొత్తిదీపం పట్టుకొని నిలుచుంది. ఆ వెలుగులో ఆ ముఖంమీద భయంతో కూడుకున్న విషాదచ్ఛాయల్ని మాలిగన్ గమనించలేదు. పిల్లలుకూడ లేచారు. తండ్రి వాలకాన్ని చూసి భయపడి పక్కలకే అంటుకపోయారు.

మాలిగన్ కుర్చీలో కూలబడ్డాడు—నీరసపడి, చెమటలు కారుస్తూ, మెరుస్తున్న కళ్ళను తిప్పుకుంటూ.

"ఓయ్ పిల్లలారా, ఇదుగో చూడండి. పర్సు. ఇందులో డబ్బు—వందలూ, వేలు ఉంది. పెద్దఇల్లు, దాసీలు, తాగేందుకు 'షాంపేన్' నాలుగు మిలియన్ల రూపాయలున్నాయి. తెలిసిందా! ఆహా!"

ఈనాడు మాలిగన్ పెద్ద కోటీశ్వరుడు. అతని సంపత్తుతో సరిపోల్చితే ప్రపంచంలో గల నిధులన్నీ దిగదుడుపే! అతనివద్ద అరవై వేల గుర్రాలున్నాయి. మూడు మిలియన్ల ఐదువందలవేలు గుర్రులున్నాయి. ప్రపంచంలోగల అన్ని రైల్వేలకు ఆయన డైరక్టరు. కొత్తగా భూమి నుండి బృహస్పతి వరకు వేసిన రైలుదారికి కూడా ఆయన డైరెక్టరే. అతడు బహు ఉదార స్వభావుడు. అడిగిన ప్రతి దరిద్రునకి ఒక మిలియను కుతక్కువ కాకుండా దానం చేస్తాడు. అతడు చాల గౌరవనీయుడు. మర్యాదస్థుడు. కాని ఒక్క విషయం మాత్రం ఆయన సహించలేడు. అతని పర్సు ఎవరేనా తాకేరా అంటే ఆయనకు పట్టరాని కోపం వస్తుంది. అందులో ఒక మూడు రూపాయల నోటు, ఒక లగ్గేజీ రసీదు, పేపర్లోని అడ్వైర్టైజ్‌మెంటు ముక్క ఉన్నాయి. కోపం వచ్చినప్పుడు ఆయన తన చుట్టూ గుమిగూడి ఉన్న ప్రజలమీద తనచేతికి ఏది దొరికితే అది తీసుకొని విసిరి కొడతాడు.

అతని భార్య పిల్లలుకి అతనిమీద ఎంతో భక్తి. అతను కోరినదల్లా వారు కాదనకుండా ఇస్తారు. అతను కూడా వాటిని ఆదరంగానే చూస్తాడు.

ఇంతకీ మనమేమిటి చెప్పగలం? ఒక్కొక్కప్పుడు మనకన్న పిచ్చివాళ్లే ఎక్కువ సౌఖ్యవంతులేమో అనిపిస్తూంటుంది.

లేఖలు



బళ్లారి విషయంలో ఆంధ్రుల కర్తవ్యము

అయ్యా,

బళ్లారి జిల్లా ఆంధ్రప్రాంతమునకు చేరినదే నని 1921 లో ధ్రువపడినది. పంజాబు, బెంగాలు ప్రాంతాలూ దుర్గతిపట్టితే అల్పభాగం పోవచ్చు. బళ్లారి జిల్లా యెక్కువ భాగం మాట్లాడుభాష తెలుగే. ఇంగ్లీషు ప్రభుత్వము వారి పరిపాలన లెక్కలవల్ల రుజువు అగుచున్నది. యిదివరలో జిల్లాలో ప్రాముఖ్య భాష స్కూళ్లయందు తెలుగే. ప్రతి తాలూకా యందు తెలుగుస్కూలు వుంచివుండిరి. అప్పటికి 1921 సంవత్సరంలో భాషాద్వేషములు వుండలేదు. కోర్టుభాష, రిజిష్టరేషను, సివిల్, రివిన్యూపరిపాలన వగయిరా పనులలో తెలుగే ప్రాముఖ్యమైనది. అది అప్పటివారికి అనుకూలమైన భాషగా నుండగలదు. యెందుకనగా— కన్నడం వున్నప్పటికీ తెలుగు తెలియని వారు అప్పటికీ ఇప్పటికీ లేరన్నమాట. భాషావారి కులాలవారీ 1921 సం॥ జనసంఖ్య యీ ప్రకారం తెలుపుచున్నది.

1.	తెలుగు మాట్లాడువారు	4 07,467
2.	కన్నడం ,,	2 89,271
3.	ముస్లిములు ,,	85,426
4.	మహారట ,,	30,363
5.	అరవము ,,	3,389
6.	క్రిష్టియన్లు ,,	3,203
7.	ఇతరభాషలవారు	43,251
	మొత్తం :	8 62,370

1911 జనసంఖ్య 9,69,436. భాషా వివరము వ్రాయలేదు. 1931 జనసంఖ్య 9,69,774. భాషా వివరము వ్రాయలేదు.

ఈ ప్రకారం తగ్గిన 1921 సంవత్సరంలోనే ఆంధ్రులు యిందులో సగమువాళ్లు వున్నారు. మిగతావారు గూడ ఆంధ్రమునే బలపరచగలరు. యెందుకనగా—వారికి వ్రాయను చదువను యిదివరలో, యిప్పటికిగూడ తెలుగే ప్రాముఖ్యంగా చదువుకొనుచున్నారు. ముస్లిములు యెక్కువ ఆంధ్రప్రాంతములందే వారి బంధువులు, వారి స్నేహితులు, వున్నారనవచ్చును. ఉదా :— అలూరు తాలూకా యశ్వంత్రిగ్రామం గ్రామం వురుసుకు ప్రతి సంవత్సరం ముస్లిములు మాత్రం 70-80, వేలకు పైగా ఆంధ్రప్రాంతాల నుంచి రాగలరు. కర్నాటక ప్రాంతాల నుంచి వూరా తక్కువకూడా రారు అనుసంగతి ప్రతి ముస్లిమునకు తెలుసు. గనుక యీ జిల్లా ప్రాంతమును ఆంధ్ర ప్రాంతమునకు చేర్చవలెనను కోరిక ప్రతి ముస్లిముకు వుండగలదని నమ్ముచున్నాము. మరాట, వగైరాలు ప్రతివారు తెలుగు చదువు కాని ప్రతి వర్తకుల అంగళ్లలో యిప్పటికి లెక్కలు వ్రాయువారు వారే. గనుక కన్నడ ప్రాంతములో పోయి కన్నడం వ్రాయను నేర్చుకొనడం వారు యిష్టపడరు. కర్నాటక నాయకులలో గూడ చాలమంది కన్నడం యిప్పుడు వ్రాయడం నేర్చుకొనుచున్నారు. యింకా మిగిలిన వారుగూడ తప్పక తెలుగుకు తోడ్పడగలరని చదువరులే వూహించెదరుగాక. 1921 సం॥ రం శ్రీ కేలుకారుగారు తీర్పు యిచ్చినది. ఆ తీర్పు యివ్వడానికంటె యీ లెక్క ముందు సం॥ రం వున్నది గనుక యీ లెక్క భాషా ద్వేషముతో నిండివుండదనవచ్చును. యీ లెక్కలు కర్నాటక సోదరులు చూచి వారియొక్క దండయాత్ర తరవేగంతో ప్రారంభించి వుండవచ్చును. విద్య, కోర్టు, రిజిష్ట్రేషన్, రివిన్యూ వగైరాలలో కన్నడ పారములు విపరీత కృషితో దింపినారనవచ్చును. అదిగాక డిస్ట్రిక్టుబోర్డు స్కూళ్లు 15, 16 సం॥ రం కర్నాటక నాయకుల చేతులలోనే మెలిగినది. అందువలన కన్నడం వున్నట్లున్నది అని తోచుచున్నది. అట్లు తోచడంవల్ల కొందరు ఆంధ్రులు నిరుత్సాహ పడివుండుదురు. భయపడవలసిన పని లేదు. ధర్మం జయించును. ఉదా - మొన్న 25-8-48 తేదీన ఆంధ్ర వారపత్రిక యందు ఆదవాని తాలూకా యమ్మిగనూరు శ్రీ. జి. హెచ్. గంగన్న గారు ప్రచురించడం చూస్తే తల్లిభాష కన్నడం అయినప్పటికిన్ని తెలుగు తల్లికి ద్రోహము చేయనందుకు నా ధన్యవాదములు. యితరులుగూడ యిదే మాదిరిగా తమ విద్య నేర్చుకొన్నది. తదితర ప్రాంతాల జనుల అధికభాషకు ద్రోహము చేయవద్దండని కోరుచున్నాను. ప్రస్తుతము హొసపేటలో కొంత కన్నడులు యెక్కువయి వుండవచ్చును. అది చరిత్రాత్మకంగాను, భౌగోళికముగాను, ఆర్థికంగాను తదితర విషయములబట్టి ఆంధ్రప్రాంతములో తప్పక చేరవలెను. ఆంధ్రులు 20 కోట్లు పైగా డబ్బు ఖర్చుచేసిన అనకట్ట ప్రాంతం విడువడం న్యాయమని యెవ్వరూ చెప్పను సాహసించరు. హై లెవల్ చానల్‌ను గూడయేర్పరచి యీ ప్రాజెక్టు కట్టుచున్నారు. దీనివలన ఆంధ్రులకు 12 అణాల భాగం వుపయోగం గనుక ప్రతి ఆంధ్రుడు ఆంధ్రుడుగాక ప్రయత్నించడం ముఖ్య కర్తవ్యముగా నున్నది.

కొత్తింటి చిన్న తిమ్మారెడ్డి.

హిందూమత ధర్మాదాయముల బోర్డు : దేవస్థానములు

అయ్యా,

ఇప్పుడు ఆంధ్రదేశంలోని గ్రామాదులలో వుండే దేవాలయముల తాలూకు భూములన్నియు అర్చకుల భుక్తములలోనే వుండి దేవుడికి ధూప దీప నైవేద్యములు జరిపించుచున్నారు. యీ ధర్మాదాయముల బోర్డు ఏర్పడిన తర్వాత ఆ భూములను యిచ్చిన దాతల ప్రత్యేక కోరికలతో ఏవైన వుంటే తప్ప లేనివాటికి బోర్డు ద్వారా నియమించబడిన వుద్యోగులు సివిలు, క్రిమినలు చర్యలు జరిపి భూములను, దేవస్థానములను స్వాధీన పరచుకొంటున్నారు. యీ లావాదేవీలకు బోర్డుతరపున ఎంతనో వెచ్చించవలసి వస్తోంది. అయిననూ కొన్నిచోట్ల బోర్డులకు తీర్పులు వ్యతిరేకంగా వుండడం, మరికొన్ని చోట్ల వంతుల ప్రకారం రాజీలు కావడం, కొన్ని చోట్ల పూర్తిగా బోర్డుకే అనుకూలత అవడం జరుగుతోంది. దీనివల్ల వంశపారంపర్యా అర్చనే వృత్తిగ వుంటూ. కుటుంబము యావత్తూ దాని మీదే ఆధారపడ్డ అర్చకులు యీ లావాదేవీలలో కొన్నిచోట్ల నిలువనీడలు లేకుండాపోతున్నారు.

ఈ భూములన్నియు అర్చకుల అధీనంలో వుండుటవల్ల వారు దేవాలయముల మరామత్తు వగైరాలు చూడక అర్చనక్రిందే వారి మాన్యములు వచ్చాయని వెర్రి నమ్మకం పట్టుదలతో వ్యవహరిస్తున్నారు అర్చకులు; హైకోర్టుల వరకుజనం ఒడ్డి పోరుతున్నారు

ప్రభుత్వముచే ప్రత్యేకబోర్డు ఏర్పరుపబడి ఒక మతములో, ఒకజాతిలో, ఒకకులమును సివిలు క్రిమినలు చర్యలలో యిరికించి చిరకాలం వరకు లావాదేవీలతో గ్రామాలను నింపుట సరియైన పద్ధతి కాదు

జమీందారీ రద్దుబిల్లువలెనో, లేక యీనాం రద్దుబిల్లువలెనో ప్రత్యేక శాసనం తీసుకొనివచ్చినచో అందరికి వ్యయప్రయాసలతో నిమిత్తం లేకుండా సుళువుగావుండి ధర్మకర్తృత్వ నిర్వాహణ సక్రమంగా జరగును. ప్రభుత్వమువారు ఏ మతములోనివైనా ధర్మాదాయములను సక్రమ నిర్వహణకు బోర్డుకు మార్చవలెను. ప్రత్యేక ఒక మతమునకే చెందినది ప్రభుత్వం తరపున వ్యవహరించుట హర్షింపదగినది కాదు.

గ్రామాలలో పూర్వం అనేకవిధములయిన సర్వీసుమాన్యములు వుంటూవుండేవి. కళావంతుల మాన్యము అంటే, వీరు దేవతావుత్సవములలో మేళములకు వచ్చే నిర్ణయం రజకుల మాన్యములు వీరు దేవతావుత్సవములలో కాగడాలు వగైరా సర్వీసు నిమిత్తం, బాకా, భజంత్రీ సర్వీసు యీనాములు పుట్టినవి.

దరిమిలా కళావంతుల మాన్యములు సర్వీసు అక్కరలేకుండా జిరాయితీపట్టాలుగా మార్చబడినాయిగాని,యింకా అమాయక రజక, బాకా భజంత్రీ మాన్యములకు జిరాయితీ పట్టాలు యివ్వలేదు. ఒక టోవిధానం మరొక టోవిధానం కాకుండా జనరలుగా అన్ని సర్వీసు యీనాములూ ఒకేపద్ధతిప్రకారం చేయవలెను.

ఇక బోర్డుపరిపాలన చూస్తే యిటు స్థానిక స్వపరిపాలనకు చెందినదీ కాదు, ప్రభుత్వంలో ఒక ప్రత్యేకశాఖఅయినా కాదు. అందువల్ల గ్రామాలలో తీరని అసంతృప్తి కలుగుతూంది. బోర్డు కమీషనర్లు ఎన్నికలు కావు. వీరు గ్రామాలలోవుండే దేవాలయములకు మానేజర్లను నియమించి వరశపారం పర్యాహక్కు లేని ట్రస్టీలనుకూడా వారే నియమించి దేవస్థానముల పరిపాలన సాగించుచున్నారు.బోర్డుఖర్చులు యీ దేవాలయములయొక్క ఆస్తులనుండి కంట్రిబ్యూషన్లద్వారా పోషింపబడుచున్నవి.

ఈ సంస్థ యిట్లానే వుంటే ఆకును, అందక పోకను పొందక ఒకవిధమైన నిరంకుశత్వం నడుచుచున్నది.

ట్రష్టీలుగా అప్పాయింటు అయినవార్కి యిటు ప్రజాప్రతినిధులు కాదు అటు బోర్డువారి ప్రతినిధులూ కాక బోర్డువారు నియమించే మానేజర్ల చేతిలో పరిపాలన సాగుచున్నది.

ఈ ధర్మాదాయముల బోర్డును వెంటనే ప్రజాస్వామికంగా మార్పు చేయుటగాని, ప్రభుత్వ ప్రత్యేకశాఖగానైనా ఏర్పాటుచేయవలసిన ధర్మం ప్రభుత్వంపై వున్నది.

తంగిరాల కృష్ణానందతిలక్.

ఆయుర్వేద కళా మహోన్నతదశ

ఆయుర్వేదమున్నూ, అందుల ననుసరించియుండు వైద్యభాగమున్నూ, తదనుగుణమయిన మూలికాప్రభావములున్నూ పూర్వము ఋష్యాదులకాలమునుంచి పరంపరగా రాబడుతూ యున్నది. తదుపరి మన పూర్వుల కాలమునుంచి కూడా పెద్దల స్వానుభవములున్నూ మూలకాదుల ప్రభావములున్నూ గ్రంథాది పరిశోధనమూలముగా వైద్య, చికిత్స భాగములున్నూ, ఓషధిప్రస్తానములున్నూ, నాడీవిధానాదుల అవుసరమున్నూ వెలిబుచ్చుచూ కొన్ని గ్రంథములను. మనకాలమునకు అనుగుణ్యముగా పూర్వపు సంస్కృత గ్రంధ పరిశోధనల రీత్యా లిఖించి ప్రపంచమునకు వెలిబుచ్చియున్నారు. అట్టి గ్రంధాదిశోధనాద్యను భవాదులచే సక్రమముగా కొంతవరకు మాత్రం వైద్య చికిత్సలు జరుగుచూ కట్టకడకు ప్రస్తుత కాలపు నాగరికతలనుబట్టి అట్టి మహోన్నతమయిన ఆయుర్వేదశాస్త్రమునకు కళంకం కలుగచేసి దాని నడగద్రొక్కినందువల్ల ఆయుర్వేదం కళాహీన మయియున్నది. తదుపరి గవర్నమెంటువారు మన హిందూదేశమునకు ఆయుర్వేదాభిమానము కలదని తలచి దాని నివృద్ధిపరుచు తలంపుతో స్కూళ్లు కాలేజి తరిఫీయదులు అందుకు సంబంధించి రిజిష్ట్రేషను అధికారములు కల్పింపచేసి, శ్రీవారియొక్క అనుజ్ఞల మీద యిప్పటివరకు నడుపుతూ యున్నారు. కాని వాటివల్ల శ్రీవార్కి రాతగిన ఆదాయముల మీద శ్రీవారు ఆధారభూతమయి యున్నారే కాని ఆయుర్వేదశాస్త్రము ఏదశలో యున్నది. ఏవిధముగా పరిణమించి హీనదశ ప్రాప్తమయినదీ. అనే సంగతిమాత్రం విచారించుటలేదు. లేదా, ఆయుర్వేదశాస్త్రమునకు సంబంధించి పెద్ద పెద్ద కమిటీలు యేర్పాట్లుచేసి మహావృద్ధిలోకి తీసుకురావలయునని ప్రయత్నములో జరుపుచూయున్న కమిటీ మహాసభవారు కూడా ఏదో కొంతవరకూ సత్ఫలితములను పొందవలయుననే అభిప్రాయమేగాని వారివల్లగూడా ఆయుర్వేదము వృద్ధిలో లేక క్షీణించుచున్నదని చెప్పటలో అతిశయోక్తిలేదు. యేమనశ్రీవారు గాని, మహాసభ కమిటీవారు గాని తగు మయిన శ్రద్ధవహించకపోవుటయే నని చెప్పవచ్చును. ఆయుర్వేదమునకు న్నూ దానికి సంబంధమయిన వైద్యభాగమునకు కావలసిన మూలికలున్నూ మన మధ్య రాష్ట్రము లేనివి యితరరాజ్యములయందు లేవనికూడా చెప్పవొచ్చును. అయితే పెద్ద పెద్దవారు వీటిని గురించి తగుమయిన శోధనలు చేయకపోవుటయే. యిదిగాక, బహుశా పెద్దవారికి తెలియనిచో వాటి అనుభవజ్ఞులయిన వ్యక్తులను నియమించి వారి ద్వారా నయినా శోధన చెయ్యవొచ్చును గదా. యిట్టి దానిని గురించి ఉభయత్రి తగు శ్రద్ధవహించకబోవుటచే నానాటికి క్షీణదశలో యున్నది. యిట్టిదానిని శోధనమార్గములు లేక వృద్ధిపరచవలయునన్న వృద్ధికాజాలదని చెప్పటలో సందేహము లేదు. యిట్టి స్థితిలోవున్న స్కూళ్లు చాలక యింకా స్కూళ్లు నియమించి విద్యార్థులను తరిఫీయదు చేయవలయునని ప్రయత్నించుచున్నారు. కమిటీవారందరు యిదివరలో తరిఫీయదు కాబడినవారికి సరిఅయిన రిసర్చి ట్రయినింగులో తరిఫీయదుచేసి ఉత్తీర్ణులను చేసిన కొంతవరకు విద్యాభివృద్ధిన్ని, శాస్త్రాభివృద్ధిన్ని కాగలదు. అటుల చేయనిచో యింకా ఆయుర్వేదకళ క్షీణించగలదని చెప్పటలో సందేహము లేదు. యిదిగాక, ప్రతి వ్యక్తిన్నీ సుమారు 10 సం॥నుంచి ప్రాక్టీసు చేస్తూయున్నట్లుగా తహశీల్దార్లవారివద్ద సర్టిఫికెట్టు పొందినచో అట్టివారు మాత్రమే వైద్యవృత్తి నవలంబించవచ్చునని రిజిస్ట్రేషను కలిపించియున్నారు. కాని శ్రీవారు వాటివల్ల రాబడు ఆదాయమును మాత్రము ఆధారభూతముగా గ్రహించినారే కాని, పైవిధముగా పొందిన సర్టిఫికెట్లునుగురించి వ్యక్తిగతముగా వైద్యానుభవములు విచారించకయే అనుమతి నిచ్చుచున్నారు. యిటుల అనేకమంది పైవిధముగా శ్రీవారి అనుమతిపొంది స్వానుభవ విద్యానుభవములు లేకయే వైద్యవృత్తి చేయుచున్నారు. యిటుల చేయుటవల్ల శ్రీవారికి లాభదాయకమున్నూ, ప్రపంచకమునకు నష్టదాయకమున్నూ కలుగుచున్నది. వైద్యానుభవమున్నూ, వ్యక్తియొక్క విద్యయున్నూ తెలియక తహశీల్దారువారు వైద్యవృత్తికి అనుమతి యిచ్చుటకూడా శోచనీయమే గదా. అట్టి పరిస్థితులలో వైద్యానుభవములేని తహశీల్దార్లవారివద్ద మేము వైద్యులమేనని చెప్పుచూ విద్య రాకపోయినప్పటికి అనుమతి మాత్రంపొంది శ్రీవారి పర్మిషను కూడా పొందుచూ వైద్యవృత్తి నవలంబించవచ్చునన్న మాటేగదా. యిటుల జరిగినచో యిట్టి వైద్యములవల్ల ఆయుర్వేదము క్షీణించి దుర్దశపాలగుటయేగాక ప్రజానష్టముకూడా సంభవించును. గనుక శ్రీవారు దయచేసి అనుమతి నిమిత్తం తహశీల్దార్లవారిని తొలగించి అందుకు తగుమయినటువంటి రిసర్చి ట్రయినింగు స్వానుభవముల పొందినటువంటి వైద్యవ్యక్తులను నియమించి విద్యాశోధనలను చేయించి, శ్రీవారు వైద్యవృత్తులకు అనుమతి యిచ్చులాగు తగుమయిన శ్రద్ధ వహించి ఆయుర్వేదమును పైవిధముగా అభివృద్ధిలోకి తేగలరని కోరుచున్నాము. దీనికి సాధ్యమయినంత త్వరలో శ్రద్ధ వహించగలందులకు ప్రార్థించుచున్నాము. లేనిచో అవ్యక్తపు అనుమతులవల్ల, ఆయుర్వేదకళాహీనం, ప్రజానష్టం కలుగగల దని చెప్పగలుగుచున్నాము.

డా. ప్రద్యుమ్నానందభారతీస్వామిజి,
హిప్నాటిస్టు, స్పిరిచులిస్టు.

పశువుల దివాణం

(6 వ పేజీ తరువాయి)

నుండండి. నేను వెనకాతలే వచ్చి కలుసుకుంటాను. ఊఁ! నడవండి మరి!" అని కన్నయ్య జంతువులను పొలాలికి తోలింది.

జంతువులన్నీ సాయంత్రం తిరిగి వచ్చేప్పటికి పాలు మాయమవడం గ్రహించాయి.

3

జంతువు లెంత కష్టపడి కుప్పలు నూర్చాయని! పడిన కష్టానికి ఫలితంగా, అనుకున్న దానికంటె, ఎంతో ఎక్కువ ఫలం చేకూరింది!

పొలంపని చేయడం కష్టంగానే వుండేది. మనుష్యుల కొరకై తయారైన పరికరాలు, జంతువుల ఉపయోగానికి పనికొచ్చేవి కావు. పోనీ, ఆ పరికరాలనే, ఎలాగో అలాగ వాడుదామంటే, వెనక కాళ్ళమీద నిలబడి, ముందరికాళ్ళతో జంతువులు వాటిని పట్టుకు ఉపయోగించవలసి వచ్చేది. కాని జంతువులకి వెనక కాళ్ళమీద నిలబడ్డం మహాయాతనగా వుండేది. అటువంటి కష్టాల నెన్నిటినో తెలివిగా, పందులు ఈదుకుంటూ వచ్చి, పనికి అంతరాయం కలగకుండా మాత్రం చూస్తూండేవి. ఎద్దులకి పొలాల భోగట్టా అంతా పూర్తిగా తెలుసును. నిజానికి కుప్పలు నూర్చడంలో పందు లేమంత సహాయం చెయలేక పోయేవి. తతిమ్మా జంతువులకన్నా తెలివైన వవడంచేత, పందులు వాటికి పనులు పురమాయిస్తూ సక్రమంగా అవి పనులు చేస్తున్నదీ, లేందీ పైనుండి చూసేవి. పందులే నాయకత్వం వహించాయి. చివరకు బాతులూ, కోడిపెట్టలు కూడా, ప్రొద్దున్నుంచి సాయంత్రం వరకూ ఒక్కొక్క గడ్డిపరకే ముక్కుల్ని కరుచుకు, ఒకచోట గడ్డి పోగుచేయడంలో సహాయ పడేవి. జంతువులన్నీ, రత్తయ్యా వాళ్ళకంటే రెండు దినాలు తక్కువకాలంలోనే, కుప్పలు నూర్పడం పూర్తిచేశాయి.

గడియారం మోస్తరుగా, జంతువులన్నీ వళ్లు దాచుకోకుండా, వేసవికాలమంతా కష్టపడి పనిచేశాయి. వాటంతటవే కష్టపడి పండించుకున్న ఆహారం అవడంచేతా, వేరే ఎవరో ఒక యజమాని తూచితూచి ఆహారం పెట్టవలసిన అగత్యం లేక పోవడంచేతా, ఎంతో ఆనందంతో, సంతృప్తితో ఆహారం తినేవి. ఇతరుల కాయకష్టంమీద ఆధారపడి ఇతరులను పీడించి పిప్పి చేసే మానవుల బారినుండి తప్పించుకోడంచేత, ప్రతిజంతువుకీ కడుపునిండా కావలసినంత ఆహారం సమకూరింది; ఎక్కువ విశ్రాంతి కూడా ఉండేది. కాని సంవత్సరాంతానికి జంతువులు కొన్నికష్టాలను ఎదుర్కోవలసివచ్చింది. కుప్పలు నూర్చేందుకు పాతపద్ధతే అవలంబించ వలసి వచ్చింది. కుప్పలను బాగా తొక్కకుండల్లోంచి గింజల్ని నేలమీద రాల్చాయి. తుక్కునుండి గింజల్ని విడదీయడం ఎట్లా?—చేటలు పట్టి, మానవులలా చెరగలేవే! యంత్రాలుంటే బాగుండు ననుకున్నాయి. చెరగడానికి బదులు, ఒక ఉపాయం ఆలోచించి జంతువులన్నీ కుప్ప దగ్గరగా పోయి, గట్టిగా ఊది, తుక్కు నెగరగొట్టి, ధాన్యాన్ని వేరుపరిచాయి. పొలంపనిలోనట్టుకు ఎద్దులు ఎప్పుడూ ముందుకే వచ్చి అంతపనీ వాటి నెత్తిమీదే పెట్టుకునేవి. అంత కష్టపడి పనిచేసినా ఇంకా పొలంలో పనులు అలానే వుండేవి. అందుకని, బాగా చీకటి వుండగానే లేచిపోయి, పొలానికి పోయేందుకు కోళ్ళని, కొంచెం త్వరగానే కూసి లేపమనేవి. ఏపని చెప్పినా, కష్టమనినసగక 'ఇంకా ఎక్కువగా కష్టపడతాము' అని ఎద్దులు చిరునవ్వుతో నేస్తాలకి సమాధాన మిచ్చేవి.

ప్రతిజంతువూ దాని శక్తికొద్దీ అది 'చంద్రునికో నూలుపోగన్నట్టు పొలంపాటులో సాయపడేవి. చివరకు కోడిపెట్టలూ, బాతులూకూడా అక్కడక్కడ చెదిరి రాలిపడిన గింజలను యేరి, ఒక ఐదుకుంచాలవరకూ పోగుచేశాయి. కడుపుకక్కుర్తితో ఏజంతువూ ఒక్కగింజైనా దొంగిలించేది కాదు. 'నేను పడిన కష్టానికింతేనా తిండి' అని ఏ జంతువూ ననిగేది కాదు. ఈర్ష్యా, కొట్లాటలూ, మొదలైన పూర్వపు ప్రవర్తన పూర్తిగా నశించిపోయింది. ఏ జంతువూ దొంగొత్తు వేసి, పనిచేయకుండా ఒళ్ళు దాచుకునేది కాదు.

పంకజాక్షికి పెందలాడే లేవడం అలవాటు లేదు. జమీందారుగారి పెంపకంలో దానికిబద్ధకం బాగా బలిసిపోయింది. పని చేసేప్పుడుకూడా, అందరికంటే ముందుగానే డెక్కలో రాయి ఇరుక్కుందనే సాకుతో పంకజాక్షి పనిచేయకుండా లేచిపోయేది. ఇంక పిల్లి ప్రవర్తన అదో రకంగా ఉండేది. ఏదేనా చేయవలసిన పని ఉందని తెలియగానే, కనిపించకుండా పారిపోతూవచ్చేది. ఒక్కొక్కప్పుడు గంటలకొద్ది కనిపించక, సరిగ్గా తిండి తినేవేళకి అందరితో పాటు హాజరయ్యేది; లేకపోతే, పని అంతా పూర్తిఅయాక సాయంత్రంపూట, ఏమీ ఎరగనట్లు అది తిరిగి దివాణం చేరుకునేది. పని చేసే వేళ తాను అక్కడ లేకపోయినందుకు నమ్మకం చేలా సాకులు చెప్పి, ఎంతో జాలిగా 'మ్యావ్' మనేది. రత్తయ్య వుండేటప్పుడు, ఎట్లో విసుగులేకుండా రోజంతా పని చేసేదె, అట్లాగే ముసలిగాడిద తన పని తాను చేసుకు పోయేది. విప్లవాన్నిగురించికాని, దాని ఫలితం గురించి కాని అదెప్పుడూ ఎటువంటి అభిప్రాయమూ వెలిబుచ్చేది కాదు. రత్తయ్యని తరిమివేసిన తర్వాత, తాను సుఖంగా ఉన్నదీ, లేనిదీ అడిగితే "గాడిదలు చాలాకాలం బ్రతుకుతాయి. మీలో ఏవరైనా సరే, చచ్చిన గాడిదను చూశారా?" అని అడిగేది.

జంతువులన్నిటికీ ఆదివారం సెలవిదుక. ఆ రోజు వుదయం రోజూకంటె ఒక గంట ఆలస్యంగా అవి తిండితినేవి. తర్వాత అన్ని జంతువులూ సమావేశమై పశువుల దివాణం చిహ్నమైన పతాకాన్ని ఉత్సవంతో ఎగరవేసేవి. రత్తయ్య భార్యతాలూకు పాత ఆకుపచ్చచీరముక్క ఒకటి తీసి, దానిమీద కన్నయ్య, ఒక కొమ్ముచిత్రం, ఒక డెక్క చిత్రం గీసింది. అదే పశుస్వామికపతాక. ఆ బావుటా అర్థంగురించి కన్నయ్య జంతువులకి బోధించేది.

"నేస్తాలూ! పచ్చరంగు పైరులను సూచిస్తుంది. డెక్కా, కొమ్మూ—మానవజాతి పూర్తిగా అంతమొందినతర్వాత భావికాలంలో ప్రవర్ధమానంగా స్థాపితమయే పశుస్వామిక చిహ్నాలు."

పతాకోత్సవం జరిగిన తర్వాత ఖాళీగా ఉన్న ధాన్యంపాతర వద్ద, జంతువులన్నీ సమావేశమయ్యాయి. ఆ సమావేశమే సాధారణ సమావేశము. వచ్చే వారంలో, ఏ ఏ జంతువు ఏ ఏ పనులు చేయవలసినదీ ఒక ప్రణాళిక తయారుచేసి, దానిమీద తీర్మానాలు జరిపి, జంతుసభికుల ఎదుట అంగీకారానికి పెట్టవలసిందే. పందులే ఎప్పుడూ తీర్మానాలను జంతుసభికులముందర పెట్టేవి. తీర్మానాలపై వోటువేయడం తప్ప తీర్మానా లెట్లా తయారుచేయాలో జంతువులకు తెలియదు. ఇంక సమావేశాలలో జరిగే చర్చల్లో కన్నయ్యా, గునపం ఎంతో ఉత్సాహంగా, తెలివిగా పాల్గొనేవి. ఆ సభల్లో జరిగే చర్చల సారాంశమేమంటే—కన్నయ్యా, గునపం ఎప్పుడూ ఏవిషయంపైనా ఏకాభిప్రాయులై ఉండేవి కావు. కన్నయ్య చెప్పిందానికి గునపం అడ్డు చెప్పేది. గునపం చెప్పిందానికి కన్నయ్య అడ్డుపడేది. ఒకసారి, వృద్ధాప్యం వచ్చి పింఛను పుచ్చుకున్న జంతువులు నివసించే నిమిత్తం జామతోట వెనకాతల నున్న స్థలం కేటాయిస్తే బాగుంటుం దన్న విషయంపై చర్చ జరిగింది. ఆ స్థలనిర్ణయానికి ఎవ్వరూ అడ్డుచెప్పకూడదని అన్నీ నిశ్చయించాయి కాని, ఎంత వయస్సు రాగానే పింఛను పుచ్చుకోవాలీ అనే విషయంపై పెద్ద వాదం జరిగింది.

ధాన్యపుకొట్టు కార్యాలయంగా చేసుకుని పందులు అందులోనే నివసించాయి. జమీందారుగారి, పుస్తకభాండాగారంనుంచి, పుస్తకాలు తెచ్చుకుని, సాయంత్రంపూట కమ్మరిపని, వడ్రంగం—ఇంకా తదితరమైన పనులనుగురించి దీర్ఘంగా పందులు చదివాయి. పసుసంఘాలు ఏర్పరచడంలో కన్నయ్య, విసుగూ విరామం లేకుండా తిరిగేది. కోడిపెట్టలకొరకు 'అండోత్పత్తిసంఘం', ఆవులకి 'పరిశుద్ధపాలసంఘము', 'అడవిజంతు విద్యాప్రబోధసంఘము' (ఎలుకలను, కుందేళ్ళనూ మచ్చికచేసుకునే నిమిత్తం), గొర్రెలకు "అతి తెలుపు ఉన్ని ఉద్యమం"—ఇలాగ ఎన్నో సంఘాలను కన్నయ్య ఏర్పరచడమే కాకుండా, చదువనూ వ్రాయనూ నేర్పేందుకు పాఠశాలలను కూడా స్థాపించింది. కాని పడిన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరైంది. ఎలుకలనూ, కుందేళ్లనూ మచ్చిక చేద్దామనే ప్రయత్నం విఫలమైంది. ఎంత ప్రేమతో, వాత్సల్యంతో వాటిని చేరదీస్తే, అంతదూరంగా పారిపోయాయి. విద్యాప్రబోధసంఘంలో పిల్లి చేరి, కొన్ని దినాలవరకూ చాలా హుషారుగా పనిచేసింది. ఒకరోజున గొడ్లశాల కప్పుమీద కూర్చుని, దూరంగా వ్రాలిన పిచికలతో మాట్లాడడం ప్రారంభించింది.

"నేస్తాలూ, సమస్త జంతువులూ సమానం; పూర్వం మనందర్నీ విడదీసి, నిరంకుశంగా పరిపాలించిన మానవనియంత అంతరించాడు. మన హృదయాలు ఇప్పుడు చాలా చేరువగా రావాలి. కావలిస్తే, మీ రొచ్చి నా వీపుమీద వ్రాయవచ్చు. నా పాదంమీద కూర్చోవచ్చును. మునుపటి పిల్లిని కాను నే నిప్పుడు!"

కాని ఒక్క పిచికకూడా పిల్లివైపు రాలేదు. చదవడం, వ్రాయడం నేర్పేందుకు పెట్టిన పాఠశాలలుమాత్రం అద్భుతమైన ఫలితాలు చూపాయి. పశువుల దివాణంలోని ప్రతిజంతువూ కొద్దో గొప్పో, చదవడం వ్రాయడం నేర్చుకుంది.

పందులు మాత్రం చదవడం, వ్రాయడం నేర్చేసుకున్నాయి. కుక్కలు చదవడం నేర్చుకు అలవాటు చేసుకున్నాయిగాని, సప్తవిధులు చదవడంలో మాత్రే ఉత్సాహం మరొకటి చదవడానికి మాపేవి కావు. పందుల మోస్తరుగానే ముసలి వెంకన్న క్షుణ్ణంగా చదివేది కాని, చదవవలసినంత మంచి విజ్ఞానం ఏమీ లేదని, చదవకుండా వుండేది. బాకీ అక్షరాలన్నీ నేర్పు వుండి కాని, రెండక్షరాల మాటైనా పలుకలేక పోయేది. పంచకల్యాణికి 'అ, ఆ, ఇ, ఈ' లు వచ్చాయికాని, మిగతా అక్షరాలు ఎంత నేర్చుకుందామన్నా వచ్చాయికావు. పంచకల్యాణి డెక్కతో నేలమీద అ, ఆ, ఇ, ఈ లు వ్రాసి, అక్షరాలకేసి తేరిపారిచూస్తూ, ఏ అక్షరం తర్వాత యే అక్షరమో తెలియక, ఆలోచించేది. కొన్నాళ్లు, ఉ, ఊ, ఋ, [illegible] లు నేర్చుకొంది కాని, మొదటి నాలుగక్షరాలూ వెంటనే మర్చిపోయేది. చివరకు ప్రాణం విసిగి, మొదటి నాల్గు అక్షరాలతోనే సంతృప్తి చెంది, మర్చిపోకుండా, ప్రతిరోజూమాత్రం నేలమీద వ్రాసి దిద్దుకొనేది. పంకజాక్షి, తన పేరు వ్రాయడం మాత్రమే నేర్చుకుంది. అందంగా పేరు వ్రాసి, ఇన్ని పువ్వులు తెచ్చి, అక్షరాలచుట్టూ అమర్చి మురిసిపోయేది. ఒక్క, 'అ' అనే అక్షరం మాత్రం నేర్చుకుని, తక్కిన జంతువులు చదువు చాలించాయి. బొత్తిగా మెదడు లేని మేకలూ, గొర్రెలూ, కోడిపెట్టలూ, బాతులూ, సప్తవిధులను కూడా కంఠతా పెట్టలేక పోయాయి. జంతువుల మేధకత్వం చూసి, ఆలోచించి కన్నయ్య సప్తవిధులనూ ఒకసూక్తిలోకి ఇమిడ్చింది. "చతుష్పాదులు మంచివి. ద్విపాదులు చెడ్డవి" అని. ద్విపాదులుజాతికి పక్షులుకూడా చెందడం చేత, అవి కన్నయ్యతో దెబ్బలాడాయి.

"నేస్తాలూ! కోప్పడకండి! పక్షి పక్షము ఎగిరేందుకు ఒక సాధనము. అందుచేత రెక్కలు కూడా పాదాలంత అవసరమైనవే. అందుచేత మీరు ద్విపాదులైన మానవజాతికి చెందరు. పైగా మానవచిహ్నమైన హస్తాలు మీకు లేవుగా. ఆ హస్తాలతోటి, మానవుడు ఘోరమైన పనులు చేస్తున్నాడు" అని కన్నయ్య నచ్చచెప్పగానే, పక్షులన్నీ సంతృప్తి చెందాయి. జంతువులన్నీ కొత్తసూక్తిని కంఠస్థంచేయ మొదలెట్టాయి. సప్తవిధులనూ వ్రాసిన గోడమీదే కొంచెం పెద్దఅక్షరాలతో క్రోడీకరించి తయారుచేసిన క్రొత్తసూక్తిని - వ్రాయడమైంది. కంఠతా రాగానే మేకలూ, గొర్రెలూ ఏడీకాని వేళల కూడా "చతుష్పాదులు మంచివి. ద్విపాదులు చెడ్డవి" అని ఒకటే స్థాయిలో గంటలతరబడి అరిచేవి.

కన్నయ్య యేర్పరచిన సంఘాల గురించి గునపం ఎంతమాత్రం ఇష్టత చూపించలేదు. వయోజనవిద్య లాభం లేదనీ ప్రాథమికవిద్య చాలా ముఖ్యమైందనీ గునపం అభిప్రాయపడింది. కుప్పలునూర్చడం అవగానే కుక్కలు రెండూ కలిసి ఒక తొమ్మిది పిల్లలను పెట్టాయి. పుట్టిన కుక్కపిల్లల విద్యనుగురించి తాను బాధ్యత వహిస్తానంటూ గునపం వాటిని తీసుకుపోయింది. ఎవరికీ కనిపించకుండా ఉండే చోట వాటిని దాచిపెట్టి, గునపం చదువు చెప్పడం ప్రారంభించింది. పశువుల దివాణంలోని జంతువులు పూర్తిగా ఆ కుక్కపిల్లలు బ్రతికి వున్నట్లుకూడా మరిచిపోయాయి.

గేదెలూ, ఆవులూ ఇస్తూన్న పాలు మాయమవడంలోని రహస్యం చివరకు బైటపడింది. పందులు త్రాగే అంబలిలో, ఆ పాలన్నీ కలపడం, తక్కిన జంతువులు పసికట్టాయి. గాలిదుమారాలవల్ల చెట్లనుండి పళ్లూ, కాయలూ రాలేవి. అన్నిటికీ సమానంగా రాలుగాయలన్నీ పంచిపెట్టడం జరుగుతుందని జంతువు లనుకుంటే, అలాకాక ఒక్క పందులే తినవలసిందనీ, కాయలన్నిటినీ యేరి కార్యాలయంలోనికి చేరవేయవలసిందనీ ఆజ్ఞ ఐంది. అన్యాయం జరుగుతుందని తెలిసికూడా జంతువులు లాభం లేదని, కిమ్మనకుండా ఊరుకున్నాయి. తక్కిన జంతువులను సమాధానపరచేందుకుగాను పందులు రౌడీని పంపించాయి

"నేస్తాలూ! మేమేదో స్వార్థంతో, స్వాపేక్షతో ఆ కాయలన్నీ తింటున్నా మనుకునేరు. మాలో చాలామందికి పాలన్నా, పలాలన్నా రోత. నామట్టుకు నాకు ఇష్టం లేదు. ఐతే పాలూ, ఫలాలూ మేమే ఎందుకు పుచ్చుకుంటున్నామంటే ఆరోగ్యం కాపాడుకుందుకు. మా ఆరోగ్యమే కాపాడుకోవడంలో ఒక పరమార్థముంది. అదేమిటంటే, ఈ పశువుల దివాణం నడపడానికి మెదడు ఉపయోగించి అహోరాత్రులు పనిచేసే బాధ్యత మా నెత్తిన పడింది. అందుచేత పాలు త్రాగినా, పళ్లు తిన్నా, మరే ఇతరపని చేసినా, మీ క్షేమం కొరకే, ఈ దివాణం కాపాడేనిమిత్తం కృషి సలిపేందుకే. మేమే పనీ చేయలేకపోతే, మళ్ళా రత్తయ్య దివాణాన్ని ఆక్రమించుకుంటాడు. రత్తయ్య తిరిగిరావడం మీలో ఎవరికీ ఇష్టం లేదని నమ్ముతాను రత్తయ్య తిరిగి రావడం మీ కిష్టమా? చెప్పండి!"

ఏ అన్యాయం జరిగినా సరే భరిస్తాయికాని, రత్తయ్య తిరిగి రావడం, ఏ జంతువూ కోరదు. అందుచేతనే, రౌడీ బెదిరింపుమాటలు నమ్మి, పాలలోనూ పండ్లలోనూ వాటాలు, కోరడం జంతువులు మానుకొన్నాయి.

ఓటర్ల సంఘాలు

సహజానందం

"ప్రతి ప్రభుత్వమును, తన దైనందిన వ్యాపారము ఒడుదుడుకులు లేకుండ జరుపుకొనగలుగుటకు ప్రజానీకముయొక్క సహజ స్వభావము పైననే ఆధారపడియుండును."— హెరాల్డ్ లాస్కి—

స్వతంత్ర భారత రాజ్యాంగ సభ 'డ్రాఫ్టు కాన్స్టిట్యూషన్' ప్రకటించింది. కొద్ది కాలంలో 'కాన్స్టిట్యూషన్' (రాజ్యాంగ ప్రణాళిక) సభ ఆమోదంపొంది, అధికార సిద్ధి పొందవచ్చు. ఇక మన దేశంలో రాజకీయ వాతావరణం, పరిణామం ఈ కాన్స్టిట్యూషన్ పై ఆధారపడి ఉంటాయి. ఇందుమూలంగా ప్రతిపౌరుని జీవితంలోనూ—సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా—ఏదో పరిణామం రాక తప్పదు. కాని ఇంతటి ముఖ్యమైన విషయం ఎంతమంది మనస్సుకు పట్టింది? నిరంకుశ ప్రభువు యొక్క, ప్రభుత్వం యొక్క రాజ్యాంగ ప్రణాళిక రచనలో ప్రజలకు భాగం లేదు. తలొగ్గటం లేదా, తిరుగుబాటు చెయ్యటం ఇవే నిరంకుశ వ్యవస్థలో ప్రజలు చెయ్యగలిగేది. కాని ప్రజాస్వామిక వ్యవస్థలో యావత్తు అధికారం ప్రజలదే. వారులదే. ప్రజాస్వామ్య పరిణామానికి ప్రజలే బాధ్యులు. కాని మనరాజ్యాంగ సభ ప్రకటించిన చిత్తు రాజ్యాంగ ప్రణాళికను విద్యావంతుల్లో ఎంతమంది పరిశీలించారు? ఎంతమంది దాని మంచి చెడులను గ్రహించటానికి పూనుకున్నారు? ఈ ప్రణాళికకు అధికారసిద్ధి కలిగాక, తమ జీవనపరిణామం ఆ ప్రణాళికకు బద్ధమై యుంటుందని ఎంతమంది అర్థం చేసు న్నారు? పైగా ఆనాడు ఈ ప్రణాళిక తమ ఆమోదం పొందే—తమకు బుద్ధిపూర్వకంగా తెలియవచ్చు, తెలియకపోవచ్చు—అధికారం పొందుతుందని ఎంతమంది గ్రహించారు?

రాజకీయాలే నిత్యజీవనమైనవారు, కొద్దిమంది జిజ్ఞాసాపరులు తప్ప విద్యావంతుల్లోనే అత్యధిక సంఖ్యాకులకు ఈ విషయంతో ప్రసక్తి లేదు. 'అది తలనొప్పి, అనవసరం. ఏదో ఎవరో చేస్తున్నారు. మనపని అల్లా మనపొయ్యి రాజుతోందా లేదా అని చూసుకుంటే చాలు. మన డొక్క సంగతి మనం చూసుకుంటేచాలు. రాజ్యాంగాల విషయం ఇబ్బంది లేదు.' ఇది మామూలు ధోరణి. కాని పొయ్యి రాజటం, డొక్కాడటం ఈ జీవయాత్ర అంతా కూడా రాజ్యాంగానికి బద్ధమై యుందని, తమ ఆకలి, ఆనందం, స్వేచ్ఛ, చేతులపై బేడీలు... ఇవన్నీ రాజ్యాంగాలతో నిమిత్తం లేకుండా, తమ సర్వంపై, వ్యక్తిత్వంపై ఆధారపడి లేవని వీరు గుర్తించరు. రేపటి మంచికి, చెడుకు తామే బాధ్యులమని వీరు గ్రహించరు. 100 కి 10 మందిగా ఉన్న విద్యావంతుల సంగతే ఇలా ఉంటే. విద్యాప్రబోధం లేని మిగతా 90 మంది సంగతి విశేషించి చెప్పనక్కర్లేదు.

ప్రస్తుతం ప్రభుత్వమూ, ప్రజలూ అరమర లేకుండా కాలం వెళ్లదీస్తున్నారని తృప్తి చెందినా, ప్రజల ఈ మూగ-సహకారం రాజ్యాంగానికి అండ కాజాలదు. దీనికి ఫలితంగా ఏనాడో ప్రజాస్వామిక వ్యవస్థ నీరసించి, వికృతమై, దెబ్బతిని, ప్రజాద్రోహానికి భయంకరమైన ప్రతిబింబంగా గోచరిస్తుంది.

ప్రజాస్వామిక వ్యవస్థయొక్క దౌర్బల్యానికి ముఖ్యకారణం అధికసంఖ్యాకుల స్తబ్ధత్వం. ఈ జడత్వమే సంఘంలోనూ, ప్రభుత్వంలోనూ మాంద్యానికి, అవినీతికి, నిరంకుశ పరిణామానికి, విచ్ఛిత్తికి మూలం. ప్రజాస్వామిక తత్వాన్ని ఆదర్శంగా ఎంచేవారు ముందు పూనుకోవలసినపని, ఈ జడత్వాన్ని నిర్మూలించటం.

కొత్తరాజ్యాంగం ప్రకారం ఎన్నికలు వచ్చే నాటికి 18 ఏళ్లు వచ్చిన పౌరులందరికీ ఓటు హక్కు సిద్ధిస్తుంది. ఆర్థికమైన, ఇతరమైన వ్యత్యాసాలు ఎన్ని ఉన్నప్పటికీ కుచేలునికి కుబేరునికి ఓటింగుహక్కు సమానమే వయస్సువచ్చినవారందరికీ ఓటుహక్కు వచ్చినంత మాత్రాన ఇల్లు అలకటం కావచ్చు. కాని పండగమాత్రం కాదు. ఎందుకంటే 100 మందిలో ఈనాడు ఓటుహక్కు ఉన్న 18 గురు అయినా సక్రమంగా తమ ఓటుహక్కు ధర్మాలను నిర్వర్తించలేదు. 18 గురిలో సగం మంది కూడా ఓటుచెయ్యలేదు. రేపు 100 మందికి ఓటు హక్కువచ్చినా, వారంతాగాని అధిక సంఖ్యాకులు గాని తగిన విషయ జ్ఞాన మలవర్చుకొని, సక్రమంగా ఓటు ధర్మాన్ని నిర్వర్తిస్తారనే నమ్మకం లేదు. నిజమైన ప్రజాశక్తిని, సంస్కృతిని విజ్ఞానాన్ని కాంక్షించే వారంతా ఓటింగు హక్కు సిద్ధించిన ప్రజల్ని జాగృతపఱచి, వారికి వివిధ విషయాల పరిచయం కల్గించి వారిలో గ్రహణశక్తిని విమర్శజ్ఞానాన్ని దోహదపఱచాలి.

ఓటింగు హక్కుకు తగిన వయస్సు వచ్చిన వారిలో 100 కి 80 మందికంటె చదువువచ్చిన వారుండరు. 1931 లెక్కల ప్రకారం, మగవారిలో 100 కి 77 గురు, ఆడవారిలో 100 కి 97 గురు చదువురానివారు. మన రాష్ట్రములో ఓటింగు హక్కుకు తగిన వయస్సువచ్చిన జనాభాలో ఇంత అవిద్య ఉండటం ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రతిబంధకం. ఈ అవిద్యను నిర్మూలించి విద్యావ్యాప్తి చెయ్యటం ముఖ్యకర్తవ్యం. ప్రజాస్వామిక తత్వాన్ని అభిలషించే పార్టీలకు ప్రభుత్వానికి, వ్యక్తులకు.

మామూలుగా ఓటర్ల విద్యా ప్రచార, భారం ఏదో రూపంలో రాజకీయపక్షాలు అవసరం కొద్దీ తమ నెత్తిన వేసుకుంటయ్. ఎవరి పార్టీ కోసం వారు ప్రజల నెలాగో ఆకర్షించి, తమకే ఓటిచ్చేట్టుగా నానావిధాలా ప్రయత్నిస్తారు.

ఎన్నికలు కొద్దిరోజుల్లో ఉన్నయనగా అప్పుడు పార్టీల హోమాహోమీలు ప్రజలమధ్య చివాలున వాలి, ఎదురు పార్టీవారిపై తీవ్ర దుష్ప్రచారంచేస్తూ, ప్రజల్లో ఆవేశద్వేషాలను రెచ్చగొట్టూ, తమను ఎన్నుకుంటే స్వర్గం సిద్ధిస్తుందని, ఇతరులను ఎన్నుకుంటె నరకం ప్రాప్తిస్తుందని, భయపెట్టుతూ ఓటు సంపాదించటానికి పూనుకుంటారు. ఎన్నికల సందర్భంలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యలకు సంబంధించిన వాదవివాదాలు చెలరేగి, ప్రజల కాపామాపీగా విషయాలు మనస్సుకు పట్టుతయ్. కాని తగిన పరిశీలనాదృష్టి, సంప్రదాయం లేకపోవటంవల్ల స్థానికంగా కనపడే పార్టీల వ్యక్తులపై ఉండే అభిమానద్వేషాలబట్టి మాత్రమే ఓటుచేస్తారు. వివిధగ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీల నిర్మాణం స్థానిక వ్యక్తుల పలుకుబడిపై జరిగింది. గ్రామంలో ఏ తగాదాల వల్లనో—రాజకీయమైనట్టివిగాని, ఏ ఇతర సిద్ధాంతాలబట్టిగాని కల్గినవి గావు; పొలాల దగ్గరో, సరిహద్దుల దగ్గరో, పంచాయతీ పోటీల బట్టో, కులకక్షలవల్లనో కలిగినవి—ప్రజలు మూఠాలుగా చీలటం. వాటికి నామకరణం మటుకు కాంగ్రెసు అని, కమ్యూనిస్టు అని. కులకక్షలు ఉన్నచోట, ఓకులంవారు కాంగ్రెసుకు చెందితే, రెండోకులంవారు కమ్యూనిస్టులయి తీరుతారు. కొట్లాటల, క్రిమినల్ కేసుల్లో కూడా కోర్టుల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలపేర్లు ఎత్తుతారు. ధనికవర్గం ఉన్న ప్రాంతాల్లో ఈ విషయం స్పష్టంగా కనుపిస్తుంది. 50,100,200 ఎకరాలు ఉన్నవాళ్లు కాంగ్రెసులో ఉంటారు. కమ్యూనిస్టు పార్టీలోనూ ఉంటారు. కాంగ్రెసులో వర్గ-సహకార సూత్రం ఆమోదించిందీ లేదు. కమ్యూనిస్టు పార్టీలో వర్గ-పోరాటాన్ని గుర్తించిందీ లేదు. ఇలా స్థానిక కక్షలబట్టి నిర్మితమయ్యే రాజకీయ పక్షాలవల్ల ప్రజాస్వామిక సంప్రదాయం క్షీణించి, ప్రజల పరిస్థితి మరింత హీనమవుతుంది. ఉదాహరణ 'కోర్టులు బహిష్కరించాలి, పరస్పరసంప్రదింపులతో తగాదాలను పరిష్కరించుకోవాలి' అని ఎన్నేళ్ళనుంచో పెద్దలు, పిన్నలు ప్రజలకు బోధిస్తూవచ్చారు. కాని గ్రామాల్లో పైవిధంగా రాజకీయ పార్టీలు ఏర్పడ్డాక, ఫలితం ఎలా ఉంటుంది?

"Total receipts due to the sale ot ndicial stamps were Rs 1,16,78, 409 during the year under revieu (1946-'47-V. S) as against Rs. 1,10, 27, 59 during '45-'46 The increase Is due to litigation."

(Stamp Department Report)

1945-46 లో కంటె 1946-47 లో సుమారు $6\frac{1}{2}$ లక్షల రూపాయలు ఎక్కువ ఖర్చు పెట్టారు ప్రజలు—తగాదాలను కోర్టులకు తీసుకో వెళ్లినందువల్ల. ఏడాదికి 1 కోటి 10 లక్షల రూపాయలకు పైగా ప్రజల డబ్బు ఇలా దుర్వినియోగం అవుతోంది. రాజకీయ పార్టీల మూలంగా ఈ ఖర్చు తగ్గలేదు. పైగా ఎక్కువవుతోంది. ఇంచుమించు 2000 ల జనాభా ఉన్న చిన్న పల్లె నుంచి పెద్ద పల్లెలదాకా ఏదో విధంగా కాంగ్రెసు, కమ్యూనిస్టుల పేర్లు రాజకీయాలకు సిద్ధాంతాలకు సంబంధించని కొట్లాటల్లో, వ్యాజ్యాల్లో వినబడుతూనే ఉంటయ్. రాజకీయ పార్టీలదే దోషం.

పోనీ పురగ్రామాల్లో పరిస్థితి ఇలా ఉంది. బస్తీల్లో, పట్టణాల్లో ప్రజలు, ఓటర్లు ఇంతకంటె విచక్షణతో ప్రవర్తిస్తారేమో ననుకో వచ్చుకాని పెద్ద తేడా ఏమీ లేదు.

గతసంవత్సరం మదరాసులో ఆంధ్ర రాజకీయ మహాసభ జరిగింది. 'రంగాగారు స్పెషల్ రైలు వేయించి, మమ్ముల్ని హాయిగా పట్నానికి తీసుకోవచ్చారు. మరి ఆయనకు, ఆయన 'గ్రూపు'కు చెయ్యెత్తకపోతే ఎలా?' అన్నారు కొంతమంది ప్రతినిధులు. రాజకీయ మహాసభలో పాల్గొని, ప్రజలకు రాజకీయ పంథా చూపెట్టాము నేవారి ధోరణి ఇలా ఉంటే, ఇక ప్రజలకు సరైన విషయ, సిద్ధాంతప్రబోధం ఎలా సిద్ధిస్తుంది? అభిప్రాయభేదాన్ని మల్లయుద్ధంగా, ఓ పెద్దనాయకునికి పోటీగా ఓటు చెయ్యటం ఆ నాయకునికి శిశుపాల శిరశ్ఛేదంగా ఎంచటం ప్రజాస్వామిక సంప్రదాయం కాదు. రైళ్ళు వేయించినందుకు, ఎన్నిక స్థలానికి లారీలు ఏర్పాటు చేయించినందుకు, అక్కడ పంచభక్ష్యపరమాన్నాలు కుదిర్చినందుకు మొహమాటపడి ఓటుఇచ్చే పరిస్థితుల్లో సరైన ప్రజాస్వామ్య మేర్పడదు. ఓటు అంగడిసరుకా? ఓటు అంత చౌకైనదా? ఈ ఓటు హక్కు శ్రీమంతులతోపాటు తమకూ సిద్ధించాలని వివిధ దేశాల్లో ప్రజలు హోరాహోరి పోరాడి, ప్రాణార్పణచేశారు. పరిపాలన, సంఘనిర్మాణంలో ఈ ఓటు హక్కు విప్లవాన్ని కల్గించింది. ఈ నవశక్తి పారిపోతున్న ఫ్రెంచి రాజును, రాణిని పట్టుకొని, వారిదివరలో వందలమందికి విధించిన మరణశిక్షను వారికే విధించింది. మనకీనాడు ఈ ఓటు హక్కు ప్రజలందరికీ సిద్ధిస్తోందీ అంటే, మన తరఫున నిలబడి, పోరాడి, అసువులువిడిచి, శత్రువును నేలకూల్చారు—మన పూర్వులు, అన్య దేశీయులు. త్యాగాగ్నిలో సంతప్తమైతే గాని ఏ హక్కు యొక్క పవిత్రతా ఉద్దీపితంకాదు. ఈ చరిత్ర తెలియక పోవటంవల్లనే లక్షలాది ప్రజలు ఓటు అంటే ఇంతవరకూ నిర్లిప్తులుగా ఉన్నారు. జస్టిస్ పార్టీరోజుల్లో ఓట్లను కొనేవారు. అమాయకులైన ప్రజలు దారిద్ర్యంలో నాలుగురూపాయలు వస్తయిగదా అని ఓటును అమ్మేవారు. కాని కొనేవాళ్లు—జమీందార్లు ముఖ్యంగా—విద్యావంతులు, పవిత్రమైన ఫలసిద్ధిని ఇంతగా నీచపఱచిన రాజకీయవిజ్ఞులే ఈనాడు మళ్ళీ రంగంలో ప్రవేశించి, నాయకత్వంకోసం తహతహలాడుతున్నారు. కాని ఇట్టి సంప్రదాయం ఉన్న కాపురుషులచేతుల్లో ప్రజాస్వామ్యం కుప్పించి, జీవచ్ఛవం కాగలదు.

ఈ సంప్రదాయంలోంచి బైటపడి ప్రజలు తమ ఓటు హక్కును, ధర్మాన్ని నిర్వర్తించాలంటె, ఓటుహక్కు ఉన్న పౌరులే తమ చారిత్రక బాధ్యతను, యుగధర్మాన్ని గుర్తించి, సక్రమమైన ప్రజాస్వామ్యవ్యవస్థకు పునాదిని వేయాలి.

ప్రతి గ్రామంలో, బస్తీలో ఓటర్ల సంఘాలను నిర్మించాలి. 18 ఏళ్ళు, పైన ఉన్నవారంతా ఈ సంఘంలో సభ్యులే. ఈ సంఘం ఏ ఒక్క ప్రత్యేకపార్టీకీ చెందదు. చెందకూడదు. ఓటర్లకు వ్యక్తిగతంగా వివిధపార్టీలపై అభిమానం ఉంటుంది. లేదా ఏ పార్టీకీ చెందని కొంతమంది స్వతంత్రులపై ఉంటుంది. కాని ఈ సంఘం అభిమానాల కుపయోగించటానికి వీల్లేదు. ఈ సంఘాలు చెయ్యవలసిన పని

(1) ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరునికీ రాజ్యాంగానికి, సాంఘిక నిర్మాణానికి సంబంధించిన ప్రాథమిక విషయాలను తెలియజేయాలి.

(2) వివిధపార్టీలు, స్వతంత్రంగా పనిచేసే వ్యక్తులు సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యలపై సిద్ధాంతాలపై అవలంబించే దృక్పథాన్ని, ఆచరణను పరిశీలించటం ఉదాహరణకు కాంగ్రెసు, సోషలిస్టు, కమ్యూనిస్టు, రాడికల్ డెమోక్రాటిక్ పార్టీల ప్రతినిధులు సంఘసమావేశంలో తమ తమ సిద్ధాంతాలగురించి, కార్యక్రమాలగురించి ప్రబోధిస్తారు. సంఘసభ్యులైన ఓటర్లు వివిధ అభిప్రాయాలను విమర్శించుకొని ఎవరి తీరుబట్టి వారు పార్టీలను, వ్యక్తులను సమర్థిస్తారు.

సంఘం చెయ్యదలచుకుంటే ఇంకెన్నో ఘనకార్యాలు చెయ్యవచ్చు. కాని ఈనాడు ముందుగా పూనుకోవలసిన మొదటిపని ఓటర్లకు విషయజ్ఞానం కల్గించడం.

రేపు రాబోయే రాజ్యాంగ విషయం అతి ప్రధానం. దాన్నిగురించి ముఖ్యంగా ఓటర్ల మధ్య విశేషప్రచారం చెయ్యాలి. రాజ్యాంగంలోని ప్రతి అంశంగురించి, ఆ అంశానికి ప్రజాజీవితానికి సన్నిహిత సంబంధం ఎలా ఉండేదీ, అందువలన సంఘ గమనంలో ఏమి మార్పులు రాగలవు, ఇతర దేశాల్లో రాజ్యాంగాలు ఎలా ఉన్నయ్, ఈ వివిధ విషయాలగురించి విస్తారం ప్రబోధం చెయ్యటం తక్షణ కర్తవ్యం.

చైతన్యవంతమైన ఓటర్ల సంఘాలు ఒక్క రాజ్యాంగ విషయంలోనూ, లేదా ఎన్నికల విషయంలోనూ మాత్రమే కాదు ఉపయోగపడేవి. దైనందినంగా కూడా వాటివల్ల అధిక ప్రయోజనం ఉంది.

దైనందిన పరిపాలన, శాసనసభా వ్యవహారాలు, దేశంలో జరిగే వివిధ సంఘటనలు వీటన్నిటిని పరిశీలించి, విమర్శించి, కర్తవ్యతను నిర్దేశించి, తమ తమ ప్రతినిధుల ద్వారా తమ నిర్దిష్ట అభిప్రాయాలతో, నిర్ణయాలతో

(22 వ పేజీ చూడుడు)

చీమల యుద్ధములు

"రాము"

ప్రకృతి క్రూరమయినది. ప్రకృతిలో బలహీనునికి తావు లేదు. ఆత్మసంరక్షణకొరకు, దుర్బలుని హింసించు బుద్ధిచేతను, జంతుజాలము లెల్లప్పుడు పోట్లాడుకొనుచుండును. కాని నిరంతరము క్రమపద్ధతులపై యుద్ధములు సలుపు అలవాటు గల జంతువులు రెండే— మానవుడు, చీమలు.

మనకు, చీమలకు ఎలాటి పోలికలూ లేవుగాని చీమల సంఘజీవనము, మన సమాజపద్ధతులకు పోల్పవచ్చును. "ప్రపంచములో మనుష్యుని మెదడుకంటే అత్యద్భుతమయిన పదార్థము చీమ మెదడు!" అని డార్విన్ మహాశయుని వాక్యము. ఆదిమమానవుల శిల్పముకన్న ఎన్నో రెట్లు మేలయిన శిల్పముతో అవి వాటి ఇళ్లు నిర్మించుకొనును. వాటి సమాజములో పనిపాటులపంపకము (Division of Labour) గలదు. అవి తమ ఆహారమయిన కొన్ని బూజు, గడ్డిమొక్కలు నాటి పండించుకొనును. యుద్ధములుచేసి భూభాగమును, బానిసలను సంపాదించును. మనము పాలకొరకై ఆవులను పెంచునట్లు అవి కొన్ని పురుగులను పెంచును. అంతే కాదు, విలాసార్థమై చిన్న చీమనుగూడ సాకును!

ఇతరకీటకములనుండి ఆహారము దోపిడి చేయుటకొరకు, ఇతరచీమలను తమకు బానిసలుగా చేసుకొనుటకు చీమలు యుద్ధములు చేయును. యుద్ధములలో అవి చూపు యుక్తి, నిపుణత అత్యద్భుతము.

చీమలలో చాలా జాతు లున్నవి. నల్లచీమలను ఎఱుపుచీమలు సామాన్యముగా బానిసలు చేసుకొనును. కావున వీటిరెంటికి ఎల్లప్పుడు పోట్లాట లుండును. ఒకేజాతి చీమలయినను, ఒక పుట్టలోని చీమ ఇంకొకపుట్టలో ప్రవేశించినవెంటనే చంపబడును. కాని ఒకేజాతి చీమల మధ్య యుద్ధములు వచ్చినను చాలవరకు రెండు పక్షములు త్వరలో సంధిచేసికొనును. కాని కొన్ని జాతులు, ఉదాహరణకు—అమెజాను దేశపు చీమలలో అంతర్యుద్ధములు మానవుల అంతర్యుద్ధములకు పోల్పదగినవి. ఆచీమ లొకదానినొకటి ఆవేశముతో చీల్చిచెండాడును. శత్రువెవరు, మిత్రు డెవడని గుర్తింపవిలులేకుండ ఒకటి తల మరొకటి పట్టుకొని ఆరు, లేక ఏడు చీమలు ఉండగా పొరలిపోవుచుండుట చూడవచ్చును. యుద్ధములలో వాటి ఆయుధము వాటి కఠినమైన దవడలే కావు. అవి విషవాయువు (Poison gas) వంటి ఆయుధము మనవలెనే ప్రయోగించును. కొన్ని చీమలు శత్రువుపైకి ఒక ద్రవమును చిమ్మును. అది పైనపడిన చీమలేగాక, సాలీళ్లు, చిన్నపక్షులుగూడ చనిపోవును.

బానిసలు లేకుండ జీవింపలేని ఎఱుపుచీమలు తమ పుట్టలనుండి నాలుగు మూలలకు గూఢచారుల నంపించును. ఇట్లు వెళ్లిన చీమలు దోపిడీ చేయుట కనుకూలమైన నల్లజాతిపుట్ట లభించెనా, దానిని మారుమూలల పరిశోధించి ముట్టడి చేయుట కనుకూలమని తోచినవెంటనే తమ పుట్టకు మరలి చాలమంతనములతర్వాత ఒకపెద్ద సైన్యముతీసికొని దాడిచేయును. సైన్యము ఒక శ్రేణిలో నడచును. గూఢచారులు ముందుండి నేలయొక్క వాసనను కుక్కలవలె నాఘ్రాణించుచు నల్లచీమల పుట్టకు దారితీయును. ఒక్కొక్కసేన కొన్నివందల చీమలు కలిగి, ఏడు గజముల పొడవు, రెండుగజముల వెడల్పు కలిగి యుండవచ్చును. సాంగ్వినియా అను జాతి చీమలు చాల తెలివిగా ముట్టడివేయును. అవి శత్రువుపుట్టకు కొంత దూరములో తమ సేన నిల్పి, ఒక చిన్నసైన్యమును ముందు చూచి వచ్చుటకు పంపును. అవి కొన్ని శత్రువులకు హతము కాగా శేషించినవి ముఖ్యసేనకు మరలి పరిస్థితులు తెలియజేయును. తర్వాత సేన యంతయు కదలి శత్రువుల పుట్ట ముఖ్యద్వారమువద్ద చక్రాకారముగా సమిగూడును. పెద్ద తల లున్న చీమలు సేనముందుభాగమున భయంకరముగా నోరువిప్పి నిలిచియుండును. ముట్టడివేసిన చీమలకు కావలసినవి నల్లచీమల పసిపాపలే. కాబట్టి ద్వారములను ముట్టడించిన దళము నల్లచీమల నన్నింటిని బయటకుపోనిచ్చును గాని వాటి పసికందులను తీసికొని పోనియ్యవు. నల్లచీమలు కొన్ని వాటి బిడ్డలను రక్షించుటకు అవస్థపడునేగాని ఫలముండదు. ముట్టడిదారులు త్వరలో పుట్టలో దూరి చీమ పిల్లల నపహరించునంతలో కొంతసేన, ఓడిపోయి పిక్కబలము చూపు చీమలవెంట బడును. ఈ చీమల దోపిడీ అద్భుతమయినది. ఇట్లు దోపిడీచేసిన తర్వాత కొన్నిరోజులవరకు పుట్టను ఖాళీచేయుచునే యుండును. ఓడింపబడిన చీమలు తమ పూర్వనివాసస్థానమునకు తిరిగి రానేరేవు. మానవులసేన శత్రువుల పట్టణము లేక కోటను పట్టుకొనునపుడింతకంటే అధికమయిన తెలివి నేమి చూపగలదు?

నల్లచీమలుకూడా బాగా ఆత్మసంరక్షణ చేసికొనగలవు. కొన్ని చీమలపుట్టల ద్వారములు యోధులయిన చీమలు కొన్ని రక్షించుచుండును. ఇవి ద్వారమును తమ 'పొట్టతోనో, తలతోనో మూసివేయును శత్రువుద్వారమువద్ద జేరినవెంటనే యోధునిచే బలమైన దిబ్బ తినును. పుట్టబయట కొన్ని చీమలు కావలియుండును. శత్రువు 'కనపడగానే పుట్టలో తెలియును. త్వరలో పుట్టను రక్షించుకొనుటకు సేన ఏర్పడును. ద్వారద్వారమువద్ద శత్రువు నిరోధింపబడును. ఇంతలో సేవకులయిన చీమలు వేరే త్రోవలగుండ శత్రువు కంట బడకుండ తమ పిల్లలను, గ్రుడ్లను, రాణులను తీసికొని పలాయనమగును.

వ్యవసాయము చేయు చీమలు విత్తులకొరకు యుద్ధము చేయును. వీటిలో ఒకేజాతిలోనే అంతఃకలహము ఒయలుదేరును. ఇవి ఒక్కొక్కమారు రెండు నెలలవరకు పోరాడుచునే యుండును. ఇవి సామాన్యముగా ఇతరచీమల దగ్గరనే వసించుచుండినను వాటి జోలికి పోవు. కాని వాటిపుట్టలు వీటికి కంటకముగా తోచెనా ఏయుద్ధముగాని, హింసగాని లేకనే వాటిని పారదోలను వెంటనే గుంపులుగా బయలుదేరి మట్టి ఉండలు కొనివచ్చి తమకు కిట్టని చీమలపుట్టపై అది నిండువరకు కుప్పవేయును. వీటి పోరుకు సహింపలేక ఆ చీమలు మూట, ముల్లె తీసికొని పారిపోవును.

అమెజాను ప్రదేశములో ఎసిటాన్లనే పేరు గల జాతి చీమ లున్నవి. ఇవి దేశద్రిమ్మరులు. వీటి వృత్తి యుద్ధము, దోపిడీ. ఇవి పెద్దపెద్ద సైన్యములుగా కదలిపోవుచుండును. ఒక్కొక సేన కొన్నిమైళ్ల నిడివి గలిగియుండును. ఇవి ఇతర కీటకముల ఆహారముకొరకు దోచుకొనుచుండును. సేన సాగిపోవుచుండగా, దానిలోనుండి కొన్ని చీమల గుంపులు విడిపోయి వివిధ దిశలలో, కీటకములకొరకు, తిండికొరకు, ప్రతి ఆకుక్రింద, రాతిక్రింద వెదకుచుండును. వారి పని పూర్తిఅయినవెంటనే అవి మరల సేనలో వచ్చి కలసిపోవుచుండును. దొరకినది తమ చేతనయిన అవే మోసికొనివచ్చును. లేదా సేనకు వార్త నంపి ఇంకకొన్ని చీమల సాయముతో దొరకిన తిండి మోసికొనిపోవును. చంపబడిన పురుగులు పెద్దవైన అవి ముక్కలుచేసి ఒక్కొక్కముక్క ఒక్క చీమ సేనలోనికి మోసికొనిపోవును. వీటి బారినుండి ఏపురుగూ తప్పించుకొనలేదు.

వీటి సేనానిర్మాణము అత్యద్భుతము. గుంపులుగా విడిపోయి ఆహారము సేకరించికొని వచ్చిన చీమలు ముఖ్యసేనాప్రవాహము చేరగానే, అవి సేనవెనుకభాగమునకు తీసికొని పోబడును. సేనఅంచులు రెండు శ్రేణులను గలిగియుండును. వీటిలో ఒకశ్రేణిలోని చీమలు సేన అంతటితోపాటు ముందుకు సాగిపోవుచుండును. ఇంకొక శ్రేణిలో చీమలు సేన కభిముఖముగా పోవుచుండును. మొదటి శ్రేణి రిక్తహస్తములతో మరలు రెండవశ్రేణి చీమలే అభిముఖముగా పోవు రెండవశ్రేణి చీమలు కీటకములు, ఇతరచీమల పసిపాపలు, ఆహారము మొదలయినవి మోసికొని సేన వెనుకభాగమున సామగ్రి మోతగాన్లకందించి ప్రథమశ్రేణిలో కలియుచుండును. సేన కిరువైపుల కొన్ని అధికార్లని చెప్పదగిన చీమలు అటు ఇటు తిరుగుతూ ఇతరచీమలకు ఆజ్ఞ లిచ్చుచుండును.

వీటి కితరచీమల పుట్ట కనపడినపుడు పుట్టలోని సర్వస్వమును, ఇవి గములు, గోతులు త్రవ్వి దోచుకొనును. ఇట్లు గోతులు త్రవ్వునపుడు ఇవి అత్యాశ్చర్యకరమగు సహకారవృత్తి చూపించును. గోతిలోనికి దిగిన చీమలు మట్టిపెళ్లలను మోసికొని పైకి రావు. చీమలు వరుసగా నిలబడి ఒకరినుండి ఒకరికి పెళ్లలు అందించుకొనును. కడపటిచీమ పెళ్లను దూరముగా పారవేసి త్వరగా వచ్చును. వీటిలో క్లిష్టమయిన పనిపాటులపంపక పద్ధతి లేకున్నను, వీటిలో ఏపనినయిన ఐక్యముతో తెలివిగా సాధింపగల నేర్పున్న దని విశ్వసింపవచ్చును. ఏలనగా కొన్ని మట్టిపెళ్లలు మోయును. కొన్ని తమ తలలతో గోతిని త్రవ్వును. తర్వాత అన్నీ దోచుకొన్నది మోయును.

ఈ సేన చీకటిపడగానే ఒక భద్రమయిన చోట విశ్రమించును. మరీ వెలుతురు రాగానే సాగిపోవును.

కొన్ని ఎసిటాన చీమలలో కళ్లు చాల చిన్నవిగాను, దృష్టిలోపముగాను ఉండును. ఈ లోపమువల్ల అవి సేనాప్రవాహము విడిచి బహుదూరము వెళ్లవు. ఇవి ఒకటి నొకటి వాసనవలననే గుర్తించును. ఇవి చెట్లలో రాత్రి మకాము వేయును. ఇవి ఒక కొమ్మనుండి తేనెటీగలవలె గుంపుగా భూమివరకు వ్రేలాడును. ఒక చీమ ఇంకొక చీమ అంటుకొని నిశ్చలముగా ఉండును. ఈ చీమల కుచ్చుమధ్యకు గల ద్వారములద్వారా బయటిచీమలు లోనికి తిండి కొనివచ్చుచునేయుండును. ఈ కుచ్చులో ఈ చీమలపిల్లలు గూడ వెచ్చగా ఉండును. వీటికి తోడి ప్రాణులపై దయయుండుట గూడ చూడవచ్చును.

కొన్ని గ్రుడ్డి ఎసిటానుచీమ లున్నవి. ఇవి చెదలు (White Ants) వలె మూతదారుల (Covered Roads) లోను, సొరంగములలోను పోవును. ఈ రోడ్లు అవే నిర్మించుకొనుచుపోవును.

ఆఫ్రికా పడమటిభాగములో ఎసిటానుల వంటి చీమలే యున్నవి. వీటికి నివాసస్థానము లేదు. ఇవి చీకటిలో చెట్టుతొఱ్ఱలలో, రాతిచరియలలో నిలుచును. ఇవి ఆఫ్రికా ఎండనుండి రక్షించుకొనుటకు గ్రుడ్డి ఎసిటాన్లవలె మూతదారులలో పయనించును. ఉష్ణమండలపు గాలివాన వచ్చినపు డివి పసివాటిని మధ్య గలిగి ఒక తేలిపోయే దీవిగా మారును.

చీమలలో యుద్ధములకు ముఖ్యకారణమయిన బానిసలను సంపాదించు స్వభావము ఎఱ్ఱచీమలలో నధికము. ఇవి నల్లచీమల పసిపాపలను బానిసలనుగా పెంచును. ఈ బానిసలు పుట్టవిడిచి బయటపోవీలుండదు. ఒకవేళ పోవలసివచ్చినప్పుడు వీటిని వాటి యజమానులు నోటితో కరచుకొని తీసికొనిపోవును. పుట్టలో పసిచీమలను లాలించి పోషించుట మొదలుకొని పుట్టను నిర్మించువరకు బానిస చేయవలసినదే. బానిస లేక యజమాని తన తిండిగూడ తినలేడు—బానిస నోటిలో పెట్టినగాని.

చీమలు వేరుజాతిచీమలనే గాక వేరే కీటకములనుగూడ బానిసలుగా చేసికొనునట. బ్రెజిలుదేశపు అడవులలో ఆకు-నల్లులు (Leaf-bugs) మనము ఎద్దు, గుఱ్ఱములనువాడునట్లు, చీమలచే వాడబడునట. చీమలు తాము కోరికివేసిన ఆకులు తమ పుట్టమోయవలసినపుడు ఈ నల్లులచే మోయించుకొనివచ్చునట. తప్పించుకొనిపోవు నల్లులను మరల త్రోయుచు, నిదానముగా నడచువాటిని పరువెత్తించుచు చీమలు నల్లులను ఆకుతో తోలుకొనివచ్చునట. తర్వాత ఆ నల్లులకు సరిగా ఆహారమివ్వక పుట్టలో నిర్బంధించునట.

మానవులలో తెల్లజాతులవలెనే చీమలలో ఎఱుపుజాతి తమ దాడిగముచేసిన నల్లచీమలను తమ మృతకళేబరములతో కలపవట!

బళ్లారిజిల్లా ఆంధ్రరాష్ట్ర ప్రాంతమే!

(7 వ పేజీ తరువాయి)

పరు. వారి నిర్ణయములు స్వాభావికములు, అకుటిలములు. ఆ కమిషనులు రేవి? ఆ నిర్ణాయక సంఘము లేవి, అవి నిరంతర సంచారశీలములైన భిక్షుకసంఘములు, బుడబుక్కలవారు, బుర్రకథలవారు, బాలసంతోషము వారు, తోలుబొమ్మలవారు మొదలుగాగలవారు అందరికీ ప్రాంతమునకు ఆంధ్రులే వచ్చుచుండుటయు నిది ఆంధ్రప్రాంత మనుటకు సాక్ష్యముగా నుండలేదా! మనమీ అమాయక సంఘనిర్ణయములను గమనించినను యిది ఆంధ్రప్రాంతమనుట స్పష్టము.

విపన్నుల నాదరించుట యందు హిందూజాతి అగ్రగణ్యము. అందుల కాంధ్రజాతిది పెట్టినది పేరు. మేము కర్నాటకుల నాదరించి మాలో జేర్చుకొంటిమి. మధ్య, వీరశైవమతములను మాలో దించుకొంటిమి. తుదకీ మండలమే మాది గాదనిపించుకొను స్థితికి రాగలిగితిమి. యిది అతి మంచివలన కలిగిన చెడుపు. విద్యానగర సామ్రాజ్యమే మాది యని వారందరు యేలయన—విద్యానగర సామ్రాట్టు లందరుగూడా కర్నాటకులేనట. మొర్రో నేను తెలుగువాడ నని మొత్తుకున్న రాయలవారుకూడా కర్నాటకుడే నట. యేలయన ఆంధ్రకవులు తమగ్రంథములలో "కర్నాటక్షితిపాల", "కన్నడరాజ్యరమరమణ" యని సంబోధించినందులకట్టె కన్నరాజ్యమాసమణుడగుటకు కన్నడుడైకా నవసరమేమో? యితరులైనచో పొంతనములు కుదరవా? యీ సూత్రముల ప్రకారం "హిందూదేశ చక్రవర్తి" అనిపించు కొన్నందుకు మరికొన్ని వందల సంవత్సరముల తరువాత కింగ్ జార్జిని హిందువు డనియు, ఇంగ్లాండును హిందూస్థానమనియు చెప్పదలచిన వారిని మన మేమనగలము. శ్రీరాయల భువనవిజయ విద్వత్స్థాన భాద్రపూర్వహముత్రైన అష్టదిగ్గజములయందొక్క కన్నడపు జేనుగుసున్నయైన గలదా! యేల యుండలేదు, అతడు కర్నాటకుడు గాకపోవుటవలననే. అత డాంధ్రభోజుడుగాని, కర్నాటభోజుడు గాడు. విద్యానగర శిథిలావశేషములయందే గాక యీమండిలమంతయూ వ్యాపించియున్న శిలాశాసనముల నించుక పరిశీలింపుడు. తుంగభద్రాపవిత్రాంబుల తోయముల నొక్కింత పుడిసి బట్టి మన ఆంధ్రపారిజాతపరిమళము లెట్లు గుబాళించుచున్నవో చూడుడు! ఆంధ్రశారద మంజీర రుళంయుశారభటి నేటికిని యాపర్వతకందరముల ప్రతిధ్వనించుచున్నది—వినుడు. కరేణుకరకంపిత సాలములైన యీ శైలముల నింత కనుడు. ఆంధ్రకవితాపితామహు లలంకరించిన భూమి, ఆంధ్రనాటకపితామహులు పుట్టిన భూమి, ఆంధ్రనాటకసంఘ మవతరించినభూమి, ఆంధ్రనాట్యకళా ప్రపూర్ణులకు పురుటిల్లు, ఆంధ్రసామ్రాట్టుల కాలవాలమగు భూమిని ఆంధ్రు లెట్లు విస్మరించగలరు? ఆంధ్ర సోదరులారా! విజయనగరమును విస్మరించినచో మీ వీరచరిత్రమునే మీరు మరచినవారగుదురు. మీ సాహిత్యక్షేత్రమునే మీరు మరచినవారు కాగలరు. హొసపేట తాలూకా యందు కొన్నిప్రాంతములలో కర్నాటకు లెక్కువగానున్నట్లు కనుపడినను కనుపడుగాక, కోట్లకొలది ధనమును వ్యయించి నిర్మించిన ఆనకట్ట నితరులచేత నుంచెదరా? నీ పాడియావు నొరియొకరిచేత నుంచుట పాడగునా! మరియు ప్రకృతిసిద్ధమైన తుంగభద్రా సరిహద్దును పాటింప నవసరము లేదా? యీ కారణము లన్నియు నాలోచించుకొనుడు రెండు. కార్యోన్ముఖులు గండు. బళ్లారి మాదేనని చెప్పుడు. సాధించుడు విశాలాంధ్రమును నిర్మించుకొనుడు. విజయీభవ! ఆంధ్రసోదరా, విజయీభవ!

FLASH FLASH FLASH.

BOMABY NUMBE SIX. NEW DELHI. SEPTEMBER 13.

INDIAN TOOOPS MARCHED INTO HYDEABAD AT FOUR AM TODAY,, IT WAS OFFICIALLY ANNOUNCED HERE.-- API.ARR11/16.AM

REPEATING

BOMBAY NUMBER EI HT. (GEN-XX). NEW DELHI, SEPTR 13.

INDIAN TROOPS ENTERED THE HYDERABAD STATE FROM THEE(THREEE) SIDES.-- API. ARR.-1.35.A

భారతరాజకీయాలు :

హైదరాబాదులో భారతసేనల ప్రవేశం

హైదరాబాదు పరిపాలనా క్షేమాన్ని వాంఛించి, భారతసేనలను సికింద్రాబాదులో నిలపవలెనన్న నెహ్రూ సూచనను హైదరాబాదు ప్రభుత్వం తిరస్కరించటంతో, ఇండియా హైదరాబాదుల క్షేమంకోసమని భారతసేనలను హైదరాబాదు సంస్థానంలో ప్రవేశపెట్టవలసిన తక్షణావసరము భారత ప్రభుత్వానికి కల్గింది. ఈ అవసరాన్ని ఎంత నిరూపించి చెప్పినా, హైదరాబాద్ ప్రభుత్వానికి తల కెక్కలేదు.

13 వ తారీఖు తెల్లవారుజామున నాల్గు గంటలకు భారతసేనలు మూడు దిక్కులనుంచి హైదరాబాద్ సంస్థానంలోకి ప్రవేశించి శత్రుప్రతిఘటనను జయప్రదంగా ఎదుర్కొంటూ సికింద్రాబాద్ దిక్కుగా శీఘ్ర గమనం సాగిస్తున్నాయి.

సంస్థానానికి ఉత్తరాన సి. పి. లోని చాంధానుంచి, పడమరన షోలాపూర్‌నుంచి, ఆగ్నేయమున బెజవాడనుంచి, లెఫ్టనెంటు జనరల్ మహారాజ రాజేంద్రసింగ్‌జీ ఆధిపత్యమున భారతసేనలు నిజాం సంస్థానంలోకి పురోగమించి, మూడు దిక్కులలోనూ కొన్ని కీలక స్థానాలను, పట్టణాలను ఆక్రమించుకొన్నాయి.

చాందానుంచి బైలుదేరిన భారతసేనలు, బయలుదేరిన రెండు గంటలలోనే బలార్షాపట్టణాన్ని, రైలుస్టేషనును ఆక్రమించుకొన్నాయి.

షోలాపూరునుంచి బైలుదేరిన సేనలు ప్రొద్దున్నలోపలే నైజాం సంస్థానంలో ముప్పై మైళ్ళలోపలిదాకా చొచ్చుకొనిపోయి, ముఖ్యమైన రైలుజంక్షన్ స్థానమగు నలదుర్గపట్టణాన్ని పట్టుకొన్నాయి. ఇక్కడ మన సేనలు శత్రువుల తీవ్ర ప్రతిఘటనను జయించి రెండు 25 పౌండరు ఫిరంగులను పట్టుకొన్నాయి.

బెజవాడనుంచి బైలుదేరిన సైన్యము 'బొమ్మకల్లు' ఆక్రమించుకొంది. హైదరాబాద్ ఆగ్నేయసరిహద్దులో 10 మైళ్ళలోపల ఉన్న యూనియన్ స్థానమైన 'మునగల'వద్దనున్న సైనికదళము విశాలవ్యూహముతో సికిందరాబాదు ముఖముగా పురోగమిస్తూంది.

ఇదికాక దక్షిణాన భారత సైన్యాలు, హైదరాబాద్ దక్షిణసరిహద్దున, తుంగభద్రపైనున్న మూడు వంతెనలను, హాస్పేట, కర్నూల్, రాయచూరుకు దక్షిణముగాను ఉన్న వాటిని, మూడిటినీ పట్టుకొన్నాయి. ఈ సైనిక చర్యలన్నీ ఆదివారంనాటి ప్రొద్దుటి పరిస్థితిని తెలుపుతున్నాయి.

హైదరాబాద్‌పై సైన్యాలను తరలించే ముందు సైన్యాలకు జనరల్ రాజేంద్రసింహజీ ఇచ్చిన సందేశ మిది:

నైజాంనవాబు పరిపాలితమైన హైదరాబాద్ అరాచకంతో నిండిపోయింది. నవాబుకు, అతని ప్రభుత్వానికి, అక్కడ జరుగుతూన్న అపూర్వమైన ఘోరఅరాచకాన్ని అణచగల శక్తి ఉన్నట్లు కనబడదు. న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా జీవితం గడుపుతూన్న, అన్ని వర్గాల నిజాం ప్రజలూకూడా, భయంవల్లా, తమ అసహాయస్థితివల్లా కంపించిపోతున్నారు.

"అక్కడి ఈ అల్లరిఅంతా, కాశింరజ్వీ అనుయాయుల మతోన్మాదంవల్ల సంభవమైంది. కాశింరజ్వీ అసలు హైదరాబాదువాడు కాడు. హైదరాబాదు దేశక్షేమముగాని, హైదరాబాదు పాలకుని క్షేమముగాని అతని మనస్సుకు పట్టే వీలే లేదు.

"అతని అనుయాయులు, సంస్థాన పోలీసు సహాయాలతో, హత్యలు, దోపిళ్ళు, స్త్రీల మానభంగాలు - సంస్థానంలో జరపటంతో తృప్తితీరక, పరిహద్దుల నతిక్రమించి ఇండియన్ యూనియన్ గ్రామాల్లో కూడా తమ క్రౌర్య కృత్యాలు సాగించారు.

"మన ప్రజాస్వామ్య ప్రభుత్వము, సామవిధానంలో హైదరాబాద్‌తో సామరస్యం ఏర్పరుచుకొనేందుకు గత ఆరునెల్లుగా అనేక విధాల ప్రయత్నించింది. కాని నిజాం ప్రభువు సలహాదారులకీ శాంతియుతమైన సంప్రతింపులు తలకెక్కలేదు. ఈ సౌమ్యవిధానాన్ని భారత ప్రభుత్వబలహీనతగా వారు భావించటంతో క్రౌర్య చర్యలు మరింత అధికమయాయి. భారత ప్రభుత్వం ఇక ఈ స్థితి భరించలేక పోయింది.

"నిజాం సంస్థానంలో, శాంతిభద్రతలను స్థాపించి, సామాన్య శాంతి జీవిత పరిస్థితుల నేర్పరచటానికే చివరికి భారతప్రభుత్వమీ చర్యను పూనుకోవలసివచ్చింది.

"కర్మము నిర్వర్తించవలసిన విధిని నా సైన్యములపైనను—నాపైనను భారత ప్రభుత్వం ఉంచింది. శాంతి భద్రతలను నిజాం సంస్థానంలో స్థాపించవలసిన ధర్మము గుర్తించి, తదవసరమైన ప్రథమ చర్యగా హైదరాబాద్ సన్నిధానంలోని సెకందరాబాద్, తిరుమల్‌ఘరీ, బోలారంలలోని మన ప్రభుత్వ సైనికస్థానాలకు మనను భారత ప్రభుత్వం పంపుతూంది." అని భారత ప్రభుత్వ విధ్యుక్త ధర్మాన్ని వివరిస్తూ జనరల్ మహారాజా సింగ్ సేనలకు పురోగమించవలసిందని అనుజ్ఞ ఇచ్చాడు.

భారత ప్రభుత్వసేనలు దక్షిణ దిక్కుగా పెద్ద పెట్టున సంస్థానంలో ప్రవేశిస్తాయన్న భావంతో నిజాంసేనలు దక్షిణదిక్కుగా ఎక్కువ కేంద్రీకరింపబడుతూన్నట్లు గతవార్తలు తెలుపుతూవచ్చాయి. సంస్థానంలోకి ఇంతవరకూ అన్ని దిశలనుంచీ భారతసేనలు శీఘ్రపురోగమనమే సాగించుకొంటూ చొచ్చుకు వస్తున్నాయి.

మహమ్మద్‌ఆలీ జిన్నా

(9 వ పేజీ తరువాయి)

పై కెక్కి, పట్టుకొమ్మ ఎక్కి కూర్చుని మొరాయించాడు. జిన్నాతో సమాధాన పడటానికి మహాత్ముడు చేసిన ప్రయత్నాలుకూడా విఫలమవక తప్పలేదు.

1947 జూన్‌కు జిన్నా పట్టు నెగ్గింది. కాంగ్రెస్ దేశవిభజనకు ఒప్పుకుంది. ఆగస్టు 15 కు, మౌంటుబాటన్ కృషిఫలితంగా ఇండియా, పాకిస్థాన్‌లకు, స్వాతంత్ర్యమూ, విభక్త స్థితీ కూడా ఏకకాలంలోనే ఏర్పడ్డాయి. పాకిస్థానుకు తనకు తనే గవర్నరు జనరల్‌గా జిన్నా ప్రకటించుకొన్నాడు.

జిన్నా మత ఆవేశాన్ని, అధికార తృష్ణను విస్మరించగలిగితే అతని సుగుణాలు గోచరించక తప్పవు. వ్యక్తిగత జీవితంలో జిన్నా స్వచ్ఛతను శత్రువులు కూడా శంకించరు. ఆ విషయంగా అకళంకుడు. లాల్లి వ్యాపారము లేదు. మనిషిలో తఘావతు లేదు. మహాత్మ గాంధీకి కూడా జిన్నా శిష్ట చరితలో గాఢమైన విశ్వాసం ఉండేది. అందుకనే హిందూముస్లిం సఖ్యతకై స్వయంగా జిన్నాతో సంప్రదింపులు జరిపేందుకు అన్నిరూర్లు అభిలషించి ప్రయత్నించాడు. సంభాషణలు విఫలమైనా కూడా, ఒకరిపై నొకరి కున్న సద్భావా లేమీ తక్కువ కాదరలేదు. సహృదయత్వం చెడలేదు.

తన వేషభాషల విషయంలో అతిజాగ్రత్త తీసికొనేవాడు జిన్నా. జీవితపు అలవాట్లు నిరాడంబరమైనవనే అనవచ్చును.

మిస్ ఫాతిమాజిన్నా, సోదరునికి సర్వావస్థలలోనూ తోడునీడయై నిలిచి అతని కార్యభారాన్ని చాలమటుకు తనుకూడా వహించింది.

కొన్ని నెలలనుంచీ జిన్నా సుస్తీగా ఉంటున్నాడని పత్రికలు చెదురుగా వార్తలు ప్రకటిస్తూ వచ్చాయికాని, పాకిస్తాను ప్రభుత్వము ఎప్పటికప్పుడు వాటిని నిరాధారాలని ఖండిస్తూ వచ్చింది. ప్రథమ స్వాతంత్ర్య వార్షికోత్సవం నాడు పాకిస్థాన్ సృష్టికర్త పాకిస్థాన్ స్వాతంత్ర్యోత్సవంలో స్వయంగా పాల్గొనలేక పోవటం పాకిస్థాన్ ప్రజను చాలా నిరాశాపూరితం చేసింది.

ఈనాడు జిన్నాహఠాన్మరణ్యం భారత రాజకీయాలలో ముఖ్యంగా కాశ్మీర్ హైదరాబాదులపై, ఎంతటి ఎట్లాటి ప్రభావం కరపించుకొంటుందో చెప్పటం కష్టం.

"ఆంధ్రపత్రిక"

జన్మదినోత్సవ అభినందనములు

'ఆంధ్రవారపత్రిక' కు ఈ వారముతో 40 సంవత్సరములు నిండి 41 వ సంవత్సరము ప్రారంభ మగుచున్నది తెలుగు భూమిలో ఇన్ని సంవత్సరములు అవిచ్ఛిన్నముగా దేశసేవ చేయగలిగిన మహాభాగ్యము ఈ పత్రికారాజమునకు మాత్రమే అబ్బినది. మొదట ఈ పత్రిక విఖ్యాతి పురుషులైన శ్రీ॥ శ్రీ॥ దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారిచే బొంబాయిలో స్థాపింపబడి ప్రథమయుద్ధము ప్రారంభమైనపుడు చెన్నపురికి తీసికొనిరాబడెను. అప్పటి నుండియు శ్రీ నాగేశ్వరరావు పంతులుగారు ఈ వారపత్రికను నడుపటతో మనసే తృప్తినొందక దినపత్రికను ప్రారంభించి ఆంధ్రదేశములో రాజకీయవిజ్ఞానమును ప్రబోధించుచూ జాతీయ చైతన్యమును వికసింపజేసిరి.

ఈదినము ఆంధ్రదేశములో ఆంగ్లభాషా పరిచయము లేని ప్రజానీకము రాజకీయ, జాతీయ విజ్ఞానమును అలవఱచుకొని ఇతర రాష్ట్రములతో పాటు ముందుకు నడుచుచున్నదనిన అది 'ఆంధ్రపత్రిక' పెట్టిన భిక్షయే అని ఎల్లరు కృతజ్ఞతతో అంగీకరింపక తప్పదు

ఇదియునుగాక, పత్రికానిర్వహణము వలన దేశసేవ చేయవలయునను కార్యదీక్షయే లేకుండిన ఆంధ్రపత్రికా కార్యాలయమునుండి 'ఆంధ్ర సినపత్రిక', సర్వాంగ సుందరమైన 'సచిత్ర వారపత్రిక'. 'భారతి' మాసపత్రిక, 'ఉగాది' సంచికలు వెలువడుటకు ఆస్పద ముండునదికాదు. దేశసేవయే పరమావధిగా పెట్టుకొని ఈ కార్యాలయము వారు ఇన్ని పత్రికలను క్రమము తప్పక ప్రజాబాహుళ్యమునకు అందజేయుచున్నారు ఇది వారి స్వార్థరహిత సేవకు ప్రత్యక్షనిదర్శనము. 'ఆంధ్రపత్రికా' కార్యాలయమునుండి వెలువడుచున్న దిన, వార, మాస, ఉగాది పత్రికలన్నియు ఆ ఆశయమును ప్రతిబింబింపజేయు దర్పణములు.

* * *

దేశ హితైక తత్పరతతో నిర్వహింపబడుచున్న ఈ 'ఆంధ్ర దినపత్రిక' యు 'ఆంధ్ర వారపత్రిక' యు 'భారతి' యు 'ఉగాది' సంచికలును సర్వజనాదరణీయములై ఆంధ్ర దేశములో మారుమూలలలో ఉండు గ్రామ సీమలలోని గృహములనెల్ల అలంకరింపుచూ ప్రజలను విజ్ఞానవంతులను ఒనర్చి అనేక సంవత్సరములు దేశసేవయు ప్రజాసేవయు చేయునటుల ఈ పత్రికలను, ఈ పత్రికా నిర్వాహకులను పరాత్పరుడు ఆశీర్వదించుగాక యని ప్రార్థించుచున్నాము

4 దశాబ్దములు గడిపి 5 వ దశాబ్దములో అడుగు పెట్టిన 'ఆంధ్ర వారపత్రికా' మతల్లికి త్వరలో స్వర్ణోత్సవము జరుగుగాక యని కోరుచున్నాము.

['భారతజ్యోతి' పత్రికా సంపాదకులు తమ 10-9-'48 పత్రికలో అభినందన పూర్వకముగా ప్రకటించిన ఈ వ్యాసమునకు మా కృతజ్ఞత తెలుపుచున్నాము—సం.]

వేనమహారాజు

(10-వ పేజీ తరువాయి)

నే: ఆహా, తమరు మా కాలంలో నుండాల్సిన వాండ్లండీ?

వే: లాకపోయిందోయ్! అంయిదీ అప్పుడే మా వేదమే కొద్దో గొప్పో యిప్పటికంటే అధికంగా భూలోకంలో నిలబడబోతుంది చూడు! ఇప్పుడు మేమే వుంటేనా ఏర్పడి వున్న సౌకర్యాల కేం సుఖపడి మా మతస్థుల్నేం సుఖపెట్టేవాండ్లమో?

నే: ప్రజలంతా ఏ మానందించి...

వే: నెత్తినెట్టుకోకపోయినా రట్టోయ్! బ్రాహ్మణులంతా బ్రహ్మరథం బట్టకపోయారా? మా కాలంలో వాండ్లంతా అభాజనులు కాబట్టి ప్రాతలేమో పాడౌతున్నాయని యేడ్చి గోలెత్తి మా పరిపాలన్ను నిరోధించ లెంచేవాండ్లుగాని!

నే: తమ తత్వంవాండ్లకు మా కాలంలో వాండ్లకు మల్లే నర్థంకాదు లెండి. అయితే ఆ మనుష్యులంతా తమ మతసారం గ్రహించకుండా యెట్లా గున్నారండీ?

వే: ఏమిటోనోయ్! మానవస్వైజం సోమరితనమోయ్! దానికంగంగా గ్రొత్తల నాసించదు ఆమోదించదూ! అంతవర కెందుకు—మనకు తిన్నదే తినాల్నంటుంది. ఉన్నచోటే ఉండాల్నంటుంది.

నే. చక్కగా సెలవిచ్చారు, చిత్తం. తమ తండ్రిగా రట్లా చేశారేమండీ?

వే: ఆయ నొట్టి పిచ్చివారోయ్! మామూలా శేదో కొంప మునిగిపోతుందని ఎవర్తో చెప్పకుండా అంతర్థానమైన కైలాసారు-మేం రాజ్యార్హులం గాబోతుండగా. పాపం! మంత్రులు వారికోసం గాలించారుగాని లాభించలా.

నే. అట. తమ తల్లిగా రేమనేవారండీ తమ మతానికి?

వే: పుత్రప్రేమ గల తల్లి కొడుకు నెప్పుడూ నిరోధించరు. అందులో మేం చేసేది తప్పు కాదనుకల్నా దనుకుంటా. ఇంతకూ వారు మహాయోగులు. ఒకరితో మాట్లాడేవారు కారు, మమ్మల్నసలే పల్కరించేవారు గారు.

నే: మీ తాతగారు—అంటే మాతామహులు...

వే (పకపక నవ్వి మహా యొక్కువైన వారు. వారి పేరు విన్నప్పుడల్లా మా కపరిమితానందం. వారే బ్రతికుంటే మా కెంతో ఒత్తాసిగా నండేవారు. వారు చేసిన మహాకార్యాల్లో మేం అరవీసం గూడా చాయలా. నన్ను పెంచిన పరిచారకు లన్నేవాండ్లుగా శ్రీవారు తాతగార్ని మరిపించ గలరని. ఇట్లా గంటున్నారమ్మా అని అమ్మగార్తో నంటే తల వంచుకుని వారేదో జపం చేసేవారుకాని యేమీ అనేవారు కారు. వారి వ్యాసంగం వారిదిగాని యితరం వారి కంటేది కాదు.

నే: చిత్తం. తమరు చెప్పేదంతా చూస్తే పూర్వాచారాలు తమ కొప్పుకోరన్నమాట.

వే: ఆచార మేమిటి? ఆచరించేది గాక ఆచరించాస్తుందే ఆచారమౌతుందా? ఏసందర్భంలో నెన్నడో అట్లాటి ఆచరణ పవ్యమని తోచి పదిమంది ఆచరించారు. ఇప్పటి సందర్భాల్లో నవి పనికిరావని మరోకవిధంగా నాచరిస్తారు. ఇదిమటుకు పవ్యమైన ఆచార మెందుకు గాదు? అదంతా పదిమంది కలిసి చేశారా లాకపోతే ఏ వ్యక్తో అట్లా చేయడం మొదలెట్టారా అనే ప్రశ్నమీద నాధారపడివుంది. మా సమాధానం. సాధారణంగా ఎవడో మొదలెడ్తాడు. నలుగురూ దాన్ననుసరిస్తారు. అది సర్వాంగీకారమయ్యేప్పటికి కొంతకాలం పడుతుంది. ఆ కాలవ్యయంవల్ల సంఘం బాధపడకతప్పదు. అట్లాగాకుండా యెవడో మేధావంతుడు ఈ విషయమట్లా కా దిట్లాగని నిర్ణయించగూడదూ, అందరి మేలూ కోరి? దాన్నంతా అనుసరించరాదూ? అట్లాటి మేధావంతుడు ప్రభువుకంటే నెవడుంటాడు? మా కాలంలో మాకంటే నట్లాటి ప్రభువెవడు, అహంకారమతోద్దీపకుడు? కాబట్టి మేం క్రొత్తమార్గాలు పెట్టాం.

నే: ఆహాహా, యేం బందోబస్తుగా పాలించారు ప్రభూ! అందుకనే తమరు మా కాలంలో నుండాల్సిందన్నా నిందాక. ఇప్పుడు చూడండి రేం జరుగుతూందో. ఎంత కాలం నుండో ఏదో చూచి సగోత్రీకపు సంబంధాలు పనికి రావన్నా రెవరో. హిం మా సంఘమంతా దాన్నాచరిస్తూంది. మా కాలంలో కొందరు బుద్ధిమంతులు "ఛా, యిదేమిటి, జాతిమతభేదాలు పాటించకుండా పెండ్లాడే యీ రోజుల్లో? ఏ గోత్రాలు, ఋషులు చూచుకుని యీ సంబంధాలు జరుగుతున్నాయ్? అట్లాటప్పుడు సగోత్రీకపు టభ్యంతర మేమిటి? పోనీ, ఆచరణ ఆచారమైందాకా ఆగదామా అంటే అడ్డమైన వాండ్లతో సంబంధా ల్జరుగుతూంటే అన్నా చెల్లెండ్ర, అక్కతమ్ముళ్ళ సంబంధాలేనా ఆగాల్సింది? అట్లాటి వరుసున్న వాండ్లుమటుకు ఆహా మనం చేసుకుంటే బాగుంటుందని వాంఛించరాదా పాపం! ఛీ! ప్రజాప్రభుత్వం వచ్చె మనం శాసనసభల్లో నుంటిమి. మన మాటక్కడ చలామణీ అవుతుంది కదా. వాట్లో శాసనం పెట్టి శాసింపిస్తాం. అప్పుడట్లాటి వాండ్ల కవకాశం కలుగుతుంది" అని వాదిస్తున్నారు! అది మహాబాగుందనే వాండ్లు కొందరున్నారు.

వే: బాగుందేమిటి, దివ్యంగా వుంటేను! అట్లాటివాండ్లు మా కాలంలో వుంటే వాండ్లకు తప్పక మంత్రిపదవు లిచ్చి ఒక సమితిగా జేసి వాండ్లచేత ఎన్నెన్నో శాశ్వతఫలప్రదాయిలగు మార్పుల్ని చేయించేవాండ్లం! అహా, యేం కాలమోయ్ మీ కాలం! అరరే మన మిప్పుడ్లాకపోతిమికదాని నోరూరిస్తూంది! బలే! బలే! ఔను నిజానికంటే, మా కిది తోచలా! వివాహం చేసుకునేది స్త్రీపురుషులేగా! అన్నలు చెల్లెండ్రుమటుకు స్త్రీపురుషులు కారా? వివాహసంబంధానికే మడ్డం? బాగుంది.

నే: చిత్తం. ఆమాటకొస్తే మగాళ్ళుమగాళ్లు మటుకు కెందుకు చేసుకోకూడదండీ? మొన్న మొన్ననే అమెరికాదేశంలో నొక పెద్ద కేసు జరిగింది. జగద్విఖ్యాతకీర్తిగాంచిన టెన్నిసువీరు డొకడొక బాలుడితో సంబంధం కల్పించుకున్నాడట. అది తప్పని ఒక పెద్ద గంద్రగోళం, కేసు, దాన్లో తీర్పు.

వే నిజమేనోయ్, నీ వంది బాగుంది! ఔను మగాళ్ళుమగాళ్ళుమటు కెందుకు చేసుకోకూడదూ?

నే: చిత్తం. అంతవరకు రానే వచ్చింది మన వాదం. ఇంకొక్క అడుగేస్తే కేవలం కామశాంతే వివాహోద్దేశమైతే మా కాలంలో కొందరు పశుసంబంధీకులున్నారే, ఏ పశువునో, పశువుల్నో ఎందుకు చేసుకోకూడదూ?

వే (పకపక నవ్వి నావీపు చరిచే అభినయం చేస్తూ) బలేబలే, మహాదివ్యంగా వాదించావ్! నిజమే, ఎందుకు చేసుకోకూడదు? ఒకటే రెండూ కాకుండా మందల్నే కట్టుకోవచ్చు!

నే (స్వ) వీడి బుద్ధి తగలబడా! (ప్ర) కాబట్టి తమ కాలం అచ్చగా మా కాలంలాగుండే దన్నమాట!

వే మరే, యింత తెలుగు మీ ర్లరనుకో! అయినా మీదానికి బీజాలన్నీ మా కాలంలోనే వెదజల్లాం! మంచి పంటే పండినందుకు సంతోషిస్తున్నాం!

నే చిత్తం. ఈమాత్రం మమ్మల్ని బాగుందన్న పూర్వప్రభువులు లేరు. అయితే తమరప్పుడంత కృషిచేసి విత్తిన నారు పంటకొచ్చేప్పటి కింతకాలం బట్టిందేమండీ? మధ్య వచ్చిన ప్రభువులంతా దాన్ని పీకేసి పాడుచేసినట్లుందే?

వే: పనికిమాలినవాండ్లోయ్, పనికిమాలిన వాండ్లూ! మా తర్వాత వచ్చినవాండ్లలో, ఎన్న దగ్గవాడు మిహిరగులుడు. వాడు చక్రవర్తిశిరోమణి. వారిపేరు వినపడ్డప్పుడల్లా ముచ్చటేస్తుంది మాకు! వాడితర్వాత ఒక మోస్తరుగా కొందరు తురకప్రభువు లెన్నదగ్గవాండ్లు! వాండ్లదేముందిగాని వాండ్లతర్వాత విదేశాన్నుంచి వచ్చారే ఆంగ్లేయులు అరరే, వాండ్లు నిజంగా దేవతలేనోయ్! మే మనుకుంటూంటాం మా కాలంలో మాఆజ్ఞను శిరసావహించిన బుద్ధిమంతులంతా ఆంగ్లేయులై పుట్టారాని! వీండ్లు వచ్చి నిల్దొక్కుకోవడం మొదలెట్టినప్పట్నుంచి పూర్వాచారాలని మూరులంతా మన్నించే వాట్ని కూకటివేళ్లతో పెకలించివిసిరి సముద్రంలో బారేసారు. కొన్నిట్ని దగ్ధపటలం జేశారు!

నే ఏమిటో లెండి! (చప్పరిస్తూ) వాండ్లేమో వెళ్లిపోతారట!

వే ఔనట, మేమూ చూచాయగా వింటున్నాం. స్వర్గంలో వాండ్లకీ లోకవ్యవహారా లాట్టే పట్టవ్. కాని వాండ్లెళ్తే మళ్ళీ భరతఖండాని కోస్తా యగచాట్లు. మూర్ఖాచారాల్లో కొన్నైనా మళ్లీ తలెత్తకపోవ్!

నే ఎత్తితేమాత్ర మేంలేండి? తమ మతం వారు మా వాండ్లలో కోటానుకోట్లుండగా! తర్వాత, తమ విషయంలో చివరకా బ్రాహ్మణహుంకార మేమిటి?

వే అదా! (కొంచెం విచారించి) ఏమీ లేదోయ్. చూచేకొద్దీ మా కృషంతా నిష్ఫలమైన ట్లగుపిస్తూవచ్చింది. ఎవరో మమ్మల్ననుసరించుకున్న వాండ్లుతప్ప మిగతా వాండ్లలో చాలా మందికి క్రొత్తపంథ లిష్టంలేదా అని సందేహం తోచింది. దానికి మునులనే మూర్ఖుల ప్రచారం చాలావరకు కారణం. ఆ మూర్ఖులొక పదిమందొకరితో వచ్చి యేవేవో పిచ్చిమాటలు మాట్లాడడ మారంభించారు. ఛీ! యీ కృతఘ్నులోకంకోసం కృషిచెయ్యడంకంటే ప్రాణత్యాగం మేలని సభలోనే వాయుస్తంభనయోగంపట్టి ప్రాణాల్ను పుంజించి బ్రహ్మరంధ్రాని కెక్కించాం. అది పేల్చి విచ్చి మా అవతారసమాప్తైంది. అదంతా తమ హుంకారమాహాత్మ్య మని ఆ మూర్ఖులు వాండ్లననుసరించే వాండ్లు వాగారేమో.

నే అట్లా సెలవియ్యండి, ఇప్పుడు బోధమైంది. అయితే వయ్యా, తమకూ మాకూ మధ్య వచ్చిన ప్రభువులంతా పనికిమాలినవాండ్లని సెలవిచ్చారే, శ్రీరాములవారు కూడానా?

వే (లేవబోతూ) వాడందర్లోకీ మూర్ఖుడు.

నే తమపాటు షుడిచేయడానికి వాండ్లం చేశారేమిటండీ?

వే: ఆ మూర్ఖాగ్రేసరుణ్ణి పిల్చడుగు వాడే చెప్తాడు. మకు తీరదు, వెళ్లాలి. అధ్యయన కాలం సమీపిస్తూంది. తగిన యేర్పాటులు చెయించాలి. (నిష్క్రమిస్తాడు.)

నే (ఆశ్చర్యంతో) అరి వీడిల్లు కల్లకాడు గానూ! (గుండె కొట్టుకొంటూ) ఎంత పొగరు విడికి, ఏ మహంకారం! ఏం కుతర్కం, దాన్లో నేం నేలవిడిచి సాము! (కొంచెముండి) వీణ్ణే అనడ మెందుకు? ఈ కాలంలో నిట్లాటివాండ్లెందరు లేరూ? ఏ కాలంలోమటు కిట్లాటివాండ్లెక్కడెక్కడా లాకుండావున్నారా! సృష్టిచిత్రాల్లో నిదొకటి మంచిపక్క నేమాత్రమో చెడు గుండకుండా వుండదు (కొంచెమాగి, గువాలకేసి చూస్తూ) వీ డెళ్లి ఆ దయ్యాల్తో నేదో మాట్లాడుతున్నాడే? వాండ్లంతా వీడికా కాలంలో ననుకూలు లనుకుంటా! ఈ దొర్భాగ్యుడి రాజధానిక్కడుండే దేమో. వాండ్లతో నేదో యేకచకాలాడుతున్నట్లున్నాడు! ఇట్లాటివాణ్ణి స్వర్గాని కెందుకు రానిచ్చారబ్బా! వీడు వీడి వాండ్లు గలిసి అక్కణ్ణే యేవిప్లవమైనా సాగించి ఇంద్రుణ్ణే బోల్తాగొట్టిస్తారేమో!!! (యోజించి) ఏడ్చారు. ఇట్లాటి వెధవ లెందరైనా రో సృష్టిలో? చతుర్దశ భువనపరిపాలకుడైన యింద్రునకు, సమస్తజ్ఞానమూర్తియగు బృహస్పతికి తెలీక రానిచ్చారా! వీ డేదో యిక్కడ అరతేపనం జూపించాడుగాని అక్కడ మన చండాలవాట్లల్లాగ యీ ప్రేతల కేనాటి కుందో? —వీండ్లను చేర్రానిస్తారా మహనీయులైన దేవతలు అట్లాగనుకోవడం మన బుద్ధిజాడ్యంగాని! (కొంచెం యోజన)

సరే, యిప్పుడు మనకు గత్యంతర మేమిటి? ఎవర్ని పిలుద్దాం? షోడశరాజుల్లో మొదట్నుంచి ఆహ్వానిద్దామంటే మనం పెట్టుకున్న పంపిణీకి వాండ్లలో నెవరూ అందరైరి? ఒకరో, యిద్దరో దొరికినా షట్చక్రవర్తులకంటే యెక్కువేం చెప్పగలరు? (కొంచెమూండి) ఎందుకు వార్ని శ్రమపెట్టడం? ఆ ఉద్యమం సంక్షేపించుకుని త్వరలో మనం మన కలియుగచరిత్రలో ప్రవేశించడం మంచిది. త్వరలో నని యెందుకు తోచిందంటే యింత పని సంకల్పించుకుని మనకు ముందున్న ద్వాపరంలో విషయాల్ను తడవకపోవడం మంచిది కాదు. అది మన యెత్తుగడకే మంచిది కాదు. ఎందుకంటే, నేను జేమన్నా, మన వ్యవహారాలకు తగ్గ బీజాలన్నీ చివరి ద్వాపరంలోనే మొలకలెత్తాయ్! (ఆలోచించి) అయినా యెవర్నాహ్వానిద్దాం. (కొంచెముండి) శ్రీ కృష్ణమూర్తిని వేంచెయ్య మనకతప్పదు. ఆ, ఆ, ఆఁ! (నెమ్మదిగా) షోడశరాజుల్ను శ్రమపెట్టడ మెందుకనుకున్నాంగామా? (యోజించి) ఆ, వద్దుగాని, వాండ్లలో మాంధాత మొదలు శ్రీరాముడుదాకా లోకాల్ను వెలిగించిన మహావ్యక్తిని పిల్చామా అంటే ఇంచుమించుగా వారికాలపు మర్యాదల్ను పర్యాలోకించవచ్చు! భేష్, కుదిరింది, ముగ్ధ! ఇక నొక్కొంచెం విచారించి పలికిద్దాం. బలే! మన తల్లి, మన దేవి మన కేదో తోపిస్తూంటింది! ఆ మెపలుకుబడి లాకుంటే మన గతుట్టిదే!

(నిష్క్రమి)

ఓటర్ల సంఘాలు

(19 వ పేజీ తరువాయి)

ప్రభుత్వానికి తోడ్పడవచ్చు, తోడ్పడాలి.

ఈ ఓటర్ల సంఘాలద్వారా ఇంకెన్నో పనులు చెయ్యవచ్చు. పల్లెల్లో ముఖ్యంగా కుల విభేదాలు పోయి, అన్నికులాలకు చెందిన ఓటర్లు సమావేశమవటం గ్రామీణజీవితాన్ని ఎంతో పెద్దపరుస్తుంది. ప్రజాస్వామికలక్షణాల్లో ముఖ్యమైనది—సహన భావం. అభిప్రాయ భేదాలు, ఆర్థికభేదాలు ఉన్నా, ఈ సంఘం ద్వారా ఓటర్లకు ప్రాథమిక విషయ పరిజ్ఞానం కలిగించాలనే ధర్మాన్ని ప్రజాస్వామికవాదులు అంతా గుర్తించాలి.

ప్రజాస్వామిక వ్యవస్థకు ఓటర్లు పునాది. గట్టిగా ఈ పునాదిని వెయ్యకుండా పైపైన ఏవో కార్యకలాపాల్లు చేయటం గాలిలో మేడలు కట్టినట్టే. ఈ ఓటర్లసంఘాలే ప్రభుత్వానికి, ప్రజాస్వామికవ్యవస్థకు, ప్రజాస్వామిక పార్టీలకు రక్తనాళాలు. సంఘాలు చైతన్యం పొంది కృషిచేస్తేనే రక్తం సరిగా ప్రవహిస్తుంది. పరిశుద్ధంగా ఉంటుంది. లేదా రక్తదోషంవల్ల బుద్ధిబలం, భుజబలం కుంటుపడి, ప్రజాస్వామిక వ్యవస్థ క్షీణిస్తుంది.

ఆంధ్రదేశంలో ఓటర్లసంఘ నిర్మాణం గురించి చూద్దాం. మొత్తం జనాభాలో 100 కి 87 గురు పల్లెప్రజలు. పట్టణప్రజకంటె పల్లెప్రజ సుమారు 7 రెట్లు ఉన్నారు వీరిని జాగృతం చేసి, ప్రజాస్వామిక సంప్రదాయంలో సరిగా శిక్షితం చేయనంతవరకు ప్రజాస్వామికవ్యవస్థకు సరైన పునాది ఏర్పడదు.

ఆంధ్రదేశంలో గ్రామ జనాభా మొత్తం (1941 లెక్కలప్రకారం) 1,63,93,288 మంది. ఒకొక్కొక్క కుటుంబానికి 5 గురు చొప్పున లెక్కకట్టితే, 32,78,657 కుటుంబాలు ఉన్నయన్నమాట. ఈ 5 గురిలోనూ ఒక్క వ్యక్తైనా కనీసం ఓటర్ల సంఘచైతన్యంలో పాల్గొంటే, ప్రజాస్వామిక నిర్మాణం బలిష్ఠం కాగలదు. అంటే సుమారు 6,55,731 మందైనా ఈ సంఘ నిర్మాణానికి పూనుకోవాలి. ఆంధ్రదేశంలో మొత్తం 16,270 పల్లెలున్నయ్. సగటున ప్రతి పల్లెలో 40 మంది పౌరులైనా ఇలాంటి—ఏ పార్టీతోనూ సంబంధం లేకుండా—సంఘ నిర్మాణానికి పూనుకొని, సాంఘిక, రాజకీయవిషయాల్లో కనీసం ప్రాథమికమైన తర్ఫీదును పొందినా విశేషమే. ప్రజాస్వామిక తత్వాన్ని ఆదర్శంగా ఎంచే పార్టీలు, ప్రభుత్వం, వ్యక్తులు ఈ ఓటర్లసంఘనిర్మాణాన్ని, వికాసాన్ని దోహదపఱచాలి.


ప్రమాణస్వీకరణోత్సవము

బరోడా లక్ష్మీభవన దర్బారుమంటపంలో ప్రజాప్రతినిధులైన కొత్తమంత్రులు ఉత్సవ వైభవంతో ప్రమాణస్వీకార మొనర్చినప్పటి దృశ్యాలు.


బరోడా నూతన మంత్రి వర్గము



నూతన ప్రధాని డాక్టర్ జీవరాజ మెహతా, బరోడామహారాజును పుష్పమాలాలంకృతుని చేస్తున్నారు.



జూబిలీ గార్డెన్సులో జీవరాజ్ మెహతా, జాతీయ పతాకారోహణోత్సవం జరుపుతున్నారు.



నూతన మంత్రివర్గంవారంతా జాతీయపతాకకు వందన మొనరుస్తున్నారు.

వార్తా చిత్రాలు



ఆదివారము శ్రీ విజయలక్ష్మి పండిట్ ఢిల్లీ వచ్చినప్పుడు ప్రధాని నెహ్రూ విమానము వద్ద స్వాగత మిచ్చెను. నెహ్రూ చంకన ఉన్నది ఆయన మనమడు, ఇందిరా గాంధి కుమారుడు. ఐక్యరాజ్య సమితి ప్యారిస్ సమావేశమునకు వెడలే భారతప్రతినిధివర్గమునకు శ్రీ విజయలక్ష్మిపండిట్ నాయకత్వము వహించును.



ఆగస్టు 15 న చైనాలోని భారతరాయబారి కార్యాలయమున భారత స్వాతంత్ర్య వార్షికోత్సవము జరిగెను. చైనాప్రధాని వాంగ్ షిహ్‌చీతో భారతరాయబారి సర్దార్ పణిక్కర్ ఇష్టాగోష్ఠి.




విశాఖపట్నమునుండి మద్రాసు వచ్చిన భాషారాష్ట్ర విచారణ సంఘము. పూలమాలతో మధ్యనున్నవారు సంఘాధ్యక్షులు ఎస్. కె. ధార్, కుడివైపున చివరనున్నవారు ఆంధ్రకాంగ్రెసు సమితి కార్యదర్శి గౌతు లచ్చన్న గారు.

Regd. No M 4479

గాంధీ మహాత్ముని

ఆత్మకథ



రెండు సంపుటములు

[చతుర్థ ముద్రణము]

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి అనువాదము

ఖద్దరు బైండు

ప్రతిసంపుటము పోస్టేజితో సహా వెల రూ. 5-9-0

ఒకేసారి 2 సంపుటములు పోస్టేజితో రు 10-12-0

శ్రీమద్భగవద్గీత

వ్యాఖ్యాత: శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారు

ఐదవ ముద్రణము



సంస్కృతమూలము, తెలుగున టీకా తాత్పర్య విశేషార్థ వివరణములు గల 400 పుటల గ్రంథము. గీతాధ్యయన పరులకు మిక్కిలి ఉపయుక్తమైనది.

ఖద్దరు బైండు

వెల రు 4-0-0 లు.

తపాలాఖర్చు రు. 0-9-0.

పోస్టుబాక్సు 212, ఆంధ్రగ్రంథమాల మదరాసు 1.

సర్వశ్రేష్ఠపుస్తకము ! ఇప్పుడే వెలువడినది

తెలుగు మెఱుగులు

గ్రంథకర్త: వేటూరి ప్రభాకరశాస్త్రిగారు

తెలుగుదనము, తెలుగుసంప్రదాయాలు, తెలుగుభాష అవతరించిన విధము, తెలుగు తేటదనము, తెలుగు కవితా పారమ్యము, ప్రాచీన గ్రంథాల పలుకుబడికి మనపై చెల్లుబడి, విలక్షణమైన మన అరసున్న చరిత్ర, వింత వింత నిఘంటువులు, మన గ్రంథాలలోని గ్రంథులు, అవీ ఇవీ, ఇంకా తెలుగులో ఉన్న ఎన్నో మెఱుగులను చూపెట్టుచున్న వ్యాసముల సంపుటి. శాస్త్రిగారి పాతిక ముప్ఫయి సంవత్సరాల సాహిత్య కృషి ఇందులో మూర్తీభవించియున్నది. ఆంధ్రాభిమానముగల వారందరు అవశ్యము చదువవలసిన గ్రంథము. ప్రతులకు త్వరపడవలెను.

వెల ౨ రూ. తపాలాఖర్చులు 7 అణాలు.

ఆంధ్రగ్రంథమాల

తపాలాపెట్టె 212, మదరాసు 1

ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము

ప్రథమ ద్వితీయ సంపుటములు

ప్రథమ సంపుటమునందు డిమ్మీ ౮-వ ఆకృతియందు ౬౦౦ పుటలు గలవు. ఇందు 'అ' నుండి 'అధ్వర్యు' వరకును గల విషయము గలదు. త్రివర్ణ పటములు ౮, ఇతరపటములు ౧౨౫, వివిధ విషయములు ౮౦౦ కలవు.

రెండవ సంపుటమునందు డిమ్మీ ౮-వ ఆకృతియందు ౬౦౦ లకు మించిన పుటలు కలవు. 'అఙ్గ' మొదలుకొని 'అశ్విని' వరకు గల విషయము గలదు. త్రివర్ణ పటములు ౧౦. వానిలో ౨ అమరావతీ స్తూపమునకును ౨ అనాహతమునకును చెందినవియు, ౬ దేశచిత్రపటములును గలవు ఇవిగాక మరి ౫ సాదా దేశపటములు కలవు. ప్రాచీనాంధ్రుల కళాసంపదను వ్యక్తము చేయు అమరావతీస్తూపమును గురించిన గొప్ప వ్యాసమునందు అమరావతీ శిల్పమునకు సంబంధించిన హాఫ్టోన్ బొమ్మలు రమారమి ౧౦౦ ను, వేషభూషాదుల వెల్లడించు బొమ్మలు ౫౦ వఱకును గలవు. మరియు అభినయమను వ్యాసమున భరతశాస్త్రమునందలి వేఱు వేఱు హస్తములను సూచించు బొమ్మలు ౫౬ ను 'అనాహతము' నందు షట్చక్రాదుల చిత్రములును గలవు. ఇట్లు ఆ యా వ్యాసములకు చెందిన చిత్రములు మొత్తముమీద ౨౫౦ కి పైగా నున్నవి. వివిధ విషయముల సంఖ్య ౮౦౦ వరకు నుండును. సంపుటము చక్కని స్వదేశీ చర్మముతోడను బంగారు రేఖలతోడను సంపుటీకృతము. ప్రతి సంపుటమున ౬౦౦ పుట లుండును.

ప్రతి సంపుటము వెల రూ. ౧౦.

పోస్టు ఖర్చులు : రూ. ౧-౮-౦.

రైలుద్వారా దగ్గర చోట్ల ఖర్చులు అ. ౧౨.

మేనేజరు,

ఆంధ్రవిజ్ఞానసర్వస్వ కార్యాలయము,

నెం. 7, తంబుశెట్టివీథి, మదరాసు.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty St., G. T. Madras.